నవచేతన పబ్లిషింగ్ హౌస్
దశాబ్దకాలం వెదజల్లిన విజ్ఞానం, సాహిత్యం
2015 11th Anniversary
NBH
www.navachethanabooks.in
Navachethana Vignana Samithi
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్), హైదరాబాద్-68. ఫోన్:040-29884453/54

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సామినేని రామారావు దారుణ హత్య కేసు దర్యాప్తులో ప్రభుత్వ కుట్ర కోణం 03

ఢిల్లీ అల్లర్ల కేసులో ఖాలిద్, ఇమామ్‌లకు సుప్రీం బెయిలు నిరాకరణ 05

సంపుటి 28, సంచిక: 195 | మంగళవారం | 06-01-2026 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00



## పోలవరం – నల్లమల సాగర్‌పై స్టే ఇవ్వండి

- 200 టిఎంసిలు తరలించుకునేందుకు ఎపి యత్నం
- ‘480 టిఎంసిలను మించి వాడుకునే ప్లాన్
- సుప్రీంకోర్టులో తెలంగాణ తరపున సింఘ్వీ వాదనలు
- విచారణను ఈనెల 12కు వాయిదా వేసిన అత్యున్నత న్యాయస్థానం

**న్యూఢిల్లీ :** పోలవరం నల్లమల సాగర్ ప్రాజెక్టుపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఎపి ఉల్లంఘనలకు పాల్పడటానికి సిద్ధమైందనేది ఆరోపణ అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. కమిటీ ఏర్పాటు చేశారని మీరే చెబుతున్నారని, అన్ని విషయాలపై నివేదిక ఇవ్వనీయండని తెలంగాణ తరపు న్యాయవాది అభిషేక్ సింఘ్వికి సుప్రీంకోర్టు సూచించింది. సివిల్ సూట్‌లో జోక్యం చేసుకుని నిలుపుదల చేసే అధికారం సుప్రీంకోర్టుకు ఉందా? అని సిజెఐ ప్రశ్నించారు. ఈ సందర్భంగా తమకు మధ్యంతర ఉపశమనం కల్పించాలని సింఘ్వీ కోరారు. గోదావరిలో వరద జలాల పేరుతో అసలు జలాలకు ఎసరు పెట్టాలని ఎపి ప్రయత్నిస్తోందని సుప్రీం కోర్టులో తెలంగాణ తరపున సింఘ్వీ వాదనలు వినిపించారు. ఎపి నిర్మిస్తున్న పోలవరం నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టు కేసు విచారణ సోమవారం తరువాయి 2లో

## పోలవరం- నల్లమలను కచ్చితంగా అడ్డుకుంటాం

- ప్రాజెక్టు నిర్మాణాన్ని అంగీకరించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పిన మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి
- ఎపి ప్రతిపాదనలు ముమ్మాటికీ గోదావరి జల వివాద ట్రిబ్యునల్ నిబంధనలను ఉల్లంఘించడమేనని విమర్శ
- తెలంగాణ ప్రయోజనాల పరిరక్షణకు న్యాయవాదులతో కలిసి అనుసరించాల్సిన వ్యూహాన్ని రూపొందిస్తామని వెల్లడి



ప్రజాపక్షం/హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన పోలవరంనల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టు నిర్మాణాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించే ప్రసక్తే లేదని, ఖచ్చితంగా అడ్డుకుని తీరుతామని రాష్ట్ర సాగు నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తేల్చిచెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదనలు ముమ్మాటికీ గోదావరి జల వివాద ట్రిబ్యునల్ 1980 అవార్డ్‌తో పాటు అంతరాష్ట్ర జల నిబంధనలు ఉల్లంఘించడమేనని ఆయన స్పష్టం చేశారు. శాసనసభ లాబీల్లో సోమవారం తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మంత్రి ఇష్టాగోష్టిగా మాట్లాడారు. మీడియా ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ పోలవరంనల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టును ఒక్క తెలంగాణా రాష్ట్రం మాత్రమే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలు కుడా ఆక్షేపిస్తున్నాయని ఆయన తెలిపారు. ఈ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో పోరాటం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రాంత ప్రయోజనాలను కాపాడడంతో పాటు గట్టి వాదనలు వినిపించేందుకు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ సింగ్విని నియమించిందన్నారు. సోమవారం జరగాల్సిన వాదనలు వచ్చే సోమవారం రోజుకు వాయిదా పడ్డాయని రిట్ పిటిషన్‌ను తరువాయి 2లో

# చట్టసభల్లో ఒక శక్తిగా అడుగుపెడతా



## వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి రాజకీయ పార్టీగా ‘తెలంగాణ జాగృతి’

### కల్వకుంట్ల కవిత సంచలన ప్రకటన

గన్ పార్క్ వద్ద ‘తెలంగాణ అమరవీరుల’ స్తూపం వద్ద నివాళులు

ప్రజాపక్షం/హైదరాబాద్

వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి ‘తెలంగాణ జాగృతి’ రాజకీయ పార్టీగా ఎదుగుతుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించారు. ప్రజల హక్కులను కాపాడి, వారి తరపున పని చేసేందుకు ‘తెలంగాణ జాగృతి’ ఒక శక్తిగా చట్టసభలో తిరిగి అడుగుపెడుతుందని ధీమా వ్యక్తం చేశారు. లెఫ్ట్‌పార్టీలు, మావోయిస్టు సానుభూతి పరులు, మనుగడ కొనసాగించలేకపోతున్న మావోయిస్టులు, ప్రజాస్వామ్య పద్ధతిలో పని చేసే పార్టీ రావాలనుకుంటున్న వారు ,మహిళలు, విద్యార్థులు ముందుకొచ్చి ఒక ఆడబిడ్డగా తనకు మద్దతునిచ్చి, దీవించాలని కోరారు. హైదరాబాద్‌లోని గన్ పార్క్ వద్ద ‘తెలంగాణ అమరవీరుల’ స్తూపానికి కవిత సోమవారం నివాళులర్పించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ కోసం పోరాటం చేసిన లక్షలాది మంది ఉద్యమకారులకు టిఆర్‌ఎస్ లో ఇసుమంత కూడా గౌరవం దక్కలేదని, వేలాదిగా పోస్టులు ఉన్న సరే వారికి పదవులు ఇవ్వాలని గుర్తుకు రాకపోవడం విచారకరమన్నారు. తనకు అవకాశం వచ్చినప్పటికీ చిత్రహింసలు పెట్టి, నానా విధాలుగా అవమానించి, రాజకీయంగా ఎదగనివ్వకుండా బిఆర్‌ఎస్ ఏం సాధించిందో తెలంగాణ ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. పుట్టింటి నుంచి అవమాన భారంతో అన్ని బంధాలు, బందనాలు తెంచుకుని వస్తున్నానని, అత్యంత అవమానకరంగా తనను బయటికి పంపించారని కంట తడి పెట్టారు. జనవరి 26, ఆగస్టు 15, జూన్ 2న ఒక తామ్రపత్రం మాత్రమే తెలంగాణ ఉద్యమకారులు ఆశించారని కానీ ఆ గుర్తింపు కూడా దక్కలేదని, గుర్తింపు కార్డులు ఇవ్వలేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రెండేళ్లుగా ఉద్యమకారులను, మహిళలను నిరుద్యోగులను మోసం చేస్తుందన్నారు. రాష్ట్రంలో తెలంగాణ పేరును తరువాయి 2లో



## నీటిపారుదల శాఖలో లక్షల కోట్ల అవినీతి

- ప్రశ్నించినందుకే బిఆర్‌ఎస్ నాపై కక్ష కట్టింది
- ఆ పార్టీ ఇచ్చిన ఎమ్మెల్సీ పదవిలో కొనసాగలేనని శాసన మండలిలో భావోద్వేగానికి గురైన కవిత

ప్రజాపక్షం/హైదరాబాద్

నీటిపారుదల శాఖలో లక్షల కోట్ల రూపాయాల అవినీతి జరిగిందని, అమరజ్యోతి, సచివాలయం, అంబేడ్కర్ విగ్రహం, కలెక్టరేట్ల నిర్మాణాల్లో కూడా అవినీతి జరిగిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత ఆరోపించారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో జరిగిన అవినీతిని తాను ప్రశ్నించినందుకే నిర్లక్ష్యం చేశారని, బిఆర్‌ఎస్‌లో తన భావ ప్రకటనను తరువాయి 2లో

## ఆర్‌టిసి బస్సులో సిఎం;

ప్రసాద్ ల్యాబ్స్‌లో సావిత్రి బాయి పూలే సినిమాను తిలకించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు



ప్రజాపక్షం/హైదరాబాద్

సంఘసంస్కర్త సావిత్రీబాయి పూలే జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కించిన సినిమాను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎంఎల్ఎలు, ఎంఎల్‌సిలు ప్రసాద్ ల్యాబ్స్‌లో తిలకించారు. హిందీలో సినిమాను తెరకెక్కించగా గత ఏడాది ఏప్రిల్ 25న విడుదలైంది. ఈ చిత్రానికి అనంత్ మహదేవన్ దర్శకత్వం వహించారు. జీ స్టూడియోస్, డ్యాన్సింగ్ శివ ఫిలిమ్స్ కింగ్స్ మెన్ ప్రొడక్షన్స్ ఫిలమ్స్ బ్యానర్లపై సినిమాను నిర్మించారు. చిత్రంలో ప్రతీక్ గాంధీ, పత్రలేఖ పాల్ ప్రధాన పాత్రల్లో నటించారు. కుల నిర్మూలనకు తరువాయి 12లో

## అందరికీ హెల్త్ కార్డులివ్వాలి

- ప్రభుత్వ ఆస్పత్రులలో డయాలసిస్, వెంటిలేటర్లు, ఎంఆర్ఐ తదితర వైద్యపరికరాలు అందుబాటులో ఉండేలా చూడాలి
- శాసనసభ ప్రశ్నోత్తరాల్లో ప్రభుత్వానికి సిపిఐ శాసనసభా పక్ష నేత కూనంనేని సాంబశివ రావు విజ్ఞప్తి




ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో సాధ్యమైనంత వరకు అందరికీ హెల్త్ కార్డులు జారీ చేయాలని, అన్ని ప్రభుత్వ ఆస్పత్రులలో డయాలసీస్, వెంటిలేటర్లు, ఎంఆర్ఐ తదితర వైద్యపరికరాలు, మందులు అందుబాటులో ఉండేలా చూడాలని సిపిఐ శాసనసభా పక్షం నేత కూనంనేని సాంబశివ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శాసనసభలో సోమవారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో కూనంనేని సాంబశివరావు ‘ప్రభుత్వ ఆస్పత్రులకు వెంటిలేటర్లు ఇతర వైద్య పరికరాల ఏర్పాటు’ అంశంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్రంలో తరువాయి 2లో

### మాట వినకపోతే మదురో కంటే

## భారీ మూల్యం తప్పదు



### కొత్త అధ్యక్షురాలు రోడ్రిగ్జ్‌కు ట్రంప్ హెచ్చరిక

**వాషింగ్టన్ :** మాట వినకపోతే మళ్ళీ రెండోసారి కూడా దాడిచేస్తామని వెనిజులా కొత్త అధ్యక్షురాలుగా ప్రమాణ స్వీకారానికి సిద్ధపడిన డెల్సీ రోడ్రిగ్జ్‌కు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ బరితెగించి భారీ హెచ్చరిక చేశారు. వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురోపై మెరుపుదాడిచేసి ఆగమేఘాలపై అమెరికాకు తరలించి ఖైదీగా మార్చిన ట్రంప్ అంతటితో ఆగకుండా మరింత క్రూరత్వం ప్రదర్శించారు. ‘ద అట్లాంటిక్’కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, తాను చెప్పినట్లు వినకపోతే మదురోకంటే చాలా ఎక్కువగా దారుణ పరిణామాలను చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. ‘‘మీరు ప్రభుత్వ మార్పు అనుకోండి, మరేదైనా పేరుతో పిలుచుకోండి, కానీ మీరు చేసేది ఏదైనా ఇంతకుముందు సాగినట్టు ఉండకూడదు, మా భవిష్యత్ ప్రణాళిక, మార్గదర్శకాలకు విరుద్ధంగా వ్యవహరించినా, వెనిజులాలో తాను తలపెట్టిన సంస్కరణల దార్శనిక దృక్పథానికి భిన్నంగా వ్యవహరించినాగానీ తీవ్ర మూల్యం చెల్లించాల్సి వస్తుంది’’ అని రోడ్రిగ్జ్‌కు హెచ్చరిక చేశారు. వెనిజులాకు అమెరికా ప్రభుత్వమే ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తుందని మరోవైపు సోమవారం పత్రికాగోష్ఠిలో మరోసారి ఆయన స్పష్టం చేశారు. వెనిజులా చమురు వనరులు, ఖనిజ వనరులను అమెరికాకు అనుకూలంగా అందుబాటులో ఉండేలా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. ఆ విధంగా తమకు వెనిజులా సంపదను అనుకూలంగా ఉంచితే దేశాన్ని బాగుచేస్తామని, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువస్తామని కుంటి సాకులు పలికారు. అమెరికా జోక్యం చేసుకుందన్న పేరుతో మొండి వైఖరి ప్రదర్శిస్తే సహించేది లేదన్నారు. వెనిజులాపై శనివారం తెల్లవారుజామున చేసిన చట్టవిరుద్ధ దాడిని ఆయన సమర్థించుకున్నారు. వెనిజులాలో అధికారం మారినా లేదా కొత్త పాలన ప్రారంభమైనాగానీ ఆ పాలన మునుపటికంటే మెరుగ్గా ఉండాలన్నారు. ఉపాధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ దేశాధ్యక్షురాలిరిని తాత్కాలిక అధ్య క్ష బాధ్యతలు చేపట్టాలని వెనిజులా సుప్రీం కోర్టు ఇప్పటికే ఆదేశించింది. దేశ సైనిక వర్గాలు కూడా ఆమెను అధ్యక్షురాలుగా గుర్తించాయి. మదురోను బ్రూక్లిన్‌లోని నిర్బంధ కేంద్రానికి తరలించిన తర్వాత దేశంలో ఏర్పడిన పరిస్థితులను ఆమె సమీక్షించారు. మదురోను ఆయన సతీమణిని తక్షణం విడుదల చేయాలన ఆమె ట్రంప్‌ను డిమాండ్ చేశారు. వెనిజులా సార్వభౌమాధికారాన్ని సంరక్షించేందుకు సహాయం చేయాలని లాటిన్ అమెరికా దేశాలకు ఆమె విజ్ఞప్తి చేశారు. ట్రంప్ ప్రభుత్వం వెనిజులాపై దాడి చేసి తమ అధ్యక్షుణ్ణి బందీగా తీసుకుపోయి అంతర్జాతీయ నిబంధనలను తరువాయి 12లో



## న్యూయార్క్ కోర్టులో మదురో

మొదటిసారి న్యాయస్థానానికి వచ్చిన వెనిజులా అధ్యక్షుడు

**న్యూయార్క్:** ఒక దేశానికి అధ్యక్షుడు ఇప్పుడు మరో బలమైన దేశం న్యాయస్థానం బోనులో దోషిగా నిలబడాల్సి వచ్చింది. వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురో మొదటిసారి న్యూయార్క్‌లోని న్యాయస్థానం ముందుకు రావాల్సి వచ్చింది. ఆ యనపై కేవలం స్వార్థ ఆర్థిక ప్రయోజనాలకోసం అనేక ఆరోపణలు చేస్తూ ట్రంప్ పాలనాయంత్రాంగం కోర్టులో నిలబెట్టింది. మదురో ఆయన భార్య సిలియా ఫ్లోరెస్ కోర్టుకు రాకముందునుండే కోర్టు వెలుపల ట్రంప్ వ్యతిరేక ప్రదర్శకులు, అనుకూల ప్రదర్శకులు పెద్ద సంఖ్యలో గుమిగూడి నినాదాలు ఇవ్వడం ప్రారంభించారు. మదురో కోర్టుకు హాజరైన తర్వాత తరువాయి 12లో

### అమెరికాలో సికింద్రాబాద్

## యువతి హత్య

### తమిళనాడులో ప్రియుడి అరెస్టు

ప్రజాపక్షం/హైదరాబాద్



అమెరికాలోని మేరీల్యాండలో హైదరాబాద్‌కు చెందిన యువతి గోడిశాల నిఖిత (27) హత్యకు గురైంది. ఈ కేసులో ఇంటర్ పోల్ పోలీసులు ఆమె మాజీ ప్రియుడు అర్జున్ శర్మను సోమవారం తమిళనాడులో అరెస్ట్ చేశారు. డిసెంబర్ 31 నుంచి నిఖితరావు కనిపించలేదు. జనవరి 3న అర్జున్ శర్మ అపార్ట్‌మెంట్‌లో ఆమె మృతదేహాన్ని అక్కడి పోలీసులు గుర్తించారు. కాగా.. ఈ నెల 2న అర్జున్ శర్మ నిఖిత మిస్సింగ్‌పై తరువాయి 2లో

## నేను సంతోషంగా లేను



- ఈ విషయం భారత ప్రధాని మోదీకి తెలుసు
- ఆ దేశానికి కొత్తగా సుంకాలు పెంచుతాం
- రష్యాతో చమురు సంబంధాలపై ట్రంప్ హెచ్చరిక

**న్యూయార్క్/వాషింగ్టన్:** భారత్–రష్యా మధ్య ముడి చమురు దిగుమతి సంబంధాలపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మళ్ళీ హెచ్చరిక చేశారు. భారత్‌పై కొత్తగా సుంకాలు పెంచుతామని సంకేతాలు ఇచ్చారు. తాము విధించిన ఆంక్షలు రష్యా ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీశాయని ట్రంప్ చెబుతూ భారత్ పేరు ప్రస్తావించారు. ఉక్రేన్‌లో యుద్ధం ముగించేందుకు రష్యా నుండి చమురు కొనుగోలు చేసే ఖాతాదారులపై కూడా తీవ్రమైన ఒత్తిడి తీకురావాలన్నదే తమ ప్రధాన ఉద్దేశమని ఆయన వెంట ఉన్న రిపబ్లికన్ సెనేటర్ లిండ్‌స్లే గ్రాహం చెప్పారు. రష్యా నుండి భారత్‌కు ముడి చమురు దిగుమతులు కొనసాగితే మరోసారి భారీగా సుంకాలు పెంచుతామని ట్రంప్ అన్నారు. వెనిజులాపై దాడి, ఆ దేశంలో చమురు క్షేత్రాలను స్వాధీనం చేసుకున్నామన్న కొత్త జోష్‌లో ఉన్న ట్రంప్ భారత్‌కు ఈ తాజా హెచ్చరిక చేశారు. పరిస్థితిలో మార్పు రాకపోతే చాలా త్వరగా, సునాయాసంగా భారత్‌పై అమెరికా మరోసారి సుంకాలు విధిస్తుందని అన్నారు. క్రిస్‌మస్ సెలవులు పూర్తిచేసుకుని ఫ్లోరిడాలోని తన సొంత మార్–ఎ–లాగో ఎస్టేట్ నుండి ఎయిర్‌ఫోర్స్–1 విమానంలో వాషింగ్టన్‌కు తరువాయి 12లో

## అంతర్జాతీయ నియమాలు గౌరవించలేదు

వెనిజులాపై భద్రతామండలిలో ఆందోళన 05




వెనిజులా అధ్యక్షుడు మధురో, ఆయన భార్యను బందీలుగా పట్టుకుపోవడాన్ని నిరసిస్తూ సిపిఐ హైదరాబాద్ కౌన్సిల్ ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్ వై జంక్షన్ వద్ద నిరసన ప్రదర్శన దృశ్యం

## తదుపరి లక్ష్యం
# కొలంబియా, మెక్సికో



### కొలంబియా, మెక్సికో, క్యూబా, గ్రీన్‌లాండ్‌లకు ట్రంప్ హెచ్చరికలు

**వాషింగ్టన్ :** వెనిజులా తర్వాత కొలంబియా, మెక్సికో దేశాలనే లక్ష్యంగా చేసుకున్నట్లు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తెలియజేశారు. అదేవిధంగా క్యూబా, గ్రీన్‌లాండ్ దేశాలకు కూడా హెచ్చరికలు చేశారు. వెనిజులా తర్వాత ప్రధానంగా డెన్మార్క్ నుండి ఆర్కిటిక్ ద్వీపం గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకోవడానికి మూడు దశల ప్రటనాళికను సిద్ధం చేశారన్న వార్తలు వస్తున్నాయి. వెనిజులాపై దాడి తర్వాత గ్రీన్‌లాండ్ అంశాన్ని ట్రంప్ ప్రధానంగా తెరమీదకు తెచ్చారు. దీంతో గ్రీన్‌లాండ్, డెన్మార్క్ నాయకులు తీవ్రస్థాయిలో ట్రంప్‌పై ఎదురుదాడి చేశారు. మరోవైపు ట్రంప్ "మీ వైఖరి మార్చుకోకపోతే వెనిజులాకు పట్టిన గతే పడుతుంది'' అంటూ కొలంబియా, మెక్సికో దేశాలను బెదిరించారు. దీంతో భౌగోళికంగా ఉద్రిక్తతలు మరింతగా పెరిగాయి. యావత్ ప్రపంచ భవిష్యత్ సంబంధాలను కలుషితంచేసే అసాధారణ చర్యకు అమెరికా పాల్పడిందని ఒక వైపు తీవ్ర విమర్శలు చెలరేగుతునప్పటికీ ట్రంప్ మాత్రం ఎలాంటి పశ్చాత్తాపం ప్రదర్శించకపోగా 'ఫాక్స్‌న్యూస్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మరింత దూకుడుగా లాటిన్ అమెరికా దేశాలకు తదుపరి తీవ్ర హెచ్చరికలు ప్రారంభించారు. కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో మూడు మాదక ద్రవ్యాల కర్మాగారాలకు మద్దతు ఇస్తున్నారని, ఆ దేశంపై సైనిక చర్యలకు అవకాశం ఉందని హెచ్చరించారు. కొలంబియాలో ఉన్న మూడు కొకైన్ కర్మాగారాలలో ఉత్పత్తి చేస్తున్న కొకైన్‌ను అక్రమ మార్గాలలో అమెరికాకు తరలిస్తున్నారని, ఈ చర్యలకు స్వస్తి చెప్పకపోతే కొలంబియా ప్రభుత్వాన్ని తుదముట్టిస్తామని హెచ్చరించారు. కొలంబియా దేశాన్ని ఒక రోగి పరిపాలిస్తున్నాడని విమర్శించారు. ఈ విమర్శలను గుస్తావో పెట్రో తీవ్రంగా ఖండించారు. నాపై బురద జల్లడం ఆపేయండి అని ట్రంప్‌కు హెచ్చరించారు. కాగా, మెక్సికో దేశాన్ని అధ్యక్షురాలు క్లాడియా షీన్‌బామ్ పరిపాలించడం లేదని,అక్కడి డ్రగ్ కార్టెల్స్ ముఠాలే మెక్సికో దేశాన్ని పరిపాలిస్తున్నాయని ట్రంప్ మండిపడ్డారు. మెక్సికో ప్రభుత్వం గనుక డ్రగ్ కార్టెల్స్‌ను, ఆ ముఠాల కార్యకలాపాలను అడ్డుకోకపోతే అమెరికా స్వయంగా సైనిక చర్యకు పాల్పడుతుందని హెచ్చరించారు. అమెరికాలోకి భారీ ఎత్తున మాదక ద్రవ్యాలు ప్రవేశించడానికి మెక్సికో దేశమే ఒక ముఖద్వారంగా మారిందని ట్రంప్ అన్నారు.

**వ్యూహాత్మక భద్రత రీత్యా అమెరికాకు గ్రీన్‌లాండ్ కావాలి**

ఇక ప్రపంచంలోనే అతిపెద్ద దీవి దేశం గ్రీన్స్‌లాండ్ జాతీయ భద్రతా రీత్యా అమెరికా అధీనంలో ఉండాల్సిన అవసరం ఉందని వెనిజులా దురాక్రమణ నేపథ్యంలో ట్రంప్ మరోసారి డిమాండ్ చేశారు. గ్రీన్‌లాండ్స్ అమెరికా అధీనంలోనే ఉండాలన్నారు. ప్రచ్ఛన్నయుద్ధ కాలం (1945–1991)లో గ్రీన్‌లాండ్ అత్యంత కీలకమైన ప్రాంతంగా ప్రాముఖ్యత పొందింది. ఈ ప్రాంతంలో అమెరికాథులే వైమానిక స్థావరాన్ని నడిపింది. రష్యా, చైనా, ఉత్తర కొరియాల నుండి వచ్చే ప్రమాదకరమైన గగనతల క్షిపణులు, ఆయుధాలను అదుపు చేయడానికి వ్యూహాత్మకంగా అమెరికాకు ఇదెంతో ముఖ్యమైన ప్రాంతంగా ట్రంప్ భావిస్తున్నారు. కీలక ఆయుధాలను ఆ ప్రాంతంలో మోహరిస్తామని ట్రంప్ అన్నారు. రష్యా, చైనా జలాంతర్గాములు డెన్మార్క్, గ్రీన్‌లాండ్స్ ప్రాంతాల్లోనే తచ్చాడుతున్నాయని ఆరోపించారు. అవసరమైతే గ్రీన్‌లాండ్స్ ను ఎంతకైనా కొనుగోలు చేస్తామని అధికారంలోకి వచ్చిన తర్వాత అనేకసార్లు ట్రంప్ ప్రకటనలు చేశారు. వాస్తవానికి గ్రీన్‌లాండ్ ప్రాంతం డెన్మార్క్ దేశం అధీనంలో ఉంది. దీంతో డెన్మార్క్ ప్రధానమంత్రి మెట్టే ఫ్రెడరిక్సన్ ట్రంప్‌కు విజ్ఞప్తి చేస్తూ గ్రీన్‌లాండ్‌ను ఆక్రమించాలనే ఆలోచనలు విరమించుకోవాలని, బెదిరింపులు ఆపాలని కోరారు. "గ్రీన్స్‌లాండ్‌ను స్వాధీనం చేసుకోవాలనే ఆలోచనలో అర్థంలేదు, డెన్మార్క్ రాజ్యంలోని మూడు దేశాలలో దేనిని ఆక్రమించే హక్కు అర్హత ట్రంప్‌కు లేదు'' అని ఫ్రెడరిక్సన్ అన్నారు. భౌగోళికంగా గ్రీన్‌లాండ్ ఉత్తర అమెరికాలో ఉన్నప్పటికీ రాజకీయంగా, సాంస్కృతికంగా దీర్ఘకాలంగా గ్రీన్‌లాండ్ ఐరోపా ఖండంతో గాఢానుబంధాన్ని పెనవేసుకుని ఉంది. ఐతే పశ్చిమార్ధగోళం అంతటా తమ పెత్తనమే ఉండాలని ఇప్పుడు ట్రంప్ 'డోన్రో' సిద్ధాంతం లేవదీశారు.

**క్యూబాకు మార్కో రుబియో హెచ్చరిక**

క్యూబా దేశం కూడా కుప్పకూలిపోయే స్థితిలో ఉందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్ర విమర్శలు చేశారు. క్యూబా దేశం ఒక విఫల రాజ్యమని, పరిపాలనాపరంగా ఆ దేశం విఫలమైందని విమర్శించారు. క్యూబా ప్రజలపై తమకు చాలా సానుభూతి ఉందని, వారికి సహాయం చేయాలనుకుంటున్నామన్నారు. ఒకవైపు బెదిరింపులు, మరోవైపు సన్నాయి నొక్కులతో కమ్యూనిస్టు పాలకదేశాలపై ట్రంప్ తన ఒత్తిడిని పెంచారు. మరోవైపు అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో కూడా క్యూబా ప్రభుత్వానికి తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. తదుపరి తమ లక్ష్యం క్యూబా కావచ్చునన్నారు. క్యూబా దేశం చాలా ఆర్థిక ఇబ్బందులలో ఉందని అన్నారు. క్యూబాపై భవిష్యత్ దాడులు చేస్తారా? అని ప్రశ్నించగా వ్యాఖ్యానించేందుకు ఆయన నిరాకరిస్తూ, వెనిజులాలో మదురో ప్రభుత్వానికి క్యూబా మద్దతు ఇస్తోందని, అందువల్ల తాము క్యూబాకు ఎట్టిపరిస్థితుల్లో కాపాడే ప్రయత్నం చేయబోమన్నారు.

# ప్రజాస్వామ్య సంక్షేమ పరిపాలనే బిఎన్‌పి లక్ష్యం

### వామపక్ష కూటమి నేతలతో తారిఖ్ అహ్మద్ వ్యాఖ్య



**ఢాకా:** విముక్తి యుద్ధం (1971) లేకుండా బంగ్లాదేశ్ ఉనికే లేదని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బిఎన్‌పి) తాత్కాలిక ఛైర్మన్ తారిఖ్ రెహ్మాన్ అన్నారు. ఢాకాలోని గుల్షన్‌లో సోమవారం ఆయన బిఎన్‌పిపార్టీ కార్యాలయంలో వామపక్ష అనుకూల "డెమోక్రటిక్ యునైటెడ్ ఫ్రంట్'' కూటమి నాయకులతో సమావేశమయ్యారు. బంగ్లాదేశ్ సోషలిస్ట్‌పార్టీ ప్రధాన కార్యదర్శి, ఈ కూటమి కేంద్ర నాయకుడు బజ్లుర్ రషీద్ ఫిరోజ్ ఈ సమావేశం వివరాలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బంగ్లాదేశ్‌లో స్వేచ్ఛాయుతమైన, ప్రజాస్వామ్య సంక్షేమ పరిపాలనను పునరుద్ధరించాల్సిన ఆవశ్యకతను ఉద్ఘాటించారు. ఈ దిశగానే దేశంలో తాము పోరాటం చేస్తామని, పాలనకు పురిగొల్పుతామని అన్నారు. దేశం ఒక ప్రజాస్వామ్య సంక్షేమరాజ్యంగా వెలుగొందాలని, ఈ అంశం కేంద్రంగానే ప్రజలు పాటుపడాలని అన్నారు. ఖలీదాజియాకు నివాళులు అర్పించేందుకు, వారి కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలియజేసే ప్రధాన ఉద్దేశంతో సోమవారం ఉదయం ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బిఎన్‌పి నాయకులు, డెమోక్రటిక్ యునైటెడ్ ఫ్రంట్ నాయకులు ఉమ్మడిగా దేశంలో నెలకున్న పరిస్థితులను క్షుణ్ణంగా చర్చించారు. రాజకీయ అభిప్రాయాలను పరస్పరం ఇచ్చిపుచ్చుకున్నారు. గడచిన 17 సంవత్సరాలుగా తారిఖ్ రెహ్మాన్ విదేశాల్లో ఉన్నారని, ఇప్పుడు ఆయన కుటుంబానికి తాజాగా పెద్ద కష్టం వాటిల్లిందని, ఈ విషయంలో సంతాపం తెలియజేయడంకోసం తాము వచ్చామని బజ్లుర్ రషీద్ ఫిరోజ్ పాత్రికేయులకు చెప్పారు. 1971లో జరిగిన విముక్తి యుద్ధమే బంగ్లాదేశ్ స్థాపనకు మూలమని తారిఖ్ చెప్పారన్నారు. తారిఖ్ లండన్ నుండి 17 ఏళ్ళ తర్వాత గత ఏడాది డిసెంబరు 25న బంగ్లాదేశ్‌కు తిరిగి వచ్చారు. ఫిబ్రవరిలో జరిగే ఎన్నికలలో ప్రధానమంత్రి పదవికి ఆయన పోటీ పడే అవకాశాలున్నాయి. విముక్తి యుద్ధం లేకుండా అసలు బంగ్లాదేశ్ ఉనికే లేదని ఆయన అన్నారని ఫిరోజ్ చెప్పారు.

## గత ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే
# 'పిఎం కుసుమ్ పథకం' అమలు కాలేదు

### శాసనమండలిలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/హైదరాబాద్:**పదేళ్ల క్రితమే కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన పిఎం కుసుమ్ పథకాన్ని గత రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో తెలంగాణలో అమలు కాలేదని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. శాసనమండలిలో సోమవారం ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు సూర్యఘర్ పథకం, సోలార్ విలేజ్‌ల ఏర్పాటు అంశంపై అడిగిన ప్రశ్నలకు ఉప ముఖ్యమంత్రి సమాధానం ఇచ్చారు. అప్పట్లో ప్రతిపాదనలు పంపకపోవడంతో ఇప్పుడు కేంద్రం నిధులు లేవు అని చెబుతోందన్నారు. ఈ పథకం కింద తెలంగాణకు గరిష్టంగా కనెక్షన్లు కేటాయించాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి తాను కేంద్ర విద్యుత్ శాఖ మంత్రిని కలిసి, నిధుల కోసం లిఖితపూర్వకం గా విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో గ్రీన్ పవర్ ఉత్పత్తికి ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యం ఇస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. అయితే లీజు రైతులకు పిఎం కుసుమ్ వర్తింపజేయబోమని కేంద్రం స్పష్టం చేయడం అడ్డంకిగా మారిందని తెలిపారు. గ్రీన్ ఎనర్జీ ద్వారా ఆదాయం రైతులకే చేరుతుందని, అందువల్ల లీజు నిబంధనను సవరించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. అవసరమైతే రైతుల వాటాను రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని, కేంద్రం నుంచి పీఎం కుసుమ్ కింద కనెక్షన్లు మంజూరు చేయాలని కోరామని వివరించారు.

**మూడు దశల్లో 94 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు : శాసనమండలిలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖలో ప్రజలకు మరింత సులభమైన, పారదర్శకమైన, అవినీతిరహిత సేవలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అనేక సంస్కరణలను అమలు చేస్తోందని రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వ్యవస్థను పూర్తిగా ఆధునీకరిస్తున్నట్లు తెలిపారు. శాసనమండలిలో ఎమ్మెల్సీ ఏ.వి.ఎన్. రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఆస్తుల రిజిస్ట్రేషన్ కోసం ప్రజలు గంటల తరబడి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద, చెట్ల కింద నిరీక్షించాల్సిన పరిస్థితికి ముగింపు పలుకుతున్నామని చెప్పా రు. రాష్ట్రంలో మొత్తం 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా, వాటిలో 94 అద్దె భవనాల్లో, 50 ప్రభుత్వ భవనాల్లో కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ 94 కార్యాలయాలకు మూడు దశల్లో శాశ్వత భవనాలు



నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. మొదటి దశలో ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లో ఉన్న 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 11 క్లస్టర్లుగా విభజించి సమీకృత భవనాలు నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ఈ 39 కార్యాలయాల నుంచే రాష్ట్రానికి 69 శాతం ఆదాయం వస్తోందని చెప్పారు. గచ్చిబౌలిలోని తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ (తాలిమ్) వద్ద రంగారెడ్డి, గండిపేట్, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి, ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన జరిగిందన్నారు. ఈ నెలాఖరులోగా మిగిలిన 10 సమీకృత భవనాలకు కూడా శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. స్లాట్ బుకింగ్ విధానం అమలులోకి రావడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియకు పట్టే సమయం గణనీయంగా తగ్గిందని, ఒక్కో డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ కేవలం 18 నుంచి 21 నిమిషాల్లోనే పూర్తవు తోందన్నారు.

గిరిజనులు, గిరిజనేతరుల ఆరాధ్య దైవాలైన సమ్మక్క– సారలమ్మ మహాజాతరను దృష్టిలో ఉంచుకుని మేడారం ప్రాంతాన్ని సుమారు రూ.200 కోట్లకు పైగా వ్యయంతో ఆధునీకరిస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శాసనమండలిలో కాంగ్రెస్ సభ్యులు, టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, సిపిఐ సభ్యులు నెల్లికంటి సత్యం, కల్వకుంట్ల కవిత, తీన్మార్ మల్లన్న అడిగిన ప్రశ్నలకు సమాధానంగా మంత్రి మాట్లాడుతూ ఈ పనుల్లో ఇప్పటికే దాదాపు 95 శాతం పూర్తయ్యాయని తెలిపారు. కనీసం 200 సంవత్సరాలకు పైగా నిలిచేలా రాతి కట్టడాలతో మేడారం ఆధునీకరణ పనులు చేపట్టామని చెప్పారు. మేడారం పరిసర ప్రాంతాల్లో సుమారు 10 కిలోమీటర్ల మేర నాలుగు లైన్ల రహదారుల నిర్మాణం చేపట్టినట్లు వివరించారు. ఈ నెల 29 నుంచి 31 వరకు నిర్వహించనున్న మేడారం మహాజాతరకు కుంభమేళాను తలపించేలా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి చెప్పారు.

**బలహీన వర్గాల అభివృద్ధికి న్యాయం చేయాలి : మంత్రి పొన్నం ప్రభాకర్**

బలహీన వర్గాల అభివృద్ధికి న్యాయం చేయాలనే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. శాసనమండలిలో ఎమ్మెల్సీలు నెల్లికంటి సత్యం, బండా ప్రకాష్, అంజిరెడ్డి లు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. గత ప్రభుత్వం గురుకులాలు ఏర్పాటు చేసినప్పటికీ భవనాలు నిర్మించకపోవడంతో అద్దెలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం తరపున అద్దెలు సకాలంలో చెల్లిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో ఎంజెపిలలోనే లక్షా 50 వేల మంది విద్యార్థులు చదువుతున్నారని, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల కలిపి సుమారు 10 లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని తెలి



పారు. బడ్జెట్‌లో బలహీన వర్గాలకు రూ.11 వేల కోట్లు కేటాయించామని, విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం చేసిన అప్పుల కారణంగా కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు.

**బిసిలు కేవలం పన్ను కట్టే బానిసలుగా మారిపోయారా?: తీన్మార్ మల్లన్న**

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ బిసిలు కేవలం పన్ను కట్టే బానిసలుగా మారిపోయారా? అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేస్తారా? చేయరా? అంటూ ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. బడ్జెట్‌లో బిసిలకు రూ.11,500 కోట్లు కేటాయించినప్పటికీ ఖర్చు చేసింది కేవలం రూ.2,500 కోట్లు మాత్రమేనని తెలిపారు. బిసి విద్యార్థుల స్కాలర్షిప్‌లకు రూ.1,908 కోట్లు కేటాయించి కేవలం రూ.365 కోట్లు మాత్రమే ఇచ్చారన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రతి ఏడాది బిసిలకు రూ.20 వేల కోట్లు ఇస్తామని చెప్పి కాంగ్రెస్‌లో చేరామని గుర్తు చేశారు.



# శాసనసభలో మరో రెండు కీలక బిల్లులు ఆమోదం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** శాసనసభ సోమవారం మరో రెండు కీలక బిల్లులను ఆమోదించింది. కొత్తగూడెం డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీకి చట్టబద్ధతను కల్పిస్తూ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తరుపున వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహా ప్రవేశపెట్టిన తెలంగాణ యూనివర్సిటీల చట్ట సవరణ బిల్లు 2026కు సభ ఆమోదం ముద్ర వేసింది. అదేవిధంగా జిఎస్‌టి కౌన్సిల్ సిఫార్సుల మేరకు గత సెప్టెంబర్‌లో ప్రభుత్వ తీసుకువచ్చిన ఆర్డినెన్స్‌కు చట్ట బద్ధత కల్పిస్తూ తెలంగాణ వస్తువులు, సేవలపై పన్ను సవరణ చట్టం 2026 బిల్లును ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తరుపున పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సభలో ప్రవేశ పెట్టిన బిల్లు ఆమోదం పొందింది. అయితే ఈ బిల్లును ఎంఐఎం పూర్తిగా వ్యతిరేకిస్తూ సభ నుంచి వాకౌట్ చేసింది.

పంచాయతీరాజ్ చట్టంలోని 21వ సెక్షన్‌కు సంబంధించిన సవరణ బిల్లును శాసనమండలి ఏకగ్రీవంగా ఆమోదించింది. ఇద్దరు పిల్లలకు మించి సంతానం ఉంటే గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి అనర్హులనే నిబంధనను తొలగిస్తూ ఈ సవరణ తీసుకువచ్చారు. ఈ బిల్లును మంత్రి సీతక్క శాసనమండలిలో ప్రవేశపెట్టారు. ఈ అంశంపై జరిగిన చర్చలో ఎమ్మెల్సీలు మహేశ్ కుమార్ గౌడ్, సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పాల్గొన్నారు. గతంలో దీనికి సంబంధించి ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయగా, నిన్న శాసనసభ ఈ బిల్లును ఆమోదించింది.

అనంతరం శాసనమండలిలో కూడా బిల్లుకు ఏకగ్రీవ ఆమోదం లభించింది. తెలంగాణ ప్రజలను జయ జయహే తెలంగాణ గీతం ద్వారా ఏకంచేసిన కవి, గాయకుడు అందెశ్రీ అని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. అందెశ్రీ కుటుంబాన్ని ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యతగా భావించినట్లు అందెశ్రీ కుమారుడు దత్త సాయికి ఉన్నత విద్యా శాఖ పరిధిలోని డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగం కల్పించే బిల్లును ఆయన మండలిలో ప్రవేశపెట్టారు. 2025 నవంబర్ 25న ఆర్డినెన్స్ నంబర్–7 ద్వారా ఈ నియామకం చేపట్టినట్లు తెలిపారు. ఆ రోజు శాసనమండలి సమావేశం లేకపోవడంతో, నేడు ఆ ఆర్డినెన్స్‌ను శాసనమండలి సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించడం హర్షణీయమని భట్టి తెలిపారు.

## యువతి హత్య
(మొదటి పేజీ తరువాయి)

పోలీసులను ఆశ్రయించాడు. హోవార్డ్ కౌంటీ పోలీసులకు నిఖిత మిస్సింగ్‌పై కంప్లైంట్ చేశాడు. చివరిగా ఆమెను న్యూ ఇయర్ రోజున చూసినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. అదేరోజున అతను ఇండియాకు వచ్చాడు. దీంతో పోలీసులకు అర్జున్‌పై అనుమానం కలిగింది. అతని అపార్ట్‌మెంట్‌లో తనిఖీ చేయగా 3వ తేదీన నిఖిత మృతదేహం లభ్యమైంది.

ఈ కేసులో అతడిని అనుమానితుడిగా చేర్చారు. ఆపై అరెస్ట్ వారెంట్ జారీ చేశారు. అయితే.. అర్జున్ అమెరికాలో లేకపోవడంతో అతని ఆచూకీ కోసం యుఎస్ ఫెడరల్ ఏజెన్సీలు భారత్ అధికారులను సంప్రదించాయి. ఈ క్రమంలో ఇంటెలిజెన్స్ అధికారుల నుంచి అందిన సమాచారంతో ఇంటర్ పోల్ పోలీసులు తమిళనాడులో అర్జున్‌ను అరెస్ట్ చేశారు.

అతడిని అమెరికా పోలీసులకు అప్పగించేందుకు భారత్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా.. గోడిశాల నిఖిత 2025 ఫిబ్రవరి నుంచి వేదా హెల్త్‌లో డేటా అండ్ స్ట్రాటజీ అనలిస్ట్‌గా పనిచేస్తుంది.

మేరీల్యాండలోని ఎల్లికాట్ సిటీలో స్థిరపడింది. ఇటీవలే ఆమె కంపెనీ నుంచి ఆల్ ఇన్ అవార్డు అందుకున్నట్లుగా కుటుంబ సభ్యులు తెలిపారు.

## అందరికీ హెల్త్ కార్డులివ్వాలి
(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ ఆస్పత్రులు, మౌలిక సదుపాయాలు, వైద్య పరికరాలు, ఉద్యోగుల వేతనాలు, వైద్య ఉద్యోగుల ఖాళీల భర్తీ, బడ్జెట్ కేటాయింపులు తదితర అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అమెరికా లాంటి దేశాల్లో వైద్య రంగం పూర్తిగా ఇన్సూరెన్స్ నియంత్రణలో ఉంటుందని, తెలంగాణ రాష్ట్రంలో కూడా ఇన్సూరెన్స్ అందరికీ వర్తింపజేసే విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించాలని సూచించారు. ఏజెన్సీ ఏరియాలో వ్యాధులు ప్రబలినప్పుడు ప్రజలు ఇబ్బందిపడుతున్నారని, ప్రభుత్వం మరింత అప్రమత్తమై తగిన చర్యలు తీసుకోవాలని కూనంనేని సాంబశివరావు కోరారు. డయాలసిస్ బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం ఇంతకు ముందు పెంచిన డయాలసిస్ పరికరాలు సరిపోవడంలేదని, కొత్తగూడెంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా, ఏరియా ఆస్పత్రులలో మరిన్ని పెంచాలన్నారు. పాల్వంచ ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా చేసే ఆలోచన ప్రభుత్వానికి ఉందా? అని ప్రశ్నించారు. కరోనా సమయంలో వెంటిలేటర్ల కొరతతో అనేక మంది మరణించారని గుర్తు చేశారు. ఎంతో ప్రతిష్టాత్మకమైన గాంధీ, ఉస్మానియా, నిమ్స్ ఆస్పత్రుల అభివృద్ధికి కృషి చేయాలని, అందుకు తగిన పరికరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. కొత్తగూడెం ప్రధాన ఆస్పత్రి నుంచి మొదలు అనేక ప్రభుత్వ ఆస్పత్రులలో వైద్యుల కొరత ఉన్నదని, తద్వారా పేదలు ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చాలా ఆస్పత్రులలో మందులు అందడంలేదనే ఫిర్యాదులు అందుతున్నాయని, ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. చిన్న పిల్లల ఆరోగ్య సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. 104,108 వాహనాలు సమయానికి చేరుకునే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని, ప్రతి ఏరియా ఆస్పత్రికి అంబులెన్సును ఏర్పాటు చేయాలని అన్నారు. ఎఎన్‌ఎంలు, సెకండ్ ఎఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, స్కావెంజర్లు, కాంట్రాక్ట్ శానిటరీ వర్కర్లు, పేషంట్ కేర్ వర్కర్లు, సెక్యూరిటీ కార్మికులకే కేవలం రూ.11 వేల వేతనాన్ని మాత్రమే చెల్లిస్తున్నారని, కనీసం రూ.18 వేల ఇవ్వాలనే నిబంధనలు ఉన్నాయని, వాటిని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆర్‌ఎంపి, పిఎంసిలకు శిక్షణ ఇచ్చి, వారికి గౌరవ ప్రదమైన అవకాశాన్నికల్పించాలన్నారు. నేషనల్ హెల్త్ పాలసీ 2017 సూచనల ప్రకారం వైద్య ఆరోగ్య రంగానికి కేంద్రం జిడిపిలో 6 శాతం బడ్జెట్ ఉండాలని, రాష్ట్రంలో 8 శాతం బడ్జెట్ నిధులను కేటాయించాలని, ప్రతి ఏడాది ఒక్క శాతం పెంచాల్సి ఉన్నదని గుర్తు చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో వైద్య రంగానికి 4.06 శాతం మాత్రమే ఉండడం బాధకరమైనప్పటికీ, గత ఏడాది కంటే 8 శాతం అధికంగా ఉందని వివరించారు. జిడిపిలో వైద్య రంగానికి అమెరికాలో 16.7 శాతం, జర్మనీలో 11.5 శాతం, కెనాడలో 11.3 శాతం, ఇంగ్లండ్‌లో 10.4 శాతం, ఆస్ట్రేలియాలో 10.3 శాతం , ఆసియా, స్విడన్‌లలో 11. 2 శాతం ఉండగా, భారతదేశంలో మాత్రం 1.94 శాతం మాత్రమే బడ్జెట్‌లో నిధులను కేటాయించారని సాంబశివరావు వివరించారు. ప్రతి ఏటా ఒక శాతం పెంచుకుంటూ త్వరిగతిన కేటాయిస్తే, స్టాండర్డ్ కేటగిరీలో వెళ్తుందని, తద్వారా పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. వివిధ ఆస్పత్రులలో ఆరోగ్యశ్రీ కోటా అయిపోయిందని బాధితులకు పూర్తి స్థాయి చికిత్స అందకముందే బయటికి పంపిస్తు న్నారని, కోటా ముగిసినప్పటికీ పూర్తి స్థాయి వైద్యాన్ని అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయుష్మాన్ భారత్ స్కీమ్‌ను కేవలం ఉస్మానియా, ఆస్పత్రికి పరిమితం చేశారా? అని ప్రశ్నించారు.

## అవినీతి
(మొదటి పేజీ తరువాయి)

అణచివేశారని, ప్రశ్నించినందుకే తనపైన కక్షకట్టారని విమర్శించారు. శాసనమండలిలో సోమవారం కవిత మాట్లాడుతూ భావోద్వేగానికి గురై కంట తడిపెట్టారు. బిఆర్‌ఎస్ ఇచ్చిన ఎంఎల్‌సి పదవిలో తాను కొనసాగలేనని, తన రాజీనామాను ఆమోదించాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ధర్నా చౌక్ తొలగింపు, రైతుల అరెస్టులు, ఉద్యమకారుల పట్ల నిర్లక్ష్యం వంటి అంశాలపై కవిత ఆవేదన వ్యక్తం చేశారు. సిద్దిపేట, సిరిసిల్లలో నిర్మించిన కలెక్టరేట్లు ఒక్క వర్షానికే మునిగిపోయాయని, ఇసుక దందాల కోసమే నేరెళ్ల దళిత బిడ్డలపై దురాగతం జరిగిందని,బోధన్ షుగర్ ఫ్యాక్టరీ తెరవకపోవడం తనకు అవమానంగా మారిందన్నారు. గత ప్రభుత్వ నిర్ణయాల్లో తన పాత్ర లేదని స్పష్టం చేశారు. పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు పాస్ కావడంలో తన వంతు కృషి ఉందన్నారు.

కెసిఆర్ దేశ రాజకీయాల్లోకి వెళ్లేందుకు తాను ఒప్పుకోలేదని, తెలంగాణలో ఉన్న సమస్యలను, పనులను పక్కన పెట్టి దేశ రాజకీయాలకు వెళ్లడం ఎందుకని తాను ప్రశ్నించినట్లు కవిత వివరించారు. తెలంగాణ ఉద్యమకారుల మాటలు కెసిఆర్‌కు చేరకుండా అడ్డుకుంటున్నారని, ఉద్యమ ద్రోహులను బిఆర్‌ఎస్ నెత్తిన పెట్టుకుందని ఆరోపించారు.

**నైతికత లేని బిఆర్‌ఎస్‌లో ఉండడం ఇష్టం లేదు...**

నోటీసులు ఇవ్వకుండానే తనను వివరణ అడగకుండా సస్పెండ్ చేయడం అన్యాయమని, బిఆర్‌ఎస్ రాజ్యాంగం కేవలం ఎనిమిది పేజీలే ఉండటం ఒక జోక్ అని కవిత ఎద్దేవా చేశారు. తన సస్పెన్షన్‌ను లీగల్‌గా ఛాలెంజ్ చేయవచ్చని, కానీ నైతికత లేని బిఆర్‌ఎస్‌లో ఉండడం తనకు ఇష్టం లేదన్నారు. ఈడి, సిబిఐ కేసుల్లో తాను మూడేళ్లు ఒంటరిగా పోరాడినప్పటికీ బిఆర్‌ఎస్ తనకు అండగా నిలువలేదని, బిజెపి తనను జైలుకు పంపినప్పుడు బిఆర్‌ఎస్ నేతలు మౌనంగా ఉన్నారని, తనది ఆస్తుల పంచాయితీ కాదని, ఆత్మగౌరవ పంచాయితీ అని లక్ష్మి నరసింహా స్వామి,తన పిల్లల మీద ఒట్టు వేసి చెప్పారు. తనది పూర్తిగా ఆత్మగౌరవ పోరాటమేనని అన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలను బిఆర్‌ఎస్ పట్టించుకోలేదని ఆరోపించారు. ప్రస్తుతం తాను సభ నుంచి ఒక వ్యక్తిగా వెళ్తున్నానని, భవిష్యత్‌లో శక్తిగా తిరిగి వస్తానని తెలిపారు. తెలంగాణ కోసం కొత్త రాజకీయ వ్యవస్థను నిర్మిస్తానని, విద్యార్థులు, నిరుద్యోగులు, మహిళల పక్షాన ఉండే విధంగా పార్టీని ఏర్పాటుచేస్తామన్నారు.

## అడ్డుకుంటాం
(మొదటి పేజీ తరువాయి)

సూట్ పిటిషన్‌గా మార్చి దాఖలు చేయాలని సూచించినట్లు మంత్రి వెల్లడించారు. వచ్చే సోమవారం జరగనున్న వాదనలకు స్వయంగా తాను హాజరు అవుతానని, మళ్ళీ స్టే ఆర్డర్ కోరతామని తెలిపారు. ఇదే విషయమై రానున్న రెండు రోజుల్లో న్యాయవాదులతో ప్రత్యేకంగా మరో సమావేశం నిర్వహించి తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు అనుసరించాల్సిన వ్యూహాన్ని రూపొందిస్తామన్నారు.

మాజీ మంత్రి హరీష్‌రావు చూపిస్తున్న లేఖ సిడబ్ల్యూసి అంతర్గతంగా సమాచారం కోసం పంపిన లేఖ మాత్రమే నని, ఎంత మాత్రం సిడబ్యుసి ఆమోదించినట్లు కాదని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర జల హక్కులపై ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకు బిఆర్‌ఎస్ పార్టీ పూనుకుందని ఆ పార్టీ నాయకులు చేస్తున్న ఆరోపణలు అర్ధరహితమని తొసిపుచ్చారు. పోలవరంనల్లమల ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం జిఆర్‌యంబి, పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ లతో పాటు కేంద్ర జల కమిషన్, కేంద్ర పర్యావరణ,అటవీ మంత్రిత్వ శాఖ, కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖలకు లేఖలు రాశామని, తెలంగాణ ప్రభుత్వ అభిప్రాయంతో ఈ సంస్థలన్నీ ఏకీభవించాయని ఆయన పేర్కొన్నారు. డిసెంబర్ 4న కేంద్ర జల సంఘం రాష్ట్ర ప్రభుత్వానికి రాసిన లేఖనే ఇందుకు నిదర్శనమన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులను నిలువరించడంలో విజయం సాధించమన్నారు. తెలంగాణా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మీదటనే రాయలసీమ ఎత్తిపోతల పథకానికి బ్రేక్ పడిన విషయాన్ని తెలంగాణా సమాజం గుర్తించుకోవాలన్నారు. కొత్తగా ఏర్పడ్డ తెలంగాణా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన బిఆర్‌ఎస్ పాలకులు జల వనరుల నిర్వహణలో ఘోరంగా విఫల మయ్యారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

## అడుగుపెడతా
(మొదటి పేజీ తరువాయి)

తనలో నింపుకుని, అస్తిత్వం కోసం పోరాడే పార్టీ రావాల్సి ఉందన్నారు. తెలంగాణ ఉద్యమకారులు, అమర వీరుల కుటుంబాలు కూడా జాగృతి లో చేరాలని విజ్ఞప్తి చేశారు. తన పోరాటం ఆత్మగౌరవ పోరాటమేనని కవిత అన్నారు.

## స్టే ఇవ్వండి
(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వం లోని ధర్మాసనం ఎదుట జరిగింది. తెలంగాణ తరఫున సింఘ్వీ వాదనలు వినిపిస్తూ.. నల్లమల సాగర్ ద్వారా గోదావరి జలాల్లో అవార్డు ప్రకారం కేటాయించిన 480 టిఎంసిలకు మించి వాడుకునేందుకు ఎపి యత్నిస్తోందన్నారు. వరద జలాల పేరుతో నీటిని తరలించేందుకు ప్రయత్నిస్తోందన్నారు. 200 టిఎంసిలు తరలించేందుకు ఎపి ప్రయత్నిస్తున్నదని చెప్పారు. తెలంగాణ కొత్తగా ఏర్పడిన రాష్ట్రమని, అనేక ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయని అన్నారు. వరద జలాలు అనేది ఎక్కడా లేదని అన్నారు. ముఖ్యంగా గోదావరి నదిలో తెలంగాణకు ఉన్న 968 టిఎంసిల నీటి వాటాకు ఈ ప్రాజెక్టు వల్ల ముప్పు పొంచి ఉందన్నారు. కేంద్ర జల సంఘం ఇచ్చిన ఆదేశాలను కూడా ఎపి పట్టించుకోవడం లేదు అని సింఘ్వీ వాదించారు. ఈ ప్రాజెక్టుపై తక్షణమే స్టే ఇవ్వాలని కోరారు. ఎపి తరపున ముకుల్ రోహిత్గీ వాదనలు వినిపిస్తూ.. ఈ ప్రాజెక్టు ఇంకాప్రాథమిక దశలోనే ఉందని, కేవలం డిపిఆర్, సర్వేల కోసం మాత్రమే టెండర్లు పిలుస్తున్నా మని ఆయన స్పష్టం చేశారు. నా ఇల్లు నేను కట్టుకుంటే పక్కవారికి అభ్యంతరం ఏంటీ అనే ఆసక్తికరమైన ఉదాహరణతో రోహత్గి తన వాదన వినిపించారు. రాయలసీమ వంటి కరవు ప్రాంతాలకు నీటిని అందించడమే తమ లక్ష్యమని ఇందులో ఎలాంటి ఉల్లంఘనలు లేవని స్పష్టం చేశారు. సముద్రంలోకి వృథాగా పోతున్న జలాలను వాడుకోవడమే తమ ఉద్దేశమని తెలిపారు. ఇరు వర్గాల వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం మధ్యవర్తిత్వం ద్వారా సమస్యను పరిష్కరించుకునే అవకాశాలను పరిశీలించాలని సూచిస్తూ తదుపరి విచారణను వచ్చే సోమవారానికి వాయిదా వేశారు.

# త్వరలోనే హెల్త్ కార్డులు

అసెంబ్లీలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రకటన



**ప్రజాపక్షం/హైదరాబాద్:** నిమ్స్ ఆస్పత్రిలో కొత్తగా సుమారు 850 పోస్టులను అతి త్వరలోనే భర్తీ చేయబోతున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ప్రభుత్వ హాస్పిటల్స్ అదనంగా 490 వెంటిలేటర్లు, 9 ఎంఆర్ఐ యంత్రాలు అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. హెల్త్ కార్డులకు త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. శాసనసభలో సోమవారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు డాక్టర్ మురళీనాయక్, లక్ష్మారెడ్డి, బిజెపి ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు, ఎంఐఎం ఎమ్మెల్యే మీరాజ్ జుల్ఫీకర్ అలీ అడిగిన ప్రశ్నకు మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వ హాస్పిటల్స్‌లో సుమారు 1790 వెంటిలేటర్ బెడ్లు ఉన్నాయని, ప్రభుత్వ హాస్పిటల్స్‌లో వైద్య సేవలు మెరుగుపడ్డాయని, తద్వారా ప్రభుత్వ హాస్పిటళ్లకు చికిత్స నిమ్మితం వచ్చే పేషెంట్ల సంఖ్య పెరిగిందని, అందుకే ఐసియు బెడ్లు, వెంటిలేటర్ బెడ్ల అవసరం పెరిగిందని తెలిపారు. పెరిగిన అవసరాలకు అనుగుణంగా మరో 490 వెంటిలేటర్లను కొనుగోలు చేస్తున్నామని, గాంధీ, ఉస్మానియా, ఎంజిఎం వంటి ప్రభుత్వ జనరల్ హాస్పిటల్స్, జిల్లా హాస్పిటల్స్‌లో వీటిని ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. గత ఏడాది కొత్తగా 213 అంబులెన్సులను అందుబాటులోకి తీసుకొచ్చామని, దీంతో ఎమర్జెన్సీ రెస్పాన్స్ 18 నిమిషాల నుంచి 13 నిమిషాలకు తగ్గిందని, ఈ ఏడాది మరో 79 కొత్త అంబులెన్సులను ఏర్పాటు చేస్తున్నామని, తద్వారా ఎమర్జెన్సీ రెస్పాన్స్ టైమ్ 10 నిమిషాలకు తగ్గుతుందని ఆయన చెప్పారు. ప్రతి 25 కిలోమీటర్లకు ఒక డయాలసిస్ ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించామని, డయాలసిస్ పేషెంట్లకు ఇబ్బంది కలగకుండా చూసుకునే బాధ్యత ప్రభుత్వానిదేనని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు.

**కొత్తగూడెంలో ప్రపంచంలో అరుదైన ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయం**

ప్రపంచంలో అరుదైన ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగూడెం ఏర్పాటు చేసిందని మంత్రి దామోదర్ రాజ నర్సింహ తెలిపారు. సోమవారం శాసనసభలో తెలంగాణ యూనివర్సిటీల చట్ట సవరణ బిల్లు 2026పై జరిగిన చర్చకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజ నర్సింహ మాట్లాడుతూ ఖనిజ సంపదకు నెలవైన కొత్తగూడెంలో 1978లో స్థాపించిన స్కూల్ ఆఫ్ మైన్స్ (తర్వాతి కాలంలో ఇంజనీరింగ్ కాలేజీ)ని అప్‌గ్రేడ్ చేయగా ప్రభుత్వం తాజా చట్ట సవరణ ద్వారా పూర్తి అటానమీ (స్వయం ప్రతిపత్తి) గల భూ విజ్ఞాన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసిందన్నారు. అంతకు ముందు జరిగిన చర్చలో ఎంఐఎం శాసనసభా పక్ష నాయకులు అక్బరుద్దీన్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయడంతోనే సరిపోదని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కూడ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. బిజెపి సభ్యులు పాల్వాయి హరీష్‌బాబు మాట్లాడుతూ ఇప్పటి వరకు మైనింగ్ కోర్సులు చదవాలనుకునే తెలంగాణ విద్యార్థులు ఇప్పటివరకు ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సి వచ్చేందని ఈ ప్రభుత్వం తీసుకువస్తున్న విశ్వవిద్యాలయం ఆ కొరత తీరిందని తెలిపారు. అదేవిధంగా మారుమూల ప్రాంతమైన ఆదిలాబాద్‌లో సైతం కొమురం భీమ్ పేరుతో విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం భూ విజ్ఞాన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయ డం అభినందనీయమన్నారు. విద్యతోనే ఆర్థిక ప్రగతి సాధ్యమని, భూ విజ్ఞాన విశ్వవిద్యాలయం ఇందుకు మరింత దోహదపడనుందని ఆది నారాయణ అన్నారు.

# జిఎస్‌టి సాంకేతిక అంశాలను చేర్చేందుకే చట్ట సవరణ

మంత్రి జూపల్లి కృష్ణారావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఏ చట్టమైన ప్రజలకు ఉపయోగపడే విధంగానే ప్రభుత్వాలు రూపొందిస్తాయని జూపల్లి కృష్ణారావు అన్నారు. జిఎస్‌టి చట్టం మంచిందే అయినా అమలు తీరుతోనే సమస్యలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) నిబంధనలను మరింత సరళతరం చేస్తూ, కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా రూపొందించిన 'తెలంగాణ వస్తు, సేవల పన్ను (సవరణ) బిల్లు 2026పై జరిగిన చర్చకు మంత్రి జూపల్లి కృష్ణారావు సమాధానం ఇచ్చారు. గత ఏడాది నవంబరులో జారీ చేసిన ఆర్డినెన్స్ స్థానంలో ఈ నూతన బిల్లును తీసుకొచ్చినట్లు మంత్రి వివరించారు. జాతీయ విధానానికి అనుగుణంగా.. జిఎస్‌టీ కౌన్సిల్ 51 నుంచి 55వ సమావేశాల వరకు చేసిన సిఫార్సుల మేరకు దేశవ్యాప్తంగా ఒకే రకమైన పన్ను విధానం ఉండాలనే ఉద్దేశంతో ఈ సవరణలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే తన పరిధిలోని ఐజిఎస్‌టి, సిజిఎస్‌టి చట్టాలను సవరించిందని, దానికి అనుగుణంగా రాష్ట్ర జిఎస్‌టి చట్టంలో మార్పులు చేయడం తప్పనిసరి అయిందని పేర్కొన్నారు. దీంతో ఈ బిల్లును సభను ఆమోదించింది.

**జిఎస్‌టి ఓ భూతం : అక్బరుద్దీన్ ఓవైసీ**

అంతకు ముందు జరిగిన చర్చలో ఎంఐఎం శాసనసభా పక్ష నాయకులు అక్బరుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ జిఎస్‌టి అనేది ఓ భూతమని ఈ ఒకే పన్ను విధానం కారణంగా పలు రాష్ట్రాలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తోందన్నారు. ఓ రాష్ట్రం ప్రత్యేక్షంగా పరోక్షంగా కేంద్రానికి లక్షల కోట్ల పన్ను రూపంలో చెల్లిస్తే కేంద్రం మాత్రం జనాభా ప్రాతిపదిక వాటాను చెల్లించడం ఇదెక్కటి న్యాయమన్నారు. అందుకే బిల్లును ఎంఐఎం పూర్తిగా వ్యతిరేకమని తాము వాకౌట్ చేస్తున్నట్లు ప్రకటించి సభ నుంచి బయటికి వెళ్లారు.

**బిల్లులను వ్యతిరేకించడం సరికాదు : బిజెపి**

ప్రభుత్వాలు చేసే చట్టాలను ప్రతిపక్షాలు వ్యతిరేకించడం ఆనవాయితీ అయిపోయిందని బిల్లుల ఆమోదం రాజకీయ కోణంలో చూడడం సరికాదని బిజెపి సభ్యులు పాయల్ శంకర్ అన్నారు. ఒకే దేశం, ఒకే పన్ను విధానం (జిఎస్‌టి) అమల్లోకి వచ్చిన తర్వాత పెట్టుబడులు పెరిగాయన్నారు. దేశాన్ని ప్రగతి బాటలో నడిపిన మాజీ ప్రధానమంత్రి పివి నరసింహారావు, మన్మోహన్ సింగ్‌ల స్ఫూర్తిగా తీసుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అనేక కార్యక్రమాలను చేపట్టారన్నారు. ధన్‌పాల్ సూర్యా నారాయణ మాట్లాడుతూ జిఎస్‌టి అమల్లో వచ్చిన తర్వాత వ్యాపారులపై ఒత్తిడి లేదన్నారు. పాల్వాయి హరీష్‌బాబు మాట్లాడుతూ జిఎస్‌టి రిజిస్ట్రేషన్లలో అధికారులు పూర్తిగా అవినీతికి పాల్పడుతున్నారని దీనిని కట్టడి చేయాలని కోరారు. కాంగ్రెస్ సభ్యులు మదన్ మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకువస్తున్నా ఈ బిల్లును పూర్తిగా స్వాగతిస్తున్నామన్నారు.

# మార్చి 1 నుండి మహిళలకు చీరలు

మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో మార్చి 1వ తేదీ నుంచి 8వ తేదీ వరకు మహిళలకు పెద్ద ఎత్తున చీరల పంపిణీ చేపట్టనున్నట్లు రాష్ట్ర గ్రామీణ, పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క వెల్లడించారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో పంపిణీ చేశామని, ఇంకా మిగిలిన వారితో పాటు పట్టణాల్లో కూడా చీరల పంపిణీ చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ గృహాలు, క్యాంటిన్లు, వివిధ ప్రభుత్వ కార్యక్రమాలను కూడా మహిళా స్వయం సహాయక సంఘాలకే పనులను అప్పగించే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నామన్నారు. శాసనసభలో సోమవారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు నేనావత్ బాలునాయక్, రాజ్‌ఠాకూర్, బీర్ల ఐలయ్య, పాయల శంకర్, పాల్వాయి హరీశ్‌బాబు, గండ్ర సత్యనారాయణ, శంకరయ్య తదితరులు అడిగిన ప్రశ్నకు మంత్రి సీతక్క సమాధానమిస్తూ కేరళ ప్రభుత్వ తరహాలో తెలంగాణ రాష్ట్రంలో కూడా అత్యంత పేదలను మహిళా సంఘాల ద్వారా గుర్తించి, వారికి కావాల్సిన అవసరాలను తెలుసుకుని, అందుకు అనుగుణంగా ప్రభుత్వం అవసరమైన చేయూత నిస్తుందన్నారు. క్యాంటీన్ల ఏర్పాటుకు అవసరమైన 'షెఫ్ శిక్షణ, క్యాంటీన్ నిర్వహణ'పై ఒక్కొక్కరికి రూ.22,300ల వ్యయం తో, మహిళా స్వయం సహాయక బృంద సభ్యులకు పది రోజుల పాటు హైదరాబాద్‌లోని జాతీయ పర్యాటక, ఆతిథ్య నిర్వహణ సంస్థ (నిథం) ద్వారా ఉచిత శిక్షణ అందిస్తున్నామని వివరించారు. అవసరమైన ప్రతిచోటా ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లను ఏర్పాటు చేస్తామన్నారు.

# పవర్‌పాయింట్ ప్రెజంటేషన్ ఇవ్వడం సరికాదు

మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు 2025–26 సంవత్సరంలో ఒక్క రూపాయి రుణం తీసుకురాలేదని రాష్ట్ర పరిశ్రమల, ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు వెల్లడించారు. శాసనసభలో ముఖ్యమైన ప్రశ్నోత్తరాలు, నీటి పారుదల రంగంపై చర్చలో ప్రధాన ప్రతిపక్ష బిఆర్‌ఎస్ పాల్గొనకుండా, బయట పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. శాసనసభ సమావేశాల నుంచి వెళ్లిపోయి, స్పీకర్‌పైన వ్యాఖ్యాలు చేయడం మంచిది కాదని, ఈ విషయమై బిఆర్‌ఎస్ సభ్యులపైన స్పీకర్ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. శాసనసభలో సోమవారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ 2025, డిసెంబర్ 31 నాటికి జిహెచ్ఎంసి మొత్తం బాకాయిలు రూ.4717 కోట్లు అని వివరించారు.

# తెలంగాణలో కేరళ తరహా పర్యాటకం

మంత్రి జూపల్లి కృష్ణారావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేరళ రాష్ట్రం తరహా పర్యాటకాన్ని తెలంగాణలో తీర్చిదిద్దుతున్నామని, రానున్న రోజుల్లో పర్యాటకం కొత్త పుంతలు తొక్కనుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శాసనసభలో సోమవారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు లక్ష్మి కాంతరావు, ఆది శ్రీనివాస్, భూపతిరెడ్డి, పాయలశంకర్, మీర్ జుల్ఫికర్ అలీ అడిగిన ప్రశ్నలకు మంత్రి జూపల్లి సమాధానమిస్తూ పర్యాటక రంగాన్ని పిపిపి మోడల్‌లో అభివృద్ధి చేసేందుకు దేశ, విదేశీ పెట్టుబడిదారులను ఆకర్శించేందుకు రాయితీలు ఇస్తున్నామని ప్రకటించారు. భారతదేశంతో పాటు తెలంగాణ రాష్ట్రం అనుకున్న రీతిలో పర్యాటక రంగం అభివృద్ధి చెందలేకపోయిందని, రాష్ట్రంలో గతంలో పర్యాటక విధానం అంటూ లేకపోడవంతో ఈ రంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని ఆరోపించారు. టూరిజం కాన్‌క్లేవ్, గ్లోబల్ సమ్మిట్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఇన్వెస్టర్లు ముందుకు వచ్చారన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని పర్యాటక కేంద్రంగా మార్చడం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో ఆ రంగం వాటాను పెంచడం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం నిబద్ధతో పని చేస్తుందని స్పష్టం చేశారు.కామారెడ్డి జిల్లాలోని నిజాం సాగర్ వాటర్ స్పోర్ట్స్, బోటింగ్ సదుపాయం కోసం ఏర్పాట్లు చేస్తున్నామని,కౌలస్ కోట, నాగన్నమెట్ల బావి అభివద్ధికి చర్యలు తీసుకుంటున్నామని, బాసర జ్ఞాన సరస్వతీ దేవాలయం, డిచ్‌పల్లి ఖిల్లా రామాలయం అభివృద్ధికి పర్యాటక పరంగా ఉన్న అవకాశాలకు అనుగుణంగా ప్రతిపాదనలు రూపొందించి అమలు చేస్తామన్నారు. శ్రీరాంసాగర్ బ్యాక్ వాటర్ ఏరియా టూరిజం స్పాట్‌గా తీర్చిదిద్దడంతో పాటు ఎస్ఆర్ఎస్‌పి రిజర్వాయర్‌లో బోటింగ్ సదుపాయం, హరిత హోటల్ పునరుద్ధరణ, ఇతర సౌకర్యాలు కల్పించేందుకు ప్రయత్నిస్తున్నామని వివరించారు. హైదరాబాద్ నగరంలోని చార్మినార్, చౌమహల్లా ప్యాలెస్ వంటి చారిత్రక, వారసత్వ ప్రదేశాలకు దేశ. విదేశీ పర్యాటకులను ఆకర్శించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఎగరాలి ఎగరాలి మన ఎర్రజెండా – ఎదురుబెదురూ లేక..

చలో ఖమ్మం

2026 జనవరి 18
సిపిఐ శతవార్షికోత్సవ సభకు

వేలాదిగా తరలి రండి!

# ఖమ్మం జిల్లాలో బలమైన ఉద్యమానికి పునాదులు




**ప్రజాపక్షం/ఖమ్మం :** పోరాట స్మృతులు మరువలేనివి, మరుపురానివి. ఖమ్మం జిల్లా కమ్యూనిస్టు ఉద్యమం ఎందరో త్యాగధనుల పోరాట స్ఫూర్తితో బలోపేతమైంది. కమ్యూనిస్టు పార్టీలో చీలిక సంభవించిన నాడు ఖమ్మం జిల్లాలో నామ మాత్రంగా ఉన్న సిపిఐ నల్లమల గిరిప్రసాద్, పువ్వాడ నాగేశ్వరరావు, మహ్మద్ రజబ్అలీ, మనుబోతుల కొమరయ్య, వాసిరెడ్డి వెంకటపతి, తూము ప్రకాశరావు, టివి చౌదరి, కర్నాటి కృష్ణయ్య, దొండపాటి వెంకయ్య, తుళ్లూరి పెద్ద సత్యం, మియాజాని, రేగళ్ల చెన్నారెడ్డి, మేకల సంగయ్య లాంటి ఎందరో యోధుల కృషితో ఒక బలమైన రాజకీయ శక్తిగా ఎదిగింది. ఆనాడు సరైన రహదారి సౌకర్యాలు ఉండేవి కావు. ఖమ్మంజిల్లా కమ్యూనిస్టు సమితికి అప్పట్లో ఒక వాహనం మాత్రమే ఉండేది. ఆ వాహనంలోనే అప్పటి నేతలు నల్లమల గిరిప్రసాద్, పువ్వాడ నాగేశ్వరరావు, రజబ్అలీ మొదలైన వారంతా తిరిగేవారు. బోనకల్ మండలంలోని రాయన్నపేట, కలకోట, బ్రాహ్మణపల్లి, ఆళ్లపాడు, మోటమర్రి మొదలైన గ్రామాలు సిపిఐకి కంచుకోటలా ఉండేవి. 1980 దశకంలో నల్లమల గిరిప్రసాద్, పువ్వాడ నాగేశ్వరరావు తదితరులు రాయన్నపేట సమావేశానికి వెళ్లారు. రాయన్నపేట, కలకోట గ్రామాల మధ్య ఉన్న వాగులో జీబు కూరుకుపోయింది. ఆ ప్రాంతంలో పరిస్థితులు కూడా ఉద్రిక్తంగా ఉండేవి. స్వయంగా పువ్వాడ నాగేశ్వరరావుతో పాటు ఇతర నేతలు దిగబడిన జీబును ఒడ్డుకు చేర్చేందుకు నానా ఇబ్బందులు పడ్డారు. మంచి యవ్వనంలో ఉన్న పువ్వాడ సిపిఐ కార్యకర్తల సాయంతో దిగబడిన జీబును ఒడ్డుకు చేర్చారు. అప్పటి ఫోటో ఇప్పుడు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతూ చర్చనీయాంశంగా మారింది. పువ్వాడ నాగేశ్వరరావు 1982లో శాసనమండలి సభ్యునిగా ఎన్నికైన తర్వాత తన ఎంఎల్‌సి కోటాలో తొలి ప్రాధాన్యతగా రాయన్నపేటకు రహదారి సౌకర్యం ఏర్పాటు చేయడంతో పాటు తన నిధుల నుంచి గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించారు. ఈ ప్రాంతం కమ్యూనిస్టు పార్టీకి కంచుకోటలా ఉండడంతో పువ్వాడ నాగేశ్వరరావు ఎంఎల్‌సి అయ్యేంత వరకు వివక్షతతో కాంగ్రెస్ నాయకులు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టలేదు. అప్పటి నేతలు ప్రజా ఉద్యమాన్ని బలోపేతం చేసేందుకు, ప్రజలకు సౌకర్యాలు కల్పించేందుకు చేసిన కృషికి నిదర్శనమే పైన పేర్కొన్న చిత్రం.

# కమ్యూనిస్టు పార్టీకి గ్రామీణ ప్రజలే బలం




సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా

**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ప్రజా హృదయాలలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న పార్టీ ఒక్క సిపిఐ పార్టీ మాత్రమేనని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. సోమవారం సిపిఐ ప్రచార జాతలో భాగంగా మండల పరిధిలోని మర్కోడు నుండి అనంతోగు వరకు సిపిఐ కార్యకర్తలు సుమారు 200 బైకులతో భారీ ర్యాలీతో ప్రచార జాతా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ ఆళ్లపల్లి మండల కార్యదర్శి కొమరం హనుమంతరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా మాట్లాడుతూ పదవులు ఉన్నా లేకున్నా ఎప్పటికీ ప్రజలతోనే మమేకమై వారి సమస్యలను పరిష్కరించేందుకు ఉద్యమించిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని, ఎన్నో పార్టీలు పుట్టాయని అలాగే కాలగర్భంలో కలిసిపోయాయని కానీ ప్రజాదరణతో వందేళ్లు పూర్తి చేసుకున్న ఏకైక పార్టీ సిపిఐ మాత్రమే అన్నారు. వంద సంవత్సరాల ముగింపు ఉత్సవాల సందర్భంగా జనవరి 18న ఖమ్మంలో లక్షలాది మందితో బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు రేసు ఎల్లయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వర్క అజిత్, అధ్యక్షులు ఎస్‌కే షాహిద్, ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు వేల్పుల మల్లికార్జున్, జిల్లా సమితి సభ్యులు గోగ్గల కృష్ణ, మండల సహాయ కార్యదర్శిలు నరెడ్ల రాంబాబు, వజ్జా పగడయ్య, ఎస్‌కే రహీం, ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి కాటూరి రాము తదితరులు పాల్గొన్నారు.

## సామినేని రామారావు దారుణ హత్య కేసు

# దర్యాప్తులో ప్రభుత్వ కుట్ర కోణం

రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఖమ్మం జిల్లాలో గత ఏడాది అక్టోబర్ 31న సిపిఐ(ఎం) నేత సామినేని రామారావు దారుణ హత్య కేసులో దర్యాప్తులో ప్రభుత్వ కుట్ర కోణం దాగి ఉందని వామపక్షాల రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు నాయకులు పేర్కొన్నారు. సామినేని రామారావు దారుణ హత్య కేసులో నిందితులను గుర్తించి వెంటనే అరెస్టు చేయాలని సమావేశం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. 'సామినేని రామారావు హంతకులను శిక్షించాలని' అంశంపై సిపిఐ(ఎం) రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశంలో సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, సిపిఐ శాసనసభాపక్ష నేత కూనంనేని సాంబశివరావు, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, ఆర్ఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి ఎ.జానకిరాములు, ఎంసిపిఐయు నేత రవి, సిపిఐఎంఎల్ నాయకుడు రమేష్‌రాజా, సిపిఐఎంఎల్ న్యూడెమాక్రసీ నేత హన్మేష్ తదితరులు మాట్లాడారు. సిపిఐ(ఎం) ఖమ్మం జిల్లా కార్యదర్శి సుదర్శన్ సమావేశానికి అధ్యక్షతన వవహించారు. సమావేశంలో కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ సామినేనిని పలానావాళ్లు హత్య చేశారని భార్య ఫిర్యాదు ఇచ్చినా పోలీసులు పట్టించుకోలేదని, ఈ కేసును దర్యాప్తు అధికారులు పక్కదారి పట్టిస్తున్నారని, వారిపై రాజకీయ ఒత్తిడిలు ఉన్నాయని కూనంనేని పేర్కొన్నారు. ఈ కేసు విషయాన్ని అసెంబ్లీలో ప్రస్తావిస్తానని, అలాగే దర్యాప్తు నిస్పక్షపాతంగా సాగేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేసే విషయంపై ముఖ్యమంత్రి దృష్టికి కూడా తీసుకెళ్తానన్నారు. ఈ కేసులో పోలీసుల పాత్రపై అనుమానాలు కలుగుతున్నాయని, ఇందులో కుట్ర కోణం దాగి ఉందని పేర్కొన్నారు. అనుమానిత నిందితులను వదిలిపెట్టి కుటుంబ సభ్యులకు లైడిటెక్టర్ పరీక్షలు చేస్తామనడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ముందు నిందితులకు ఈ పరీక్షలు చేయాలని సాంబశివరావు డిమాండ్ చేశారు. కమ్యూనిస్టులను ఏమి చేసినా వారు ఏమి చేయలేరనే చులకనభావంతో వ్యవహరిస్తున్నారని, ఇలాంటి చర్యలను వామపక్షాలు సమర్థవంతంగా తిప్పికొట్టాలన్నారు. సామినేనికి రాష్ట్ర, జిల్లా స్థాయిలో శత్రువులు లేరని, ఒక వేళ ఉంటే గ్రామస్థాయిలోనే ఆయనకు ప్రత్యర్థులు ఉంటారని ఆయన అనుమానాలు వ్యక్తం చేశారు. ప్రజాసమస్యలపై ఐక్యంగా పోరాడాలని, కమ్యూనిస్టుల ఉద్యమాలు మరింత బలపడాలన్నారు. సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ మాజీ ఎంఎల్‌ఎ గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ సామినేని హత్య జరిగి 65 రోజులు గడిచినా ఇంత వరకు ప్రభుత్వం హంతకులను పట్టుకోకపోవడం సిగ్గుచేటన్నారు. కేసును పక్కదారి పట్టించి స్వపక్షంపైనే నిందలు వేసే విధంగా లీక్‌లు ఇస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలన్నారు. రానున్న రోజుల్లో వామపక్ష పార్టీలను నాశనం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నాయని, ఈ చర్యలను గట్టిగా అడ్డుకోవాలన్నారు.

## రామారావు హత్య ఘటనపై సిట్ ఏర్పాటు చేయాలి :కూనంనేని

మధిర నియోజకవర్గం, బొనకల్లు మండలంలో సిపిఐ(ఎం) నాయకులు సామినేని రామారావు హత్య ఘటనపై ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేయాలని సిపిఐ శాసనసభాపక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని కోరారు. శాసనసభలో సోమవారం జరిగిన జిరో అవర్‌లో కూనంనేని సాంబశివరావు సామినేని రామారావు హత్య విషయాన్ని ప్రస్తావించారు. గత అక్టోబర్‌లో సామినేని రామారావు హత్యకు గురి కాగా పోలీసులు ప్రయత్నం చేస్తున్నప్పటికీ హత్యకు సంబంధించిన వివరాలు ఇప్పటి వరకు బయటికి రాకపోవడం విచారకరమన్నారు. ఈ ఘటనకు సంబంధించి రామారావు కుటుంబం సభ్యులను లైడిటెక్టర్ టెస్ట్ నిర్వహిస్తామని చెప్పినట్లు వారు తెలిపారన్నారు. ఈ హత్య ఘటన మిస్టరీగా మారిన నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే సిట్ ఏర్పాటు చేసి విచారణ త్వరితగతిన పూర్తి చేసి కేసును చేధించాలని కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని కోరారు.

## భూ విజ్ఞాన విశ్వవిద్యాలయంలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

సిపిఐ శాసనసభాపక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కొత్తగూడెంలో భూ విజ్ఞాన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తున్న లక్ష్యం నేరవేరే విధంగా విద్యావిధానం రూపొందించేందుకు చర్యలు తీసుకోవాలని సిపిఐ శాసనసభాపక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. శాసనసభలో సోమవారం తెలంగాణ యూనివర్సిటీల చట్ట సవరణ బిల్లు 2026పై జరిగిన చర్చలో కూనంనేని సాంబశివరావు పాల్గొంటూ మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ పేరుతో విశాలమైన 400 ఎకరాలలో ఏర్పాటు చేస్తున్న భూ విజ్ఞాన విశ్వవిద్యాలంలో అవసరమైన బోధన, బోధనేతర సిబ్బందిని నియమించడంతో పాటు అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పించడం ద్వారా అద్భుతమైన విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దాలని కోరారు. విద్యా శాఖ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్దే ఉన్నందున ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఖమ్మం జిల్లాలో ఉన్న ఖనిజాలకు అనుగుణంగా కొత్త కోర్సులు ఉండాల్సిన అవసరముందని తెలిపారు. తన నియోజకవర్గంలో ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు ఇందుకు కృషి చేసిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్
ఆపరేషన్ మేడ్చల్ సర్కిల్
టెండర్ నోటీస్ నెం. 08/2025-26
అనుభవజ్ఞులైన మరియు జిఎస్‌టి రిజిస్టర్డ్ విక్రేతల నుండి సీల్డ్ టెండర్లను ఆహ్వానించడమైనది. 1. TspNo. 70&79/25-26 మరియు Mat.TspNo. 07to19/25-26 - మేడ్చల్ సర్కిల్ కార్యాలయం. 2. TspNo. 60/25-26 - సివిల్ సబ్ డివిజన్ కార్యాలయం, మేడ్చల్ సర్కిల్. 3. TspNo. 89/25-26 - కన్‌స్ట్రక్షన్ డివిజన్ కార్యాలయం, మేడ్చల్ సర్కిల్. 4. TspNo. 54, 58, 67, 68, 69, 71 to 76, 85/25-26 - లైన్స్ డివిజన్ కార్యాలయం, మేడ్చల్ సర్కిల్. 5. TspNo. 80&81/25-26 - ప్రొటెక్షన్ & టిఆర్ఇ డివిజన్ కార్యాలయం, మేడ్చల్ సర్కిల్. 6. TspNo. 61, 64, 86, 87, 88/25-26 - జీడిమెట్ల డివిజన్ కార్యాలయం. 7. TspNo. 82to84/25-26 - కూకట్‌పల్లి డివిజన్ కార్యాలయం. 8. TspNo. 59, 62, 63, 65, 66, 77, 78, 90 to 97/25-26 - మేడ్చల్ డివిజన్ కార్యాలయం. మరిన్ని వివరాలకు www.tgsouthernpower.org చూడవచ్చు.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, ఆపరేషన్, మేడ్చల్.
DIPR R.O. No. : 13052-PP/CL/ADVT/1/2025-26, Date: 05-01-2026

# ప్రజా సమస్యలు పరిష్కరించాలి

ప్రభుత్వానికి ఎమ్మెల్యేలు విజ్ఞప్తి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని వివిధ నియోజకవర్గాలలోని ప్రజా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత ఎంఎల్‌ఎలు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శాసనసభలో సోమవారం జరిగిన జిరో అవర్‌లో ఎంఎల్‌ఎలు తమ తమ నియోజకవర్గాల ప్రజా సమస్యలను లేవనెత్తారు. ఇందులో భాగంగా సంక్రాతి పండుగ సందర్భంగా పంతంగులు ఎగురవేసేందుకు తెలిసి తెలియక వినియోగిస్తున్న చైనా మంజా కారణంగా ప్రమాదాలు చోటు చేసుకుని మరణాలు సంభవిస్తున్నాయని కాంగ్రెస్ సభ్యులు దానం నాగేందర్ సభ దృష్టికి తీకువచ్చారని ఈ మంజా అమ్మకాలను పూర్తిగా ఆరికట్టడంతో పాటు వీటిని అమ్ముతున్నావారిపై కేసులు నమోదు చేసేందుకు రాష్ట్ర డిజిపితో పాటు మూడు కమిషరేట్ల కమిషనర్లను అదేశించాలని కోరారు. మరో సభ్యులు శంకరయ్య మాట్లాడుతూ నిజమైన ఉద్యకారులకు, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం చీఫ్ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ అధ్యక్ష స్థానాన్ని అవమాన పర్చుతూ బిఆర్ఎస్ సభ్యులు బయట ఇష్టాను సారంగా మాట్లాడుతున్నారని వీరిని కట్టడి చేసేందుకు రూలింగ్ ఇవ్వాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను కోరారు. కాటెపల్లి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించి సుదీర్ఘ కాలం పెండింగ్‌లో ఉన్న రూ.1350 కోట్లబకాయిలను ప్రభుత్వ మార్చి 31 నాటికి విడుదల చేయాలని కోరారు. అక్బరుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ మైనార్టీలకు సంబంధించి బడ్జెట్‌లో నిధులను పెద్ద ఎత్తున కేటాయించినప్పటికీ ఆ మేరకు నిధులను విడుదల చేయడం లేదని, చేసిన నిధులను కూడ ఖర్చు చేయడం లేదన్నారు. మాల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ తన నియోజవర్గంలోని ఇబ్రహీం పట్నం, తుర్కయంజాల్, అబ్దుల్లాపూర్ మెట్‌లో మండలాల్లో పెద్దఎత్తున పట్టణకీరణ జరిగిందని ఈ క్రమంలో ఇక్కడి చేరువులని కబ్జాలకు గురైయ్యాయని వాటిని రక్షించి అభివృద్ధి చేయాలని కోరారు. కడియం శ్రీహరి మాట్లాడుతూ వరంగల్‌లో క్రికెట్ స్టేడియంతో పాటు స్పోర్ట్స్ స్కూల్‌కు ఏర్పాటు చర్యలు తీసుకోవాలిన, వరంగల్‌లోని ఎంజి ప్రభుత్వం ఆసుపత్రిలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని నాయిని రాజేందర్‌రెడ్డి కోరారు.

నారాయణ్‌పూర్ ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణలో రూ.40 కోట్లుగాను మిగిలిన రూ.20 కోట్లు చెల్లించాలని మేడిపల్లి సత్యం , కాగజ్‌నగర్ మన్సిపల్‌లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు 5 నెలులగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని పాల్వాయి హరీష్‌బాబు కోరారు. కంటోన్మెంట్ ప్రాంతాన్ని జిహెచ్‌ఎంసిలో విలీనం చేయాలని శ్రీగణేష్ కోరాగా ఎర్రగడ్డ, బోరబండ ప్రాంతాల్లో ట్రాఫిక్ నివారించేందుకు రోడ్ల వెడల్పు చేపటాలని నవీన్ యాదవ్ విజ్ఞప్తి చేశారు సభ్యులు లేవనెత్తిన అంశాలను నోట్ చేసుకున్నామని సంబంధింత శాఖలకు పంపించడం జరుగుతుందని మంత్రులు తెలిపారు.


**చెక్ డ్యాంలపై విచారణ :**
ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బిఆర్ఎస్ హాయంలో నిర్మించిన చెక్ డ్యామ్‌లపై ప్రభుత్వం ఇప్పటికే విచారణ చేపట్టిందని నీటి పారుదల శాఖ మంత్రి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ అంశంలో త్వరలోనే నిజాలు బయటకు రానున్నాయని ఆయన వెల్లడించారు. అంతకుముందు జిరో అవర్‌లో పెద్ద పల్లి ఎంఎల్‌ఎ చింతకుంట విజయ రమణరావు ఈ అంశాన్ని లెవనెత్తుతూ బిఆర్ఎస్ హాయంలో నిర్మించిన పలు చెక్ డ్యామ్‌లు కూలి పోతుండడంపై విచారణ జరిపించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇసుక దోపిడే లక్ష్యంగా బిఆర్ఎస్ హాయంలో చెక్ డ్యామ్‌లను పూర్తిగా నాసిరకంగా నిర్మించడం వల్లే ఇప్పటీ 11 కూలిపోయాయని, దీనిని తప్పించుకునేందుకు , రెండు డ్యామ్‌లను బాంబులు పెట్టి పేల్చివేశారని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఈ చెక్ డ్యామ్‌ల నిర్మాణంపై పూర్తి స్థాయి విచారణ జరిపించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

---

రైతులు, సామాన్య ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడమే

## ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

శాసనమండలిలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో విద్యుత్ రంగాన్ని మరింత పటిష్ఠం చేస్తూ రైతులు, సామాన్య ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో వ్యవసాయ అవసరాల కోసం ట్రాన్స్‌ఫార్మర్ల కేటాయింపుపై సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. 2022 జనవరి నుంచి 2025 డిసెంబర్ వరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, మూడేళ్లలో 3,44,462 మంది రైతులకు కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేశామన్నారు. కనెక్టెడ్‌లోడ్ అవసరాలకు అనుగుణంగా 75,686 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశామని తెలిపారు. సీనియారిటీ ప్రాతిపదికన, ఎలాంటి వివక్ష లేకుండా రైతులకు కనెక్షన్లు ఇస్తున్నామని, మరో 9,700 మంది రైతులకు లైన్ పనులు పూర్తయిన వెంటనే ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేస్తామని చెప్పారు. గడిచిన రెండేళ్లలో (20242025) దాదాపు 2 లక్షల అదనపు వ్యవసాయ కనెక్షన్లు ఇవ్వడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. విద్యుత్ అంతరాయం కలిగితే గంటల తరబడి వేచిచూడాల్సిన పరిస్థితి లేకుండా ‘108’ తరహాలో విద్యుత్ అంబులెన్స్ సేవలను ప్రారంభించినట్లు ఉపముఖ్యమంత్రి సభకు వివరించారు. 1912 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేస్తే, మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లు, థర్మల్ విజన్ కెమెరాలు, సేఫ్టీ గేర్‌తో కూడిన ప్రత్యేక వాహనం వెంటనే సంఘటన స్థలానికి చేరుకుంటుందన్నారు. ఈ వాహనంలో ఒక ఇంజనీర్‌తో పాటు ఇద్దరు సిబ్బంది ఉండి, యుద్ధ ప్రాతిపదికన సమస్యను పరిష్కరిస్తారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, వైర్లు ఎక్కడా కొరత లేదని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ‘ప్రజా బాట’ కార్యక్రమం ద్వారా అధికారులు వారానికి మూడు రోజులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ వంగిన స్తంభాలు, వేలాడుతున్న తీగలను వెంటనే సరిచేస్తున్నారని తెలిపారు. సభ్యులు ఏ సమస్యను లిఖితపూర్వకంగా తన దృష్టికి తీసుకొస్తే 24 గంటల్లోనే పరిష్కరిస్తామని సభలో చెప్పారు.

---

✻ మీడియా పాయింట్

### ‘గాంధీ’కుటుంబంపై కెటిఆర్ మాట్లాడుతుంటే సిగ్గేస్తుంది

ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్ఎస్ పార్టీపై, కెసిఆర్ కుటుంబంపై ఎంఎల్‌సి, కెసిఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలకు సమాధానం చెప్పాలని కెటిఆర్‌ను ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య డిమాండ్ చేశారు. కెటిఆర్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద సోమవారం ఆయన మాట్లాడుతూ అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చకు రాకుండా పారిపోయారని, కెసిఆర్ పని అయిపోయిందని ఎద్దేవా చేశారు. బిఆర్ఎస్ పార్టీ అధ్యక్ష పదవి కోసం హరీష్‌రావు, కెటిఆర్ పోటీ పడుతున్నారని ఆయన ఆరోపించారు. సోనియగాంధీ దయతో మీ నాన్న (కెసిఆర్) ముఖ్యమంత్రి, నువ్వు (కెటిఆర్) మంత్రి అయ్యారని అన్నారు. త్యాగాల కుటుంబం రాహుల్ గాంధీ కుటుంబంపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ మాట్లాడుతుంటే సిగ్గేస్తుందని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. రాహుల్ గాంధీని ఉరి తీయాలని అహంకారంతో మాట్లాడుతున్నారన్నారు. రాహుల్ గాంధీ కుటుంబంపై మరోసారి మాట్లాడితే ప్రజలు మిమ్మల్ని రాళ్ళతో కొట్టే రోజులు వస్తాయని హెచ్చరించారు.

### అబద్ధాల పాలన చేస్తున్నారు

**బిఆర్ఎస్ ఎమ్మెల్యే కెపి వివేకానంద**



అబద్ధాలు పునాదులపై ఏర్పడ్డ రేవంత్ రెడ్డి ప్రభుత్వం గత రెండు సంవత్సరాలుగా అబద్ధాలతో పాలన చేస్తుందని బిఆర్ఎస్ ఎంఎల్‌ఎ కెపి వివేకానంద తెలిపారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ..అసెంబ్లీలో కాంగ్రెస్ నేతలు ఆన్ రికార్డ్ పచ్చి అబద్ధాలు చెపుతున్నారన్నారు. భారత దేశ చరిత్రలో ప్రతిసారి దేవుడిపై ఒట్లు వేసిన చరిత్ర రేవంత్ రెడ్డిదని ఎద్దేవ చేశారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ నేనే ఆపివేయించా అని పచ్చి అబద్ధాలు చెపుతున్నారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం దీన్ని తీవ్రంగా ఖండించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తల ఎక్కడ పెట్టుకుంటారు? అని ప్రశ్నించారు. బేషరతుగా ప్రజలకు క్షమాపణ చెప్పాలి రేవంత్ రెడ్డి

### ఇప్పటికే 40 మంది ఉద్యోగులు మరణించారు

**బిజెపి ఎమ్మెల్యే పాయల్ శంకర్**



తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ఉమ్మడి రాష్ట్రంలో కన్నా ఎక్కువ కష్టాలు ఉద్యోగులు పడుతున్నారని బిజెపి ఎంఎల్‌ఎ పాయల్ శంకర్ అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద యాన మాట్లాడుతూ.. ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు వేల కోట్ల రూపాయలు ఉన్నాయన్నారు. బకాయిలు చెల్లించకపోవడంతో ఇప్పటికీ 40 మంది ఉద్యోగులు మరణించారని ఆరోపించారు. అయినా ప్రభుత్వానికి కనికరం కూడా లేదన్నారు. కోర్టును ఆశ్రయించిన వారికి, వారిలో కొంతమందికి మాత్రమే బకాయిలు ఇస్తున్నారు. ఉద్యోగులతో పెట్టుకుంటే రేపు మీ భవిష్యత్తు ప్రశ్నార్థకం అవుతుందన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్న భిన్నం కావడానికి కారణం టిఆర్ఎస్ పార్టీ అని అన్నారు. ఉద్యోగుల, రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు వెంటనే చెల్లించాలి. లేదంటే వారి తరపున బిజెపి పోరాటం చేస్తుందన్నారు.

### విద్యావ్యవస్థ కుంటుబడింది

**ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ**



రాష్ట్రంలో విద్యా వ్యవస్థ కుంటుబడిందని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ..45శాతం ఒక్క విద్యార్థి లేని స్కూల్లు తెలంగాణలో ఉన్నాయి. దేశంలో రెండవ స్థానంలో ఉంది. ఇది చాలా బాధాకరమన్నారు. స్కూళ్ళలో సదుపాయాలు సక్రమంగా లేవని విమర్శించారు. 119 నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ కట్టిస్తామని కేవలం కొడంగల్ నియోజకవర్గంలో మాత్రమే పని ప్రారంభం అయ్యింది. పాఠశాలలకు నిధులు మంజూరు చేసి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

---



## సైబర్ వారియర్ల పనితీరు భేష్

డిజిపి శివధర్‌రెడ్డి

రాష్ట్ర వ్యాప్తంగా 47 మందికి సన్మానం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సైబర్ నేరాల నియంత్రణలో సైబర్ వారియర్ల పనితీరు భేష్‌గా ఉందని డిజిపి బి.శివధర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సైబర్ నేరాల నియంత్రణలో అసాధారణ ప్రతిభ చూపిన సైబర్ వారియర్ల సేవలను గుర్తిస్తూ తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) ప్రత్యేక సన్మాన కార్యక్రమాన్ని డిజిపి కార్యాలయంలో సోమవారం నిర్వహించింది. ప్రతి త్రైమాసికంలో ఉత్తమ పనితీరును కనబర్చిన సిబ్బందిని ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టిజిసిఎస్‌బి తెలిపింది.ఈ సందర్భంగా డిజిపి బి. శివధర్ రెడ్డి మాట్లాడుతూ.. సైబర్ వారియర్ల నిబద్ధత, అంకితభావం ప్రశంసనీయమని అన్నారు. సమర్థవంతమైన సైబర్ నేరాల ప్రతిస్పందనకు వేగం, సాంకేతిక నైపుణ్యం, సమన్వయం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఇలాంటి సన్మానాలు అధికారులను తమ నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకునేలా ప్రేరేపిస్తాయని, ప్రజా కేంద్రిత సాంకేతిక ఆధారిత పోలీసింగ్‌పై తెలంగాణ పోలీసుల దృష్టిని మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు. టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖా గోయల్ మాట్లాడుతూ, పెరుగుతున్న సైబర్ నేరాల ముప్పును ఎదుర్కొనాలంటే నిరంతర అధ్యయనం, వేగవంతమైన చర్యలు, సమన్వయం కీలకమని చెప్పారు. ఫ్రంట్‌లైన్ సిబ్బందిని శక్తివంతం చేయడం ద్వారా ప్రజల భద్రతకు భరోసా కల్పించడమే టిజిసిఎస్‌బి లక్ష్యమని స్పష్టం చేశారు. మూడో, నాలుగో త్రైమాసికాలకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా ఎంపికైన ప్రతి త్రైమాసికానికి 25 మంది సైబర్ వారియర్లు, అలాగే టిజిసిఎస్‌బి ప్రధాన కార్యాలయం, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లకు చెందిన 22 మంది సిబ్బంది కలిపి మొత్తం 47 మందిని సన్మానించారు.

---

## చేనేతకు ప్రభుత్వం చేయూత

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** చేనేతకు ప్రభుత్వం చేయూతనిస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శాసనమండలిలో చేనేత కార్మికుల రుణమాఫీపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ డాక్టర్ వెంకట్ నర్సింగ్ రావు బల్మూర్, సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంలు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. వచ్చే మార్చిలోగా చేనేత కార్మికుల రుణమాఫీ పూర్తి చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు హామీనిచ్చారు. త్వరలోనే సహకార సంఘాల ఎన్నికలు కూడా నిర్వహిస్తామని చెప్పారు. తెలంగాణ గొప్ప సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వం, పోరాటతత్వానికి ప్రతీకగా నిలిచిన చేనేత రంగానికి ప్రజా ప్రభుత్వం బలమైన చేయూత అందిస్తోందని డాక్టర్ బల్మూర్ వెంకట్ అన్నారు. అగ్గిపెట్టెలో పట్టేంత సన్నని చీరను నేసి చేనేత కళకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకొచ్చిన మన నేతన్నలు తెలంగాణకు గర్వకారణమన్నారు. చేనేత కార్మికుల రుణాలపై వడ్డీతో సహా రూ.1 లక్ష వరకు మాఫీ చేయడం ద్వారా వారికి ఊరట కల్పించిందన్నారు. జియో ట్యాగ్ చేసిన మగ్గాలపై పనిచేసే కార్మికులకు ఏటా రూ.18,000, అనుబంధ కార్మికులకు రూ.6,000 చొప్పున ఆర్థిక సహాయం అందిస్తూ ప్రభుత్వం భరోసా ఇస్తోందన్నారు. పాత మగ్గాల స్థానంలో ఆధునిక ఫ్రేమ్ మగ్గాల ఏర్పాటు కోసం రూ.38,000 ఆర్థిక సహాయం అందించడంతో పాటు, చేనేత మిత్ర, చేనేత అభయహస్తం వంటి పథకాలను అమలు చేస్తూ నేత కార్మికుల సమగ్రాభివృద్ధికి కొత్త దారులు వేసిందన్నారు. సంక్షేమ పథకాలకే పరిమితం కాకుండా, నేతన్నలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ‘ఇందిరా మహిళా శక్తి’ పథకం కింద కోట్లాది రూపాయల విలువైన చీరల ఆర్డర్లను చేనేత సొసైటీలకు అప్పగించి చేతినిండా పని కల్పిస్తోందని తెలిపారు.

**ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం :** క్షేత్రస్థాయిలో చేనేత కార్మికులు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయారని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం శాసనమండలిలో ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్నట్టు చెబుతున్న పథకాలువాస్తవంగా కార్మికులకు అందడం లేదని తెలిపారు. లక్ష రూపాయల లోపు రుణమాఫీ అమలు చేశామని ప్రభుత్వం ప్రకటిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో చేనేత కార్మికులకు రుణమాఫీ అందినట్లు ఎక్కడా ఆధారాలు లేవన్నారు. 33 కోట్ల రూపాయల రుణ మాఫీ జరిగిందని చెబుతున్నా, అది కాగితాలకే పరిమితమైందని తెలిపారు.

---

## విద్యుత్ సమస్యలు క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని రైతాంగం ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలపై సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం శాసనమండలిలో లెవనెత్తారు. వ్యవసాయ మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్ల కొరత, విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. నల్లగొండ జిల్లాలో వ్యవసాయం ప్రధానంగా బోర్లపైనే ఆధారపడి ఉందని, నీటి కోసం రైతులు ఒక్కొక్కరు 50 నుండి 70 బోర్లు వేసిన సందర్భాలు ఉన్నాయన్నారు. అంత కష్టపడి నీళ్లు పడినా, విద్యుత్ కనెక్షన్ కోసం అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల నిమిత్తం రైతులు డిపాజిట్‌లు, డిడిలు కట్టి ఏళ్ల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం జిల్లాలో సుమారు 4,500 ట్రాన్స్‌ఫార్మర్ల అవసరముందని, వాటిని వెంటనే మంజూరు చేయాలని కోరారు. గతంలో ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు ఐదు విద్యుత్ స్తంభాలను ఇచ్చేవారని, కానీ ఇప్పుడు కేవలం ఒకటే ఇస్తుండటంతో రైతులు తమ సొంత ఖర్చులతో అదనపు స్తంభాలు కొనుక్కోవాల్సి వస్తోందన్నారు. తుప్పుపట్టిన స్తంభాలు, వేలాడుతున్న విద్యుత్ తీగలతో రైతులు కరెంట్ షాక్‌కు గురై ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. గతంలో ప్రతి గ్రామానికి ఒక లైన్ మెన్ ఉండేవారని, ఇప్పుడు 10 గ్రామాలకు ఒకరే ఉండటం వల్ల చిన్న చిన్న రిపేర్లకు కూడా రోజుల తరబడి వేచి చూడాల్సి వస్తోందన్నారు. నివాస ప్రాంతాల మీదుగా వెళ్తున్న 11 కెవి హైటెన్షన్ లైన్‌లను తక్షణమే వేరే చోటికి మళ్లించాలని కోరారు. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే 24 గంటల్లో మారుస్తామని ప్రభుత్వం చెబుతున్న మాటలు క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని చెప్పారు. దీనివల్ల సరైన సమయానికి నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇక విద్యుత్ ప్రమాదాల్లో మరణించిన రైతులకు అందాల్సిన పరిహారం అధికారుల నిర్లక్ష్యం వల్ల పెండింగ్‌లో ఉందని, బాధితులకు తక్షణమే న్యాయం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

**మీరు చెప్పినంత సులువుగా క్షేత్ర స్థాయిలో లేదు : చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి**
మీరు చెప్పినంత సులువుగా క్షేత్ర స్థాయిలో లేదని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో అన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని, కాంట్రాక్టర్లను కేటాయిస్తున్నారని, కొంత పనిచేసి వెళ్లిపోతున్నారని తెలిపారు. క్షేత్ర స్థాయిలో ట్రాన్స్‌ఫార్మర్ల రిపేర్లు కావడం లేదన్నారు. తుప్పుపట్టిన స్తంభాలు ఉన్నాయని, చర్యలు తీసుకోవాలని సూచించారు.

---

## జర్నలిస్టు చందర్ శ్రీవాస్తవ్‌కు సత్కారం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణా రాష్ట్ర సాధన కోసం జరిగిన తొలి ఉద్యమంలో క్రియాశీల పాత్ర నిర్వహించిన ప్రముఖ జర్నలిస్టు చందర్ శ్రీవాస్తవ్‌ను సోమవారం తెలంగాణా మీడియా అకాడమీ ఘనంగా సత్కరించింది. ఉర్దూ, ఇంగ్లీష్, తెలుగు, హిందీ నాలుగు భాషల్లోనూ కొన్ని దశాబ్దాల పాటు పత్రికా రచనతో ప్రఖ్యాతి చెందిన శ్రీవాస్తవ అమెరికాలో స్థిరపడ్డారు. ఆయన గౌరవార్ధం అకాడమీ ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీవాస్తవ తెలంగాణా తొలి ఉద్యమానికి సంబంధించిన అనేక విషయాలను జ్ఞాపకం చేసుకున్నారు. 1969 తొలి ఉద్యమానికి రెండు సంవత్సరాలకు ముందే ఖమ్మంలో తొలి తెలంగాణా జర్నలిస్ట్‌ల సభ నిర్వహించి ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను ప్రపంచానికి చాటి చెప్పిన విషయం ఆయన గుర్తు చేసుకున్నారు. దేశంలో జర్నలిజం ప్రమాణాలు, విలువలు పూర్తిగా దిగజారిపోవడం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణా మీడియా అకాడమీ అధ్యక్షులు కే.శ్రీనివాస్ రెడ్డి సమావేశానికి అధ్యక్షత వహించి చందర్ శ్రీవాస్తవను ఘనంగా సత్కరించారు. శ్రీవాస్తవ హైదరాబాద్‌లో పనిచేసిన కాలంలో ఆయనతో తమ సాహచర్యాన్ని శ్రీనివాస్ రెడ్డి గుర్తుచేసుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ పూర్వాధ్యక్షులు, మన తెలంగాణా ఎడిటర్ దేవులపల్లి అమర్, ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎంఎ మాజిద్, మీడియా అకాడమీ కార్యదర్శి వెంకటేశ్వర్‌రావు సహా పలువురు జర్నలిస్ట్‌లు ఈ సమావేశానికి హాజరయ్యారు.

---

## ట్రిప్ పేరుతో సైబర్ మోసం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ట్రిప్ పేరుతో హైదరాబాద్ వ్యక్తి నుంచి రూ.2.42 లక్షలు కాజేసిన కేటుగాళ్ల ఉదంతం సోమవారంవెలుగు చూసింది. కొచ్చి–లక్షద్వీప్–ముంబయి క్రూజ్ ట్రిప్ అంటూ మాయ చేశారు. సైబర్ నేరగాళ్లు గూగుల్ సెర్చ్‌లో పెట్టిన నకిలీ క్రూజ్ వెబ్‌సైట్‌ను ఓపెన్ చేసిన హైదరాబాద్‌కు చెందిన నలుగురు సభ్యులు ప్రయాణానికి బుకింగ్ పేరుతో సుమారు రూ.2 లక్షలు అడ్వాన్స్ చెల్లించారు. లక్షద్వీప్ పర్మిట్, పిల్లల ఛార్జీలు అంటూ అదనపు వసూలు చేశారు. టెక్నికల్ ఇష్యూస్ అంటూ అమౌంట్ రిఫైండ్ చేస్తామంటూ క్యాన్సిలేషన్ చార్జీల పేరుతో మరో రూ.48,500 డిమాండ్ చేయడంతో బాధితులు వారికి పంపించారు. చార్జీల పేరుతో, రిఫైండ్ పేరుతో చెల్లించిన డబ్బులు తిరిగి రాకపోవడంతో బాధితులు మోసపోయామని గ్రహించి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

---

### నిజామాబాద్‌లో నిందితుడికి మరణశిక్ష

**సంచలన తీర్పు ఇచ్చిన న్యాయమూర్తి**

**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** నిజామాబాద్‌లో హత్యకేసులో జిల్లా న్యాయస్తానం సంచలన తీర్పును సోమవారం వెలువరించింది. హత్య కేసులో ప్రధాన నిందితుడికి మరణ శిక్ష విధిస్తూ జిల్లా న్యాయమూర్తి డి. దుర్గాప్రసాద్ తీర్పు ఇచ్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నగరంలోని బ్రాహ్మణ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ సందీప్, నాగారంకు చెందిన సతీష్ గౌడ్‌లు స్నేహితులు, వీరి మధ్య ఆటో విషయంలో గొడవ జరిగింది. దీన్ని మనసులో పెట్టుకున్న సతీస్ గౌడ్, సందీప్‌ని హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. పథకం ప్రకారం గత సంవత్సరం ఫిబ్రవరి 15,2025న సతీష్ గౌడ్, సందీప్‌ను ఇందల్వాయికి తీసుకువెళ్ళి, ఇద్దరు మద్యం సేవించి అనంతరం సందీప్‌ను పెట్రోల్‌పోసి తగులబెట్టాడు. అనంతరం సతీష్ గౌడ్ ఆటో తీసుకొని పారిపోయాడు. ఈ క్రమంలో ఐదవ టౌన్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సతీష్ గౌడ్‌ను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. ఈకేసును విచారించిన నిజామాబాద్ జిల్లా న్యాయమూర్తి డి. దుర్గాప్రసాద్, 238 బిఎస్‌ఎన్ ప్రకారం ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష, 307 బిఎస్‌ఎన్ కింద ఐదు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, 103 బిఎస్‌ఎన్ కింద 10 వేల రూపాయలు, మరణ శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు అని సిఐ శ్రీనివాస్ తెలిపారు.

---

## డిజిటల్ సినిమా పైరసీపై ఉక్కుపాదం

టిజిసిఎస్‌బి – తెలుగు ఫిల్మ్ ఛాంబర్ మధ్య ఎంఒయు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** డిజిటల్ సినిమా పైరసీకి కట్టడి చేసేందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి)తో తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (టిఎఫ్‌సిసి) కీలక ఒప్పందం కుదుర్చుకున్నాయి. టెక్నాలజీ ఆధారితంగా, సమన్వయంతో చర్యలు చేపట్టే దిశగా ఇరు సంస్థలు రాష్ట్ర డిజిపి బి.శివధర్‌రెడ్డి సమక్షంలో అవగాహన ఒప్పందం (ఎంఒయు)పై సంతకాలు చేశాయి.ఈ ఎంఒయుపై తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ , తెలుగు ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు దగ్గుబాటి సురేష్ బాబు సంతకాలు చేశారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ బి. శివధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిజిటల్ పైరసీ ఒక వ్యవస్థీకృత సైబర్ నేరంగా మారిందన్నారు. చట్ట అమలు సంస్థలు, పరిశ్రమ కలిసి పనిచేసినప్పుడే దీనికి అడ్డుకట్ట వేయగలమని చెప్పారు. ఈ ఒప్పందం ద్వారా యాంటీ పైరసీ చర్యలకు సంస్థాగత బలం చేకూరుతుందన్నారు.టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖా గోయల్ మాట్లాడుతూ, డిజిటల్ పైరసీ అత్యంత టైమ్ సెన్సిటివ్ నేరమని, కొన్ని నిమిషాల ఆలస్యం కూడా భారీ నష్టాలకు దారితీస్తుందని పేర్కొన్నారు. రియల్ టైమ్ చర్యలు, వేగవంతమైన చట్టపరమైన జోక్యం కోసం ఈ ఎంఓయూ కీలకంగా మారుతుందని తెలిపారు.

తెలుగు ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు దగ్గుబాటి సురేష్ బాబు మాట్లాడుతూ..డిజిటల్ పైరసీపై పోరాటంలో తెలంగాణ ప్రభుత్వం ముందంజలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిజిసిఎస్‌బి సీనియర్ అధికారులు హర్షవర్ధన్ , సాయి శ్రీ, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు, నిర్మాతలు సుప్రియా యార్లగడ్డ, శ్యామ్ ప్రసాద్ రెడ్డి, సాహు గరపాటి, కె.ఎల్. దామోదర్ ప్రసాద్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

**నిమిషాల్లోనే సినిమా పైరసీ..**
సినిమా విడుదలైన నిమిషాల్లోనే వెబ్‌సైట్లు, సోషల్ మీడియా, మెసేజింగ్ గ్రూపులు, ఐపిటివి స్ట్రీమ్స్, మొబైల్ యాప్‌లు, క్యామ్‌కార్డింగ్ ద్వారా పైరసీ జరుగుతోందని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో రియల్ టైమ్ ఇంటెలిజెన్స్ షేరింగ్, వేగవంతమైన టేగవంతమైన, చట్టపరమైన చర్యల కోసం ఈ ఎంఓయూ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

**ఎంఒయు ద్వారా చేపట్టే చర్యలు**
ఈ ఒప్పందం కింద టిజిసిఎస్‌బి, టిఎఫ్‌సిసి కలిసి పైరసీ నెట్‌వర్క్‌లపై రియల్ టైమ్ మానిటరింగ్, సమాచార మార్పిడి. టిజిసిఎస్‌బి ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో టిఎఫ్‌సిసి యాంటీ పైరసీ ఏజెంట్ల నియామకం ధృవీకరించిన ఫిర్యాదులపై వేగవంతమైన చట్టపరమైన చర్యలు ఐఎస్‌పిలు, ఓటిటి ప్లాట్‌ఫామ్‌లు, సోషల్ మీడియా సంస్థలతో సమన్వయం ద్వారా పైరేటెడ్ కంటెంట్ తొలగింపు ఆటోమేటెడ్ క్రాలర్లు, అనలిటిక్స్, కంటెంట్ ఐడెంటిఫికేషన్ వంటి ఆధునిక టెక్నాలజీ వినియోగం పైరసీ దుష్ప్రభావాలపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు

## 'సర్'పై కోర్టుకు వెళ్తా

అవసరమైతే సుప్రీంకోర్టుకు కూడా...

అనుమతిస్తే సాధారణ వ్యక్తిగా వాదిస్తా

మమతా బెనర్జీ



**సాగర్‌ఐలాండ్:** రాష్ట్రంలో ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటర్ల జాబితాల ఎస్ఐఆర్‌పై కోర్టుకు వెళ్తానని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ సోమవారం ప్రకటించారు. ఈ ప్రక్రియ భయం, వేధింపులు, పరిపాలనా ఏకపక్షతను రేకెత్తించిందని, దీ నివల్ల మరణాలు, ఆసుపత్రిలో చేరాల్సి వచ్చిందని ఆమె ఆరోపించారు. దక్షిణ 24 పరగణాల జిల్లాలోని సాగర్ ఐలాండ్ లో జరిగిన బహిరంగ సభలో ప్రసంగిస్తూ, సరైన కారణాలు లేకుండా ఓటర్ల జాబితాల నుండి పేర్లు ఏకపక్షంగా తొలగించబడుతున్నాయని, అసెంబ్లీ ఎన్నికల కు ముందు సాధారణ పరిపాలనా ప్రక్రియను భయానికి మూలంగా మారుస్తున్నారని ఆమె ఆరోపించారు. ఎస్ఐఆర్ కారణంగా అమానవీయంగా వ్యవహరించడం, చాలా మంది మరణించడంపై తాను కోర్టుకు వెళ్తున్నానని చెప్పారు. అనుమతిస్తే, సుప్రీంకోర్టుకు కూడా ఆశ్రయిస్తానని, ఈ అమానవీయ ప్రక్రియకు వ్యతిరేకంగా ఒక సాధారణ వ్యక్తిగా వాదిస్తానని, తాను కూడా శిక్షణ పొందిన న్యాయవాదిని అని ఆమె అన్నారు. అయితే, బెనర్జీ ఈ పిటిషన్‌ను వ్యక్తిగతంగా, రాష్ట్ర ప్రభుత్వం లేదా తృణమూల్ కాంగ్రెస్ దాఖలు చేస్తుందో లేదో స్పష్టం చేయలేదు. ప్రాణాంతక వ్యాధిగ్రస్తులు, వృద్ధులు చట్టబద్ధమైన ఓటర్లుగా నిరూపించుకోవడానికి పొడవైన క్యూలలో నిలబడవలసి వస్తోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. 'ఎవరైనా తమ వృద్ధ తల్లిదండ్రులను తమ గుర్తింపును నిరూపించుకోవడానికి వరుసలో నిలబెట్టేట్లయితే బిజెపి నాయకులు ఎలా భావిస్తారు? అని ఆమె ప్రశ్నించారు. 'సర్' ప్రారంభమైనప్పటి నుండి, చాలా మంది భయం కారణంగా మరణించారు. అనేక మంది ఆసుపత్రిలో ఉన్నారు అని ఆమె పేర్కొన్నారు. బెంగాలీ మాట్లాడే వలస కార్మికులపై బిజెపి పాలిస్తున్న రాష్ట్రాలలో వివక్ష చూపుతున్నారని బెనర్జీ ఆరోపించారు. అతను వారిని చంపడానికి ధైర్యం చేస్తున్నాడని, కానీ మతప్రాతిపదికన మాట్లాడటం నేరంగా మారిందా అని ఆమె ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ముడుపులు ఇచ్చి, ఎన్నికల్లో గెలిచిన తర్వాత అణచివేతకు పాల్పడుతుందని ముఖ్యమంత్రి ఆరోపించారు. వారు ఎన్నికలకు ముందురూ. 10,000 ఇస్తారు, అది ముగిసిన తర్వాత బుల్డోజర్‌ను ఉపయోగిస్తారు అని ఆమె అన్నారు. '

## ఢిల్లీ అల్లర్ల కేసులో ఖాలిద్, ఇమామ్‌లకు

# 'సుప్రీం' బెయిలు నిరాకరణ

**న్యూఢిల్లీ:** పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా ఢిల్లీలో జరిగిన అల్లర్ల కేసులో ఇద్దరు కీలక నిందితులకు సుప్రీంకోర్టు బెయిలు నిరాకరించింది. ఈ కేసులో ఉమర్ ఖాలిద్, షర్జీల్ ఇమామ్‌లు 2020 ఫిబ్రవరిలో హింసాత్మక అల్లరకు కుట్ర చేశారని బలమైన ఆధారాలు ఉన్నట్లు సుప్రీంకోర్టు ధర్మాసనం విశ్వసించడంతో వారికి బెయిలు తిరస్కరించింది. మరో ఐదుగురికి మాత్రం బెయిలు లభించింది. ఖాలిద్, ఇమామ్ ఇద్దరూ ఈ అల్లర్ల రేకెత్తించేందుకు ప్రణాళిక వేశారని, వ్యూహాత్మక మార్గదర్శనం చేసినట్లు బలమైన సాక్ష్యాలున్నాయని జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ ఎన్.వి.అంజారియాలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం సోమవారం స్పష్టం చేసింది. ప్రాసిక్యూషన్ చేసిన ప్రాథమిక ఆరోపణలు, సమర్పించిన సాక్ష్యాధారాలపట్ల న్యాయస్థానం సంతృప్తి చెందిందని పేర్కొంది. ఈ దశలో ప్రధాన నిందితులు ఇద్దరూ తమను తాము సమర్థించుకోలేరని పేర్కొంది. కింది కోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ నిందితులు బెయిలుకోసం సుప్రీంకోర్టును ఆశ్రయించగా ధర్మాసనం కిందికోర్టు తీర్పును సమర్థించింది. బెయిలు ప్రక్రియకోసం వేగవంతం చేయాలని కూడా సుప్రీంకోర్టు ధర్మాసనం కిందికోర్టుకు ఆదేశాలు ఇచ్చింది. బెయిలు ప్రక్రియకోసం ధర్మాసనం 12 షరతులు విధించింది. బెయిలును గనుక దుర్వినియోగం చేస్తే వెంటనే బెయిలును రద్దుచేస్తామని కూడా ఐదుగురు నిందితులకు హెచ్చరించింది. డిసెంబరు పదో తేదీన సుప్రీంకోర్టు వాదనలు విన్న తర్వాత తీర్పును రిజర్వు చేసి సోమవారం ప్రకటించింది.

ఈ కేసులో కార్యకర్తలు గుల్ఫిషా ఫాతిమా, మీరన్ హైదర్, షిఫా ఉర్ రెహ్మాన్, మహ్మద్ సలీమ్ ఖాన్, షాదాబ్ అహ్మద్‌లకు బెయిలు లభించింది. వివిధ జైళ్లలో ఉన్న వీరిని ఎప్పుడు విడుదల చేస్తారన్న విషయంలో స్పష్టత లేదు. రక్షణలో ఉన్న సాక్ష్యులను విచారణ చేసిన తర్వాత గానీ ఖాలిద్, షర్జీల్ ఇద్దరూ తిరిగి బెయిలు కోరుతూ దరఖాస్తు చేసుకోవడంకు అర్హత లభిస్తుందని కూడా ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ తీర్పుకోసం నిందితులతో పాటు ఈ అల్లర్లలో బలైపోయిన బాధితుల కుటుంబ సభ్యులు కూడా కోర్టు వెలుపల ఎంతో ఉత్కంఠతో ఎదురుచూశారు. "ఇప్పుడు జైలే నా జీవితం, కాని మిగిలినవాళ్ళకు బెయిలు వచ్చినందుకు నేను నిజంగా ఎంతో సంతోషిస్తున్నా, చాలా ఉపశమనం కలిగింది" అని కోర్టు తీర్పు తర్వాత నిందితుడు ఖాలిద్ అన్నారని ఆయన జీవిత భాగస్వామి బనోజ్యోత్స్న లాహిరి చెప్పారు. భిన్నాభిప్రాయాలతో ఉన్న ప్రజలు, భిన్న రాజకీయ అభిప్రాయాలమధ్య ఈ తీర్పు వచ్చిందన్నారు.



**కొందరి విషయంలో బెయిలు వర్తించడం లేదు**

బెయిలు అనేది ఒక నిబంధన అనీ, జైలు అనేది ఒక మినహాయింపు అనీ ఐతే కొందరి విషయంలో ఈ సూత్రం వర్తించడంలేదని సిపిఐ(ఎం) ఎంపి జాన్ బ్రిట్టాస్ విమర్శించారు. అత్యాచారాలకు పాల్పడి, హత్యలు చేసిన గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్‌కు ఇప్పటివరకూ 15 సార్లు తాత్కాలికంగా జైలు నుండి విడుదలయ్యాడని గుర్తుచేశారు. ఆర్‌జెడి ఎంపి మనోజ్ మనోజ్ ఝా మాట్లాడుతూ, బెయిలు నిరాకరణ అనేక సంక్లిష్టమైన ప్రశ్నలను లేవనెత్తుతోందన్నారు. రాజ్యాంగ రక్షణలు పొందాలంటే ఎంత కాలం ఖైదీగా ఉండాలనేది ప్రశ్నగా ఉందన్నారు. పిడిపి అధ్యక్షురాలు మహబూబా ముఫ్తీ మాట్లాడుతూ, దీనిని వివక్షతో కూడిన విచారణగా పేర్కొన్నారు.

పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ),జాతీయ పౌరస్మృతి (ఎన్ఆర్‌సి)లకు వ్యతిరేకంగా ఈశాన్య ఢిల్లీలో చెలరేగిన అల్లర్లలో మొత్తం 53 మంది హత్యకు గురయ్యారు. 700 మంది గాయపడ్డారు. ఈ కేసులో ఖాలిద్ 2020 సెప్టెంబరు 13వ తేదీన అరెస్టయ్యాడు. అంతకుముందు ఫిబ్రవరి 24,25 తేదీలలో ప్రజలను రెచ్చగొట్టే ప్రసంగాలు చేసినందుకుగాను అతడిని అరెస్టు చేశారు. అదేసమయంలో డోనాల్డ్ ట్రంప్ భారత్‌లో మొదటిసారి పర్యటనకు వచ్చారు. ఇమామ్ కూడా 2020 జనవరి 28న రెచ్చగొట్టే ప్రసంగాలు చేశాడు. పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా రెచ్చగొట్టే ప్రసంగాలు చేసిన తర్వాత జరిగిన మరో పెద్ద కుట్ర కేసులో ఇమామ్‌ను 2020 ఆగస్టులో అరెస్టు చేశారు. అతడి మామయ్య అర్షద్ ఇమామ్ బీహార్‌లోని జహనాబాద్‌లో పాత్రికేయులతో మాట్లాడుతూ, బెయిలు నిరాకరించడంపట్ల తాను ఎంతో దిగ్భ్రాంతికి గురయ్యానన్నారు. ఈసారైనా కోర్టు బెయిలు మంజూరు చేస్తుందని తానెంతో ఆశపడ్డానన్నారు. వాదనలు జరిగిన ప్రతిసారి షర్జీత్ ఇమామ్ నిర్దోషి అని రుజువు అవుతూనే ఉందని, కానీ కోర్టు బెయిలు నిరాకరిస్తోందన్నారు. కాగా బిజెపి నాయకులు స్పందిస్తూ, ఖాలిద్, షర్జీల్ ఇద్దరూ విచ్ఛిన్నకరశక్తులకు భారతదేశంలో ప్రతినిధులని విమర్శించారు. ఈ శక్తులను సమర్థించిన కాంగ్రెస్‌పార్టీ క్షమాపణ చెప్పాలని బిజెపి జాతీయ అధికార ప్రతినిధి షాజెడ్ పూనావాలా ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు. కోర్టు తీర్పును ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖాగుప్తా స్వాగతించారు.

### ఇది తీర్పు లేకుండా శిక్ష విధించడమే! డి.రాజా విస్మయం

**న్యూఢిల్లీ:** 2020 నాటి ఢిల్లీ అల్లర్ల కుట్ర కేసులో ఆరోపణలులెదుర్కొంటున్న జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ మాజీ విద్యార్థి నాయకుడు ఉమర్ ఖాలిద్, మరో విద్యార్థి నేత షర్జీల్ ఇమామ్‌లకు సుప్రీంకోర్టు బెయిల్ నిరాకరించడంపై సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా విస్మయం వ్యక్తం చేశారు. 'విచారణ లేకుండా ఐదు సంవత్సరాలకు పైగా జైలులో ఉండటం న్యాయం కాదు. ఇది తీర్పు లేకుండా శిక్ష విధించడమే. ఉమర్ ఖాలిద్, షార్జీల్ ఇమామ్‌లకు బెయిల్ నిరాకరించడం మన నేర విచారణ న్యాయవ్యవస్థలో కలతపెట్టే ద్వంద్వ ప్రమాణాలను బహిర్గతం చేస్తుంది' అన్నారు. ఓ పక్క అత్యాచారం, హత్య, సామూహిక హింస కేసుల్లో దోషులుగా తేలినవారు క్రమం తప్పకుండా బెయిల్ లేదా పెరోల్ పొందుతుండగా... పరిశోధించబడని ఆరోపణల ఆధారంగా నిందితులుగా ఉండి...విచారణలో ఉన్నవారిని నిరవధికంగా జైలులో ఉంచడంపై ఆశ్చర్యం వెలిబుచ్చారు. "అత్యాచారం, హత్య మరియు సామూహిక హింస కేసుల్లో దోషులుగా తేలినవారు క్రమం తప్పకుండా బెయిల్ లేదా పెరోల్ పొందుతారు, అయితే పరీక్షించబడని ఆరోపణల ఆధారంగా నిందితులుగా ఉన్న విచారణలో ఉన్నవారిని నిరవధికంగా జైలులో ఉంచుతారు. ఉపా వంటి చట్టాల ప్రకారం జైలు ఒక ప్రమాణంగా మారగా... స్వేచ్ఛ మినహాయింపుగా మారిందన్నారు. ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా అదే క్రూర నిబంధనల కింద సంవత్సరాల తరబడి జైలులో ఉంచబడ్డారని రాజా గుర్తు చేశారు. ఏ నేరం చేయకుండానే ఆయన తన అర్థవంతమైన జీవితాన్ని కోల్పోయాక నిర్దోషిగా విడుదలైనట్లు తెలిపారు. ఖాలిద్, షర్జీల్ పరిస్థితి కూడా ఇదేనన్నారు. అయితే ఇది న్యాయం అందించడంలో ఉద్దేశం, జవాబుదారీతనం, న్యాయవ్యవస్థ విశ్వసనీయత గురించి తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతుందన్నారు. "న్యాయస్థానాలు అంతులేని జైలు శిక్షను సమర్థించడానికి బెయిల్ నియమం , జైలు మినహాయింపు అనే రాజ్యాంగ సూత్రాన్ని వదిలివేయడానికి ప్రాథమిక ఆరోపణలపై ఆధారపడినప్పుడు, వ్యక్తిగత స్వేచ్ఛ దూరమవుతుంది. అసమ్మతిని నేరంగా పరిగణిస్తారు. కానీ నిజమైన నేరాలకు పాల్పడేవారు స్వేచ్ఛగా తిరుగుతారు" అని రాజా అన్నారు.

## బలవంతపు కౌగిలింతలు భారత్‌కు
## చాలా తక్కువ మేలు చేశాయ్

ట్రంప్‌ను ప్రధాని మోదీ పొగడ్డంపై కాంగ్రెస్ ఎద్దేవా

న్యూఢిల్లీపై వాషింగ్టన్ శీఘ్రగతిన సుంకాలను పెంచవచ్చని అమెరిక అధ్యక్షుడి వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు



**న్యూఢిల్లీ:** న్యూఢిల్లీపై వాషింగ్టన్ శీఘ్రగతిన సుంకాలను పెచ్చవచ్చని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో మోదీ సర్కార్‌పై కాంగ్రెస్ తీవ్ర విమర్శగుప్పించింది. 'నమస్తే ట్రంప్, హౌడీ మోదీ ఈవెంట్స్, బలవంతపు కౌగిలింతలు', అమెరికన్ నాయకుడిని ప్రశంసిస్తూ సోషల్ మీడియా పోస్ట్‌లు చాలా తక్కువ మేలు చేశాయని ఎద్దేవా చేసింది. భారతదేశం రష్యా చమురు కొనుగోళ్లతో సంతోషంగా లేదని ప్రధాని నరేంద్ర మోదీకి తెలుసని, వాషింగ్టన్ న్యూఢిల్లీపై సుంకాలను చాలా త్వరగా' పెంచవచ్చని ట్రంప్ చెప్పిన తర్వాత ప్రతిపక్ష పార్టీ ఈ వ్యాఖ్యలు చేసింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ ఎక్స్‌లో పోస్టు చేస్తూ 'వైట్ హౌస్‌లో ప్రధానమంత్రి మంచి స్నేహితుడు భారతదేశం పట్ల తన 'హాట్, బ్లో కోల్డ్ విధానాన్ని కొనసాగిస్తున్నాడు. భారతదేశం రష్యా నుండి చమురు కొనుగోలును ఆపకపోతే భారతదేశం నుండి అమెరికా దిగుమతులపై సుంకాలను పెంచుతామని ఆయన మరోసారి బెదిరించారు. 'ఆ నమస్తే ట్రంప్, హౌడీ మోదీ ఈవెంట్స్, ఆ (బలవంతపు) కౌగిలింతలు, అమెరికా అధ్యక్షుడిని ప్రశంసిస్తూ సోషల్ మీడియా పోస్ట్‌లు అన్నీ చాలా తక్కువ మేలు చేశాయి' అని అన్నారు. ట్రంప్ ఆదివారం ఫ్లోరిడా నుండి వాషింగ్టన్ డిసికి వెళుతూ ఎయిర్ ఫోర్స్ వన్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రాథమికంగా భారతదేశం తనను సంతోషపెట్టాలని కోరుకున్నదని, మోదీ చాలా మంచి వ్యక్తి అని అన్నారు. తాను సంతోషంగా లేనని ఆయనకు తెలుసు అని, తనను సంతోషపెట్టడం ముఖ్యమని చెప్పారు. భారత్ వాణిజ్యం చేస్తుందని, ఆ దేశంలో చాలా త్వరగా సుంకాలను పెంచవచ్చు అని, ఇది ఆ దేశానికి చాలా చెడ్డది చర్య అని వ్యాఖ్యానించారు. ట్రంప్ భారతదేశంపై విధించిన సుంకాల వల్లే న్యూఢిల్లీ ఇప్పుడు గణనీయంగా తక్కువ రష్యన్ చమురు కొనుగోలు చేస్తోందని ఎయిర్ ఫోర్స్ వన్‌లో ఆయనతో పాటు ఉన్న యుస్ సెనేటర్ లిండ్సే గ్రాహం చెప్పిన తర్వాత ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యన్ చమురు కొనుగోలు చేసే దేశాల నుండి దిగుమతులపై 500 శాతం సుంకాలు విధించే తన సుంకం బిల్లు గురించి గ్రాహం మాట్లాడారు. రష్యా-ఉక్రెయిన్ ఘర్షణను ముగించడానికి, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కస్టమర్లపై ఒత్తిడి తీసుకురావాలని గ్రాహం అన్నారు. ఆంక్షలు రష్యాను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని ట్రంప్ అన్నారు। ఆ తర్వాత భారతదేశం గురించి ప్రస్తావించారు. రష్యా చమురు కొనుగోలు చేసినందుకు భారతదేశంపై అమెరికా 25 శాతం సుంకం విధించిందని గ్రాహం అన్నారు.

## ఉమర్, షార్జీల్‌కు బెయిల్‌ను ఎందుకు నిరాకరించారు?

ప్రశ్నలు లేవనెత్తిన ప్రతిపక్షాలు

**న్యూఢిల్లీ :** ఢిల్లీ అల్లర్ల (2020) కుట్ర కేసులో సామాజిక కార్యకర్తలు ఉమర్ ఖలీద్, షార్జీల్ ఇమామ్‌లకు సుప్రీంకో ర్టు బెయిల్ నిరాకరించడంపై ప్రతిపక్ష నాయకులు సోమవారం ప్రశ్నలు లేవనెత్తారు. అత్యాచార దోషి డేరా సచ్చా సౌ దా చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్‌కు పదేప దే పెరోల్ మంజూరు చేస్తున్నారని మం డిపడ్డారు. 'బెయిల్ అనేది నియమం, జై లు మినహాయింపు' అనే సూత్రం కొంతమంది వ్యక్తుల విషయానికి వస్తే స్ప ష్టంగా వర్తించదు అని కమ్యూనిస్టు పా ర్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) ఎంపి జా న్ బ్రిట్టాస్ ఎక్స్‌లో పేర్కొన్నారు. ఉమర్ ఖలీద్‌కు బెయిల్ లేదని, క్రూరమైన 'ఉ పా' కింద 5 సంవత్సరాలకు పైగా నిర్బ ంధించారని, విచారణ ఇంకా ప్రా రంభం కాలేదన్నారు. విచారణకు ము ందు జైలుకు వెళ్లడం శిక్ష కాదని బ్రి ట్టాస్ అన్నారు. అయితే దోషిగా తేలిన రేపిస్ట్, హంతకుడు గుర్మీత్ రామ్ ర హీమ్ సింగ్ (2017లో శిక్ష పడింది)కి మ రో 40 రోజుల పెరోల్ మంజూరు చే శారు. దోషిగా తేలినప్పటి నుండి అ తను తాత్కాలికంగా జైలు నుంచి విడుదల కావడం ఇది 15వ సారి. 'ఒకరు వి చారణ లేకుండా నిరవధికంగా మగ్గుతున్నారు. మరొకరు డిమాండ్ మేరకు పదేపదే 'జైలు సెలవులు' అనుభవిస్తున్నా రు' అని ఆయన అన్నారు. తన ఇద్దరు శిష్యులపై అత్యాచారం చేసినందుకు 2 0 ఏళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్న డేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్ సి ంగ్ సోమవారం రోహ్‌తక్‌లోని సునారి యా జైలు నుండి 40 రోజుల పెరోల్ మంజూరు అయిన తర్వాత బయటకు వచ్చారు. 2017లో ఈ కేసులో దోషిగా తేలినప్పటి నుండి అతనికి మంజూరు కావడం ఇది 15వ సారి. సిపిఐ(ఎం) కూడా ఎక్స్‌లో పోస్టు చ చేస్తూ బెయిల్ నిరాకరణను కొనసాగించడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని పేర్కొంది. చట్టవిరుద్ధ కార్యకలాపాల (నివారణ) చట్టం (యుఎపిఎ)ను అసమ్మతిని అణిచివేయడానికి ఉపయోగిస్తున్నారని ఆరోపించింది. 'విచారణ లేదా దోషిగా నిర్ధారణ లేకుండా క్రూరమైన యుఎపిఎ కింద ఐదు సంవత్సరాలకు పైగా జైలులో గడిపిన ఉమర్ ఖలీద్, ష ర్జీల్ ఇమామ్‌లకు సుప్రీంకోర్టు బెయిల్ నిరాకరించడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని పార్టీ పేర్కొంది. 'విచారణకు ముందు సుదీర్ఘమైన జైలు శిక్ష బెయిల్ అ నేది జైలు కాదు, అనే ప్రాథమిక సూ త్రాన్ని ఉల్లంఘిస్తుంది. రాజ్యాంగబద్ధమై న స్వేచ్ఛా హక్కును. వేగవంతమైన విచారణను దెబ్బతీస్తుంది. భిన్నాభిప్రాయాలను లక్ష్యంగా చేసుకోవడానికి ఉపాను నిరంతరం ఉపయోగించడం అ ణచివేత, ఎంపిక చేసిన న్యాయం కలతపెట్టే నమూనాను ప్రతిబింబిస్తుంది. అన్ని రాజకీయ ఖైదీల విడుదల కోసం మా డిమాండ్‌ను మేము పునరుద్ఘాటిస్తున్నా ము' అని అది పేర్కొంది. బెయిల్ తి రస్కరణ ఇబ్బందికర మైన ప్రశ్నలను లే వనెత్తుతుందని రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి) ఎంపి మనోజ్ ఝా అన్నారు. 'ఖైదు కాలం చాలా ఎక్కువ, అన్యాయం లే దా అసమానంగా మారినప్పుడు రాజ్యా ంగ న్యాయస్థానాలకు బెయిల్ మం జూరు చేసే అధికారం, విధి ఉందనేది నిజమే.

## హర్యానాలో ప్రతి పథకంలోనూ అవకతవకలే : సుర్జేవాలా

**చండీగఢ్:** హర్యానాలో బిజెపి ప్రభుత్వ హయాంలో అవినీతి విపరీతంగా పెరిగిందని, రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ పథకం అవకతవకలతో ప్రభావితమైందని కాంగ్రెస్ సోమవారం ఆరోపించింది. జాతీయ నేర రికార్డుల బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) గణాంకాలను ఉటంకిస్తూ, పార్టీ ప్రధాన కార్యదర్శి రణదీప్ సింగ్ సుర్జేవాలా మాట్లాడుతూ గత ఐదేళ్లలో హర్యానాలో అవినీతి కేసులు 78.48 శాతం పెరిగాయని, దీంతో ఇది దేశంలో ఏడవ అత్యంత అవినీతి రాష్ట్రంగా నిలిచిందని అన్నారు. అవినీతితో విసిగిపోయిన రాష్ట్రానికి చెందిన 74 ఏళ్ల వృద్ధుడు కారుణ్య మరణానికి అనుమతి కోరుతూ రాష్ట్రపతికి లేఖ రాసేంతగా పరిస్థితి తీవ్రంగా మారిందని కాంగ్రెస్ ఎంపి పేర్కొన్నారు. హర్యానాలో దాదాపు ప్రతి ప్రభుత్వ పథకం అవకతవకలతో ప్రభావితమైందని ఆయన ఆరోపించారు. మోసం, మైనింగ్ మాఫియాలతో పాటు వివిధ మాఫియాల పెరుగుదల, పేపర్ లీక్ కేసులు మరియు మాదకద్రవ్యాల వ్యాప్తికి బిజెపి ప్రభుత్వమే కారణమని ఆయన నిందించారుముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైనీ, బిజెపి నాయకులను పాలన యొక్క పర్యవసానాలను అనుభవిస్తున్నారని ఆయన అన్నారు.

## అంతర్జాతీయ నియమాలు గౌరవించలేదు

### వెనిజులాపై భద్రతామండలిలో ఆందోళన

**న్యూయార్క్:** ఎలా చూసినా, ఏ విధంగా ఆలోచించినాగానీ వెనిజులాలో అమెరికా చేసింది దురాక్రమణ చర్యేనని ఐక్యరాజ్యసమితి భద్రతామండలి సమావేశంలో పలు దేశాలు ఆందోళన వ్యక్తం చేశాయి. వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురో, ఆయన సతీమణి సిలియా ఫ్లోరెస్‌లను న్యూయార్క్ సదరన్ డిస్ట్రిక్ట్ మన్‌హట్టన్ ఫెడరల్ కోర్టులో ప్రవేశపెట్టడానికి కొద్ది గంటల ముందుగా 15 మంది సభ్యులతో కూడిన ఐక్యరాజ్యసమితి భద్రతామండలి ప్రత్యేక సమావేశం న్యూయార్క్‌లోని యుఎన్‌ఓ కేంద్ర కార్యాలయంలో జరిగింది. తాను ఎలాంటి నార్కో-టెర్రరిజం కుట్రకు, క్రిమినల్ చర్యలకు పాల్పడలేదని కోర్టులో మదురో ఒకవైపు స్పష్టం చేయగా, మరోవైపు భద్రతా మండలిలో కూడా ఈ పరిణాలపై ముందే ఆందోళన వ్యక్తమైంది. వెనిజులాలో అస్థిరత, అశాంతి మరింతగా ఉద్ధృతమయ్యే ప్రమాదం ఉందని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్ సమావేశ ప్రారంభంలో తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం అర్ధరాత్రి వెనిజులాలో అమెరికా చేసిన సైనిక చర్య ఏ మాత్రం అంతర్జాతీయ నియమాలను గౌరవించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా దాడిలోని న్యాయబద్ధతపై ఆయన సందేహాలు వ్యక్తం చేశారు. "వెనిజులాలో, లాటిన్ అమెరికాలో ఈ చర్యవల్ల తీవ్ర అశాంతి, అస్థిరత పేట్రేగిపోయే అవకాశాలు ఉన్నాయని నాలో చాలా లోతైన ఆలోచనలు, ఆందోళన చెలరేగుతోంది, ఈ పరిస్థితి ఆ ప్రాంతంపై చాలా ప్రభావం చూపిస్తుంది, ఇకమీదట భవిష్యత్తులో దేశాలమధ్య కొనసాగే సంబంధాల విషయంలో ఇదొక కొత్త సంప్రదాయాన్ని ప్రవేశపెట్టవచ్చు" అని గుటెర్రెస్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన లిఖిత ప్రకటనను ఐక్యరాజ్యసమితి రాజకీయ వ్యవహారాల ప్రధానాధిపతి రోజ్‌మేరీ డీకార్లో భద్రతామండలిలో చదివి వినిపించారు. "వెనిజులా ప్రజలు శాంతియుతంగా ముందుకు సాగడానికి, వారికి సహాయం చేయడానికి జరుగుతున్న అన్ని ప్రయత్నాలను నేను స్వాగతిస్తున్నాను, మద్దతు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాను" అని గుటెర్రెస్ పేర్కొన్నారు. ఈ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని కోరిన కొలంబియా దేశం ఐక్యరాజ్యసమితిలో తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. వెనిజులా సార్వభౌమాధికారాన్ని, రాజకీయ స్వాతంత్ర్యాన్ని, ప్రాదేశిక సమగ్రతను అమెరికా చర్య స్పష్టంగా ఉల్లంఘించిందని ఖండించారు. ఐక్యరాజ్యసమితిలో కొలంబియా రాయబారి లియోనెర్ జలబటా టోరెస్ మాట్లాడుతూ, అమెరికా చర్య అంతర్జాతీయ చట్టాలను, నిబంధనలను, ఐక్యరాజ్యసమితి ఛార్టర్‌ను చాలా స్పష్టంగా ఉల్లంఘించిందని ఆందోళన తెలియజేశారు. ఈ ప్రాంతంలో అన్ని దేశాలకు ఇది ప్రమాదకరమన్నారు. అమెరికా చర్యకు భద్రతామండలి ఆమోదం లేనందువల్ల ఇది పూర్తిగా అసంబద్ధం, అక్రమం అని న్యాయ నిపుణులు తెలియజేశారు. ఈ విషయంలో వెనిజులా సమ్మతిగానీ, సాయుధ ప్రతిఘటనకు వెనిజులా సన్నద్ధతగానీ లేకుండాపోయిందని ఆందోళన చెందారు. అంతర్జాతీయ శాంతి భద్రతలను పర్యవేక్షించే భద్రతామండలి అమెరికాను బాధ్యురాల్ని చేయలేదని, ఎందుకంటే భద్రతామండలి చర్యలను నిరోధించగల అధికారాలు (వీటో) రష్యా,చైనా,బ్రిటన్,ఫ్రాన్స్ దేశాలతో పాటు అమెరికాకు కూడా ఉన్నాయని న్యాయనిపుణులు విమర్శించారు. ఏ దేశ ప్రాదేశిక సమగ్రత, రాజకీయ స్వాతంత్ర్యాలను కబళించకుండా బలప్రయోగచర్యలకు దేశాలు దూరంగా ఉండాలని ఐక్యరాజ్యసమితి ఛార్టర్ నిర్దేశిస్తున్నది. ప్రస్తుతం ఐక్యరాజ్యసమితిలో 193 సభ్యదేశాలు ఉన్నాయి. కాగా ఐక్యరాజ్యసమితిలో అమెరికా దౌత్యవేత్త మైక్ వాల్ట్ ఆదివారం మాట్లాడుతూ, సమితి ఛార్టర్‌లో ఉన్న 51వ నిబంధనను ఉటంకించారు. ఏ సభ్యదేశంపైన అయినా సాయుధ దాడి జరిగితే స్వీయ రక్షణ హక్కుకు దీనివల్ల నష్టం లేదన్నారు.



# అంతిమ ఘడియల్లో మావోయిస్టు పార్టీ ?

దగ్గర పడుతున్న మార్చి 31 గడువు

మిగిలున్న వారి కోసం ముమ్మర గాలింపు

**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం:** ఒకప్పుడు సమాంతర పాలన సాగించిన మావోయిస్టు పార్టీ సిద్ధాంతాలు, పోరాటాలు అంతిమ ఘడియల్లోకి చేరుకుంటున్నాయి. ఈ విషయాన్ని ఇటీవల వరుసగా లొంగిపోతున్న మావోయిస్టు అగ్ర నేతలే స్వయంగా వెల్లడిస్తున్నారు. ప్రస్తుతం పరిస్థితుల్లో ప్రజాయుద్ధం కొనసాగించ లేమని, ఆయుదాలు అప్పగించి లొంగిపోవడం తప్ప మరో ప్రత్యామ్నాయం లేదని చెప్పుకొస్తున్నారు. భారీ ఎత్తున అగ్రనేతలతో సహా పలువురి ఎన్‌కౌంటర్లు, లొంగుబాట్ల నేపథ్యంలో మావోయిస్టు పార్టీ అంతిమ దశకు చేరుకున్నట్లు సుస్పష్టమవుతోందని విశ్లేషకులు చెబుతున్నారు. దశాబ్దాల పాటు మావోయిస్టులకు పెట్టని కోటగా ఉన్న దండకారణ్యం ఇప్పుడు సాయుధ నిశబ్ధాన్ని అలుముకుంటోంది. పక్షుల విప్లవ రాగాలు మూగబోతున్నట్లు అవుతోంది. పారే సెలయేటి నీళ్ల నీడలో కనిపించే బందూకులు బాధతో చప్పుడు చేయక తుప్పు పడుతున్నట్లుగా మారింది. సాయుధ పోరాటం ప్రారంమైన దశ అణిచివేత, దోపిడీ, పెత్తందారీ విధానం అయితే... అదే దశపు అనవాళ్లు ఇప్పుడు మావోయిస్టు పార్టీ అంతానికి పూనుకున్నాయి. దీంతో 16 రాష్ట్రాల్లో సమాంతర పాలన సాగించిన నక్సలైట్ పార్టీ ప్రస్తుతం అంపశయ్యకు చేరుకున్నదని వాదనలు వినవస్తున్నాయి.



**దగ్గర పడుతున్న గడువు:** ఈ ఏడాది మార్చి 31 నాటికి మావోయిస్టు రహిత భారతాన్ని చూస్తారంటూ కేంద్ర హోంమంత్రి అమీత్‌షా పదేపదే చెప్పుకొచ్చిన ఆ గడువు సమీపిస్తోంది. దీంతో అడవులను తమ ఆదీనంలోనికి తీసుకున్న పారా మిలటరీ బలగాలు మావోయిస్టులపై ముప్పేట దాటి మొదలు పెట్టాయి. ఆపరేషన్ కగార్‌లో భాగంగా ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రా, తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలను అనుసంధానం చేస్తూ రహదార్లు వేశారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల అభివృద్ధిలో భాగంగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నేషనల్ పార్క్, పామేడు వద్ద చింతవాగుపై నిర్మించిన రెండు వంతెనలు మావోయిస్టుల ఏరివేతకు కీలక పాత్ర పోషించాయి. ఎప్పుడైతే అడవుల్లో బేస్‌క్యాంపులు, బలగాలు సులువుగా ప్రయాణం చేసేందుకు మార్గాలు ఏర్పడ్డయో మావోయిస్టుల ఉనికిపై పెను ప్రభావం చూపింది. కేం ద్రంలో మూడోసారి అధికారంలోనికి వచ్చిన బిజెపి ప్రభుత్వం గడువు పెట్టి మరీ మావోయిస్టుల ను ఏరివేసేందుకు సిద్ధ పడింది. ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ వంటి మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల్లో బిజెపి అధికారంలో ఉండటం గ మనార్హం. గడిచిన రెండేళ్లలో మావోయిస్టు పార్టీని కేంద్ర క మిటీ కార్యదర్శి బసవరాజు, సభ్యులు చలపతి, సుధాకర్, కట్టా రామచంద్రారెడ్డి, కది రి సత్యనారాయణ రెడ్డి, రూపేష్, హిడ్మా త దితర అగ్రనేతల ఎన్‌కౌంటర్‌లు, పలువురి లొంగుబాటు కుంగదీసింది. మిలటరీ దా డుల రూపకర్త మావోయిస్టు నేత హిడ్మాను నవంబర్ 18న చాకచక్యంగా హతమార్చిన పోలీసులు మరింత పట్టు సాధించారు. మ రో ప్రక్క తాజాగా దేవా తన అనుచరులతో లొంగిపోయారు. ఇక కేంద్ర కమిటీతో పా టు పలు కమిటీల్లో మిగిలిన ముఖ్యనేతలు ముగ్గురే ప్రధానంగా ఉన్నట్లు తెలుస్తోంది. వారిలో ప్రస్తుత మావోయిస్టు కార్యదర్శి తి ప్పరి తిరుపతి, అలియాస్ దేవ్‌జీ, ముప్పాళ్ల లక్ష్మ ణరావు అలియాస్ గణపతి, బడో చొక్కారావు అలియాస్ దామోదర్ తెలంగాణకు చెందిన వారు కాగా మిషిర్ బెస్రా అలియాస్ భాస్కర్‌లు ఉన్నారు. దీంతో మావోయిస్టు పార్టీ ఉనికి దాదాపుగా చివరి దశకు చేరినట్లే అయింది. కేంద్రం పెట్టిన గడువు సమీపిస్తున్న నేపథ్యంలో మిగిలిన మావోయిస్టుల కోసం పెద్ద ఎత్తున గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

**గడిచిన రెండేళ్లలో:** మావోయిస్టు పార్టీని గడిచిన రెండేళ్లలో తీవ్ర నష్టాలు వెంటాడాయి. ఉనికి కోసం ప్రయత్నాలు చేయడం సాధ్యపడని నేపథ్యంలో ఆయుధాలు అప్పగించక తప్పలేదు. రెండేళ్లపాటు సుమారు 220 ఎన్ కౌంటర్లు జరిగాయి. ఈ ఎదురు కా ల్పుల్లో సుమారు 467 మంది మావోయిస్టులు మృతి చెందారు. 2354 మంది లొంగిపోగా, 1813 మంది అరెస్టయ్యారు. 931 ఆయుదాలను పోలీసులు స్వాదీనం చేసుకున్నారు. ఇదిలా ఉండగా 41 మంది జవాన్లు ఎదురు కాల్పుల్లో మృతి చెందగా, సాధారణ పౌరులు 125 మంది పోరులు మృత్యువాత పడ్డారు. లేఖలతోనే హడలెత్తించిన మావోయిస్టు పార్టీ ఇప్పుడు ఉనికిని కోల్పోతోంది. విప్లవానికి అంతం లేదని మాజీ మావోయిస్టులు చెబుతున్నప్పటికీ ప్రస్తుతం పట్టు సాధించి పెనుగులాడటానికి అవకాశం లేదు. పీడన ఉన్నంత కాలం ఉద్యమాలు సజీవంగానే ఉంటాయని, దోపిడీ, అణిచి వేత కొనసాగినంత కాలం ప్రశ్నించే గొంతుకలు వినపిస్తూనే ఉంటాయనేది విప్లవం ఎరిగిన సత్యం. మావోయిస్టు పార్టీ అంతానికి మోడీ షాలు విధించిన గడువు ఆగమేఘాల మీద ముంచుకొస్తున్న తరుణంలో ఎన్నో ప్రశ్నలు, అనుమానాలు తలెత్తుతున్నాయి.

## బెంగళూరులో ఉద్రిక్త పరిస్థితి

ఓం శక్తి భక్తుల ఊరేగింపుపై రాళ్లు రువ్విన దుండగులు

**బెంగళూరు:** కర్నాటక రాజధాని బెంగళూరు నగరంలోని జగ్జీవన్ రామ్ నగర్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఓం శక్తి భక్తుల ఊరేగింపుపై దుండగులు రాళ్లు రువ్వారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా ఉన్నప్పటికీ, అదుపులోనే ఉందని పోలీసులు సోమవారం తెలిపారు. ఆదివారం రాత్రి ఊరేగింపుపై జరిగిన దాడిలో ఇద్దరు మహి ళలు గాయపడ్డారు. ఈ ఘటన తర్వాత, నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ స్థానికులు జెజె నగర్ పోలీస్ స్టేషన్ వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. సోమవారం బాధితుల నుంచి ప్రతీకార చర్యలు జరిగే అవకాశం ఉందనే భయంతో జెజె నగర్‌లో అదనపు పోలీసు బలగాలను మోహరించారు. సీనియర్ పోలీసు అధికారులు ఆ ప్రాంతంలోనే మకాం వేసి, ఈ నేరానికి పాల్పడిన నిందితులను పట్టుకోవడానికి దర్యాప్తు ప్రారంభించారు. వివిఎస్ గార్డెన్‌కు చెందిన శశికమార్ ఎన్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఆదివారం అర్ధరాత్రి ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. శశికమార్ తెలిపిన వివరాల ప్రకారం, భక్తులు ఆ ప్రాంతంలో ఊరేగింపు నిర్వహిస్తున్నప్పుడు రాత్రి 8.15 గంటల నుండి 9.00 గంటల మధ్య సంఘటన జరిగింది. తాను గత 23 సంవత్సరాలుగా ఓం శక్తి మాల ధరించి, ఆచారంలో భాగంగా ఇరుముడిని మోస్తూ ఓం శక్తి, అయ్యప్ప స్వామి పూజలలో పాల్గొంటున్నానని ఫిర్యాదుదారుడు పేర్కొన్నాడు.

**పట్టాదారు పాసు బుక్కు పోయినది**

హనుమకొండ జిల్లా కాజీపేట మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన **ఆవుల రవళి భర్త యాదగిరికి** సంబంధించిన తెలంగాణ పట్టాదారు పాస్ బుక్ పోయినది. తన భర్త ఆవుల యాదగిరి 02-12-2025 తేదీన మృతి చెందాడు. తన భర్త పేరు మీద ఉండబడిన **తెలంగాణ పట్టాదారు పాసు బుక్కు ఖాతా నెంబర్ : 60450, పట్టా పాసు బుక్ నెం. T21100011234** గల భూమి పట్టా దారు పాసు బుక్కు పోయినది. సంబంధిత పట్టాదారు పాసు బుక్కు దొరికినవారు ఈ క్రింది చిరునామాకు అందించగలరు.

ఇట్లు:
**ఆవుల రవళి,**
**భర్త : ఆవుల యాదగిరి,**
ఇంటి నెంబర్ : 57-3-53
గ్రామం : రాంపూర్, మండలం : కాజీపేట,
జిల్లా : హనుమకొండ, పిన్: 506151
ఫోన్ నెంబర్ : 7386853365.

# క్రీడలపై రాజకీయ క్రీనీడ

భారత ఉపఖండంలో పాలకపక్షాల మధ్య రాజకీయ వైరాలు, అస్థిరత, అనిశ్చితికి క్రీడా సంబంధాలు బలి అవుతున్నాయి. భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఇప్పటికే ఉప్పు–నిప్పుగా ఉన్న సంబంధాలు ఇరు దేశాల జట్లు — ఒకటి రెండో దేశంలో పర్యటించే అవకాశాన్ని త్రోసిపుచ్చాయి. ఈ పరిస్థితి తాజాగా బంగ్లాదేశ్‌కు విస్తరించింది. ఆ దేశంలోని అంతర్గత రాజకీయ పరిస్థితులు, అక్కడ మైనారిటీలుగా ఉన్న హిందువులపై మతోన్మాదుల మూక దాడులు అగ్నికి ఆజ్యం తోడయినట్లయింది. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు, హత్యలు మన దేశంలో ఆగ్రహావేశాపూరితమైన నిరసనలకు దారితీశాయి. ఇందులో ఉన్న ముస్లిం–హిందూ కోణం ఇరుదేశాల మధ్య సత్సంబంధాలను కలుషితం చేస్తున్నది. పూర్వప్రధాని షేక్ హసీనా వాజెద్ గత ఆగస్టులో జన్–జడ్, వారి వెనుకనున్న దుష్టశక్తుల హింసాత్మక కృత్యాలతో తమ దేశం విడిచి భారత్‌లో ఆశ్రయం పొందటం. అవినీతికి, నాటి అల్లర్లకు ఆమెను బాధ్యురాల్ని చేస్తూ ఢాకాలోని ప్రత్యేక న్యాయస్థానం ఆమెకు మరణశిక్ష విధించటం, ఆమెను తమకు అప్పగించాలని బంగ్లాలో భారత్ వ్యతిరేక ప్రదర్శనలు జరగటంతో బంగ్లాదేశ్ అంతర్గత సమస్య భారత్–బంగ్లా సమస్యగా మారింది. తాత్కాలిక ప్రభుత్వం ఫిబ్రవరిలో నిర్వహిస్తామంటున్న జాతీయ పార్లమెంటు ఎన్నికల్లో షేక్ హసీనా అధ్యక్షురాలిగా ఉన్న ప్రధాన రాజకీయ పార్టీ అవామీలీగ్ పాల్గొనకుండా ముఖ్య సలహాదారు యూనస్ ప్రభుత్వం నిషేధించటం తెలిసిందే. అంతేగాక పచ్చి మితవాద సంస్థ జమాతె ఇస్లాంపైనున్న నిషేధాన్ని ఎత్తివేసింది. ఈ నేపథ్యంలో బిఎన్‌పి అధ్యక్షురాలు, మాజీ ప్రధాని బేగం ఖలీదా జియా అనారోగ్యంతో మరణించటం, 18 ఏళ్లుగా లండన్‌లో ప్రవాస జీవితం గడుపుతున్న ఆమె కుమారుడు రెహ్మాన్ కొద్దిరోజుల క్రితం ఢాకా తిరిగివచ్చి (ఆయన మీదున్న కేసులు రద్దు చేసి ప్రభుత్వం అందుకు వీలు కల్పించింది), పార్టీ అధ్యక్షబాధ్యతలు స్వీకరించటం బంగ్లాదేశ్ రాజకీయాల్లో మరో కోణం.

ఈ ఉద్రిక్తత పరిస్థితుల్లో క్రీడా సంబంధాలు అసాధ్యమని ఎవరైనా అంగీకరిస్తారు. అందువల్ల పరిస్థితులు సాధారణీకరణ పొందేవరకు ద్వైపాక్షిక క్రీడా పర్యటనలు వాయిదా వేయవచ్చు. కాని ఇప్పుడు ఇందులో విచారకరమైన కొత్త కోణం చోటు చేసుకుంది. ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపిఎల్) 2026 సంవత్సర ఎడిషన్‌కు ఫ్రాంచైజీ కలకత్తా నైట్ రైడర్స్ (సినీ హీరో షారూఖ్‌ఖాన్ యజమాని) గత నెలలో నిర్వహించిన క్రీడాకారుల వేలంపాటలో బంగ్లాదేశ్ పేస్ బౌలర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను దక్కించుకుంది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో బంగ్లాదేశ్ ఆటగాణ్ణి విడుదల చేయాలని బిసిసిఐ కలకత్తా నైట్ రైడర్స్‌కు సలహాయివ్వటం, దాన్ని వారు అమలు చేయటం జరిగింది. బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు ఇందుకు ప్రతి చర్య అన్నట్లుగా భారత్–శ్రీలంక సంయుక్త ఆతిథ్యంలో జరగబోతున్న టి.20 ప్రపంచ కప్ టోర్నీకి తమ జట్టు భద్రతా కారణాలరీత్యా భారత్ రాలేదని, అందువల్ల తమ జట్టు మ్యాచ్‌లను భారత్ వెలుపల ఏర్పాటు చేయాలని ఐసిసిని అధికారికంగా కోరింది. ఐపిఎల్ మ్యాచ్‌ల టివి ప్రసారాలను కూడా నిషేధించింది. ఈ పురుషుల వరల్డ్‌కప్ ఫిబ్రవరి 7 నుండి మార్చి 8 వరకు జరుగుతుంది. 55 మ్యాచ్‌ల్లో 20 శ్రీలంకలో జరుగుతాయి. భారత్, పాకిస్థాన్ జగడం దృష్ట్యా పాకిస్థాన్ పాల్గొనే పోటీలన్నీ 2028 వరకు తటస్థ వేదికల్లో జరపటానికి ఐసిసి ఇంతకుముందే అంగీకరించింది. ఇరుదేశాల క్రికెట్ పోటీలకు దుబాయ్ వేదికగా ఉంది. ఈ టి.20 ప్రపంచకప్ పోటీల్లో బంగ్లా జట్టు లీగ్‌దశలో కలకత్తాలో మూడు, బొంబాయిలో చివరి లీగ్ ఆడాల్సి ఉంది. వరల్డ్ కప్ మ్యాచ్‌లకు సమయం తక్కువగా ఉన్నందున ఐసిసి కిది పరీక్ష. ఎక్కడో ఒక చోట ఏర్పాటు చేయకపోతే ఏకంగా టోర్నమెంట్ అభాసుపాలవుతుంది.

భారత ఉపఖండంలో భారత్, పాకిస్థాన్, శ్రీలంక తదుపరి బంగ్లాదేశ్, అఫ్ఘానిస్థాన్ క్రికెట్ ఆడే దేశాలు. వాటిలో మూడు దేశాల మధ్య రాజకీయంగా ప్రస్తుతం స్నేహ సంబంధాలు లేవు. ఇక మిగిలింది శ్రీలంక, అఫ్ఘానిస్థాన్. కాబూల్‌లో పాలన దృష్ట్యా అక్కడ అంతర్జాతీయ క్రీడలకు అవకాశం లేదు. ప్రభుత్వాలు, ప్రజల మధ్య సంబంధాలు దెబ్బతిన్నప్పుడు క్రీడా, సాంస్కృతిక సంబంధాలు ఆశించలేము.

సంపాదకీయం....



## అవసరమైతే సుప్రీంకు వెళతా..

'సర్' ప్రక్రియలో భాగంగా అనుసరిస్తున్న అమానవీయ ప్రవర్తన వల్ల అనేక మంది మరణిస్తున్నారు. దీనికి వ్యతిరేకంగా మంగళవారం న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం. అవసరమైతే సుప్రీం కోర్టుకు కూడా వెళ్లి సాధారణ పౌరురాలిగా వాదిస్తా. ఇంకా నేను శిక్షణ పొందిన న్యాయవాదిని కూడా. గంగాసాగర్ సేతు డిమాండ్ ఎన్నో ఏళ్లుగా ఉంది. ఈ క్రమంలోనే గంగసాగర్, దాని పరిసర ప్రాంతాల అభివృద్ధికి శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉంది. దీని టెండర్ ఎల్ అండ్ టి సంస్థకు అప్పగించాం. ఈ రోజు శంకుస్థాపన చేశాం. వచ్చే 2-3 ఏళ్లలో ఈ వంతెన పూర్తి అవుతుందని ఆశిస్తున్నాం. ఈ అత్యాధునిక బ్రిడ్జికి సుమారు రూ.1700 కోట్లు ఖర్చు అవుతుంది.

- ప.బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ



# జన్యు శాస్త్ర పిత గ్రెగర్ మెండెల్

సంతానం తల్లిదండ్రుల నుండి జన్యు సమాచారాన్ని ఎలా పొందుతుంది అనే ప్రక్రియగా వారసత్వాన్ని నిర్వచించవచ్చు. వంశపారంపర్య ప్రక్రియ మొత్తం వారసత్వంపై ఆధారపడి ఉంటుంది మరియు సంతానం తల్లిదండ్రులను పోలి ఉండడానికి ఇది కారణం. వారసత్వం కారణంగా, ఒకే కుటుంబానికి చెందిన సభ్యులు ఒకే విధమైన లక్షణాలను కలిగి ఉంటారని దీని అర్థం.

19వ శతాబ్దం మధ్యలో మాత్రమే ప్రజలు వారసత్వాన్ని సరైన రీతిలో అర్థం చేసుకోవడం ప్రారంభించారు. వారసత్వం గురించి ఈ అవగాహన గ్రెగర్ మెండెల్ ద్వారా సాధ్యమైంది, అతను వారసత్వాన్ని అర్థం చేసుకోవడానికి కొన్ని నియమాలు రూపొందించాడు, వీటిని మెండెల్ వారసత్వ నియమాలు అంటారు.

మెండెల్ తన ప్రయోగాలలో బఠానీ మొక్కలను ఎంచుకున్నాడు ఎందుకంటే బఠానీ మొక్క విభిన్నమైన గమనించదగ్గ లక్షణాలను కలిగి ఉంది. దీనిని పెద్ద సంఖ్యలో సులభంగా పెంచవచ్చు మరియు దాని పునరుత్పత్తిని మార్చవచ్చు. అలాగే, బఠానీలో మగ మరియు ఆడ పునరుత్పత్తి అవయవాలు ఉన్నాయి, కాబట్టి అవి స్వీయపరాగసంపర్కం మరియు క్రాస్‌పరాగసంపర్కం చేయగలవు.మెండల్ చేసిన పరిశోధనలవల్ల అనువంశికత ఏ విధంగా ఒక తరం నుండి మరొక తరానికి సంక్రమిస్తుందో తెలియవచ్చింది.అందువల్లే మనం మెండల్ ని జన్యుశాస్త్ర పిత అని వ్యవహరిస్తున్నాం. అయితే ఆయన చనిపోయిన తర్వాత ఆయనకు ఈ గుర్తింపు లభించింది. జూలై 20, 1822న ఆస్ట్రియాలోని హీన్‌జెండార్ఫ్‌లో ఒక వ్యవసాయ కుటుంబంలో గ్రెగర్ జోహాన్ మెండెల్ జన్మించాడు. మెండెల్ తన కుటుంబం యొక్క నిరాడంబరమైన పొలంలో పెరిగాడు, పదకొండు సంవత్సరాల వయస్సులో స్థానిక పాఠశాల ఉపాధ్యాయుడు, యువ మెండెల్ యొక్క తెలివితేటలతో ముగ్ధుడై, అతని విద్యను కొనసాగించడానికి అతనిని పాఠశాలకు పంపమని కుటుంబాన్ని ప్రోత్సహించాడు. కొంతకాలం పాటు మెండల్ క్రైస్తవ మత ప్రచారకర్తగా వ్యవహరించాడు. ఆయన 1884జనవరి 6న తుదిశ్వాస విడిచారు.

(జనవరి 6–మెండల్ వర్ధంతి సందర్భంగా)

# 'ఆ గట్టునుంటావా ఈ గట్టుకొస్తావా' : మోదీకి ట్రంప్ పరీక్ష



ఎం.కోటేశ్వరరావు

ప్రతి ఏటా మాదిరే ఈసారి కూడా అమెరికా రక్షణశాఖ (పెంటగన్) 2025 నివేదిక విడుదల చేసింది. దాని లో ఉన్న అభూత కల్పనలు, కుట్ర సిద్ధాంతాలు, వక్రీకరణలతో సహా అనేక అంశాల గురించి మీడియాలో, ఇతరంగా అనేకమంది తలలు బద్దలు కొట్టుకుంటున్నారు. హెచ్చరికలు, పరోక్ష బెదిరింపులు, బుజ్జగింపులు, చైనా, మనదేశం పరస్పరం దెబ్బలాడుకొనేందుకు తంపులు పెట్టటం వంటివి అనేకం ఉన్నాయి. ఈ ఏడాది నివేదిక ప్రత్యేకత ఏమంటే తన తో చెట్టపట్టాలు వేసుకుని జిగిని దోస్తులా ఉన్న నరేంద్రమోడీకి సహజభాగస్వామి డోనాల్డ్ ట్రంప్ అగ్ని పరీక్ష పెట్టాడంటే అతిశయోక్తి కాదు. ఏడాది కాలంలో ఎంతలో ఎంతమార్పు ?

ఐదేండ్ల పాటు శత్రువుగా పరిగణించిన చైనాతో పూర్వంమాదిరి సంబంధాలు, అమెరికాతో ఎడబాటుకు 2025నాంది పలికింది. అమెరికా మీడియా కొన్ని అంతర్గత అంశాల మీద విమర్శనాత్మకంగా ఉన్నప్పటికీ మొత్తంమీద ఎవరు అధికారంలో ఉంటే ఆ ప్రభుత్వ కనుసన్నలలోనే ఉంటుంది. " భవిష్యత్‌లో ఘర్షణ అవకాశం" ఉంటుందంటూ వాల్‌స్ట్రీట్ జర్నల్ తాజాగా భారత్, చైనా గురించి ఒక విశ్లేషణ రాసింది. దానికి ఆధారం పెంటగన్ నివేదికలోని అంశాలు. భవిష్యత్‌లో చైనాతో యుద్ధం తలెత్తే సమక్షంలో యావత్ హిమాలయ ప్రాంతంలో భారత్ వందలకోట్ల డాలర్లతో రోడ్లు, సొరంగాలు, విమానాలు ఎగిరే, దిగే ఏర్పాట్లు తదితర మౌలిక సదుపాయాలను నిర్మిస్తోంది. రక్షణ విషయంలో సమతూకంతో ఉండటం కాకుండా వ్యూహాత్మక పోటీని సంచలనాత్మకం కావిస్తోంది. 2020 గాల్వన్ లోయలో మాదిరి చైనా కొద్ది గంటల్లోనే అదనపు బలగాలను దించగలదు, మౌలిక సదుపాయాలు లేని కారణంగా అదే భారత్‌కు ఒక వారం పడుతుంది. మొత్తం వైఖరిని మార్చుకోవాల్సిన అవసరం వచ్చిందని గుర్తించామని, అందువలన ఆలోచనలు నాటకీయంగా మారినట్లు లడఖ్ ప్రాంతంలో రవాణా నిర్వహణ వ్యవహారాలను పర్యవేక్షించిన మాజీ అధికారి మేజర్ జనరల్ అమ్రిత్ పాల్ సింగ్ చెప్పినట్లు ఆ పత్రిక పేర్కొన్నది. గాల్వన్‌లోయ ఉదంతాల తరువాత రెండు దేశాల మధ్య సంబంధాలు కనిష్ట స్థాయికి పడిపోయాయని, డోనాల్డ్ ట్రంప్ పన్నుల విధింపుతో భారత్, చైనాలతో అమెరికా సంబంధాలు దెబ్బతిన్నట్లు కూడా వ్యాఖ్యానించింది.

రెండు దేశాల మధ్య దెబ్బతిన్న సంబంధాలను సరి చేసుకోవాలని 2024 అక్టోబరు నుంచి నిర్ణయించుకోవటమేగాక వేగంగా సాధారణ పరిస్థితులను పునరుద్ధరించాయి. దాంతో ఏడు సంవత్సరాల తరువాత ప్రధాని నరేంద్రమోదీ చైనాలో జరిగిన షాంఘై సహకార సంస్థ సమావేశానికి హాజరై పుతిన్, షీ జింపింగ్‌లతో భేటీ జరిపి అమెరికాకు పరోక్ష హెచ్చరికలు పంపా రు. పెంటగన్ నివేదిక ఈ పూర్వరంగంలో తయారైందే అన్నది స్పష్టం. సరిహద్దులలో ఉద్రిక్తతలు తగ్గటాన్ని అవకాశంగా తీసుకొని అమెరికా, భారత్ సంబంధాలను బలహీనపరిచేందుకు చూస్తున్నదని, పాకిస్తాన్‌తో రక్షణ సంబంధాలను మరింతగా పెంచుకుంటున్నదని, అరుణాచల్ ప్రదేశ్‌ను ప్రధాన అంశంగా చూస్తున్నదని ఆ నివేదికలో చైనామీద ఆరోపించారు. గత పదకొండు సంవత్సరాలు, అంతకు ముందు యుపిఎ హయాంలో అమెరికా జూనియర్ భాగస్వామిగా మారేందుకు మన్మోహన్ సింగ్ ప్రయత్నించారు. తరువాత నరేంద్రమోదీ హౌడీమోడీ కార్యక్రమంలో డోనాల్డ్ ట్రంప్‌ను గెలిపించాలని కోరుతూ ప్రచారంచేసి చెట్టపట్టాలు వేసుకుతిరిగి మరింత సన్నిహితమయ్యారు. క్వాడ్ పేరుతో చైనాకు వ్యతిరేకంగా మరింత చురుకుగా వ్యవహరించారు. ఈ పరిణామాలకు చైనా కారణమా? ప్రారంభ సంవత్సరాల్లో జవహర్‌లాల్ నెహ్రూ కూడా అమెరికావైపే మొగ్గారు. దానిది ధృతరాష్ట్ర కౌగిలి అని అర్థమయ్యాక అలీనవిధానం, సోవియట్‌వైపు మొగ్గారు. పరిస్థితిని చూస్తుంటే ఇప్పుడు నరేంద్రమోదీ కూడా చైనాతో రానున్న రోజుల్లో ఎలా ఉంటారో తెలియదుగాని అనివార్యంగా అమెరికా బెదిరింపులను వ్యతిరేకించకతప్పని స్థితిలో ఉన్నారు. నరేంద్రమోదీ అమాయకంగా చైనా వలలో చిక్కుకున్నారని అనుకుంటే అంత కంటే అమాయకత్వం మరొ కటి ఉండ దు. అవసరాలు అలానడిపిస్తాయి.

అరుణాచల్ ప్రదేశ్ టిబెట్‌లో అంతర్భాగమని మనదేశంలో ఆశ్రయం పొందుతున్న దలైలామా స్వయంగా చెప్పాడు. ఆ పెద్దమనిషికి మనదేశం అన్ని విధాలుగా మద్దతు ఇస్తున్నది. అదే మాట చైనా కూడా చెబుతున్నమాట నిజం. అయితే ఎన్నడూ ఆక్రమించుకుంటామని చెప్పలేదు. 1962 యుద్ధం సందర్భంగా చైనా సేనలు అరుణాచల్ ప్రదేశ్‌లోని తేజ్‌పూర్ వరకు వచ్చాయి. అక్కడే తిష్టవేసి ఉంటే పరిస్థితి ఎలా ఉండేదో ఊహించుకోవచ్చు. యుద్ధంలో కాల్పుల విరమణను వారే ప్రకటించి, తమ ఆధీనంలోకి తెచ్చుకున్న ప్రాంతాల నుంచి ఉపసంహరించుకొని వాస్తవాధీన రేఖకు ఆవలకు వెళ్లాయి. ఇది చైనా వ్యతిరేకులు కూడా అంగీకరిస్తున్న తిరుగులేని వాస్తవం. బ్రిటీష్ అధికారులు గీచిన సరిహద్దు రేఖలను చైనా ఎన్నడూ అంగీకరించ లేదు. లడఖ్‌లోని ఆక్సాయ్ చిన్ ప్రాంతం మనదిగానూ, అరుణాచల్ చైనాలో భాగంగా బ్రిటీష్ మాపుల్లో ఉంది. అందుకే సరిహద్దు వివాదం తలెత్తింది. ఐదేండ్ల క్రితం ఆరుణాచల్ ప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలను ఆక్రమించి చైనా కొన్ని గ్రామాలు నిర్మిస్తున్నదని మన మీడియాలో పెద్ద ఎత్తున వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. అవి అమెరికా సిఐఎ సృష్టించిన కట్టుకథలు, వక్రీకరించిన చిత్రాలు. హెలికాప్టర్ ప్రమాదంలో మరణించిన మన మిలిటరీ అధికారి రావత్ అప్పుడే ఆ వార్తలు అవాస్తమని ప్రకటించారు. గతంలో ఎన్నడో నిర్మించిన ఇండ్లు పాతబడిపోయినందున వాటి స్థానంలో కొత్త నిర్మాణాలు తప్ప చైనా ఎలాంటి ఆక్రమణకు పాల్పడలేదని



చెప్పారు. మన కేంద్ర ప్రభుత్వం కూడా కొత్తగా ఎలాంటి దురాక్రమణలు జరగలేదని పార్లమెంటులో, వెలుపలా ప్రకటించిన సంగతి తెలిసిందే.

పాకిస్తాన్‌కు చైనా ఆయుధాలు, యుద్ధ విమానాలు విక్రయిస్తున్నది జాగ్రత్త అంటూ మన దేశాన్ని భయపెట్టేందుకు పెంటగన్ పూనుకుంది. ఆయుధాల క్రయ, విక్రయాలు అంతర్జాతీయ నిబంధనల మేరకే జరుగుతున్నాయి. చైనా గురించి మనలను రెచ్చగొడుతున్న అమెరికా దానికంటే ముందుగానే ఎఫ్16 యుద్ధ విమానాలను, ఇతర ఆయుధాలను పాకిస్తాన్ కు ఎందుకు అమ్మినట్లు? మనకు కూడా ఎఫ్35 విమానాలను ఇస్తామని స్వయంగా డోనాల్డ్ ట్రంపే చెప్పాడు కదా? మనం ఫ్రాన్సునుంచి రాఫేల్ యుద్ధ విమానాలను కొనుగోలు చేస్తున్నాం. అదేవిధంగా చైనా నుంచి పాకిస్తాన్ కొనుగోలు చేసింది. చైనా విమానాలు ఎగరలేవు, ఆయుధాలు తుస్సుమనే నాశిరకం అని ఒకవైపు ప్రచారం చేస్తున్నవారు, వాటి గురించి ఎందుకు భయపెడుతున్నట్లు? ఎంతో సమర్థవంతమైనవని చెబుతున్న రాఫేల్ విమానాలను పాకిస్తాన్ ఆ నాశిరకం ఆయుధాలతోనే కూల్చివేసింది. ఆపరేషన్ సింధూర్‌లో ఏం జరిగిందీ, చైనా ఆయుధాల గురించీ నరేంద్రమోదీకి తెలియని అంశం కాదు. ఆ తరువాతే కదా చైనాలో జరిగిన షాంఘై సహకార సంస్థ సమావేశానికి మోడీ వెళ్లటం, చైనాకు వీసాలు, విమానాల పునరుద్ధరణ వంటి సానుకూల పరిణామాలన్నీ చోటు చేసుకున్నది. సంబంధాల పునరుద్ధరణ సందర్భంగా రెండు దేశాలూ ఇతర దేశాలతో సంబంధాల విషయంలో పరస్పరం ఎలాంటి ఆంక్షలు పెట్టకూడదని నిర్ణయించాయి. పెంటగన్ నివేదికను చూసి మనదేశంలోని కొందరు నిజమే కదా అనుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు.

తగాదాలు పెట్టటం, అనుమానాలను పెంచటంలో అమెరికా తరువాతే ఎవరైనా. పెంటగన్ నివేదికను బయటపెట్టిన తరువాత గతంలో అధ్యక్షుడిగా ఉన్న జార్జి డబ్ల్యు బుష్ మరియు రష్యా అధినేత వ్లదిమిర్ పుతిన్ మధ్య జరిగిన ప్రైవేటు సంభాషణలు బయటకు వచ్చాయి. చైనాను నమ్మవద్దని ఇప్పుడు మనకు ట్రంప్ చెబుతున్నట్లే నాడు బుష్ కూడా పుతిన్‌కు చెప్పాడు. బుష్, పుతిన్ మధ్య 2001 నుంచి 2008వరకు జరిగిన సంభాషణల ప్రకారం చైనా నుంచి మీకూ మాకూ ఇద్దరికీ దీర్ఘకాలిక సవాలు ఉన్నదని, అందువలన మీరు జాగ్రత్తలు తీసుకోవాలని బుష్ చెప్పాడు. తొలిసారి స్లోవేనియాలో ఇద్దరు నేతలు భేటీ అయినపుడు రష్యా పశ్చిమదేశాల్లో భాగం అనీ, శత్రుదేశం కాద ని, చైనాతో జాగ్రత్తగా ఉండాలని, ఇద్దరికీ దీర్ఘకాలం సమస్యలుంటాయని బుష్ అన్నాడు. 2005 లో కూడా ఈ ప్రస్తావన చేసినపుడు మాకంటే మీకే ఎక్కువ సమస్యలని పుతిన్ చెప్పాడు. దానికి వారేమీ మా సరిహద్దులలో లేరని (చైనా రష్యా మధ్య 4,195 కిలోమీటర్ల సరిహద్దు ఉంది) చైనా నుంచి వ్యవస్థాపరమైన సవాలు ఉందని బుష్ బదులిచ్చాడు.

అయితే పుతిన్ తక్కువేమీ తినలేదు గనుక తమకు తక్షణ ప్రమాదం నాటో తూర్పువిస్తరణ, ఐరోపాలో అమెరికా క్షిపణి మోహరింపు పథకాల నుంచి వుందని చెప్పాడు. చివరి సారిగా ఇద్దరు నేతల మధ్య 2008లో సంభాషణలు చోటు చేసుకున్నా యి. అక్కడ కూడా బుష్ చైనా గురించి హెచ్చరించాడు. అయితే తమ దేశ సరిహద్దులకు పశ్చిమ దేశా ల మిలిటరీ మోహరింపు తక్షణ ప్రమాదంగా ఉందని పుతిన్ స్పష్టం చేశాడు. తరువాత జరిగిన పరిణామాల్లో రష్యాను నమ్మించి మోసం చేసేందుకు అమెరికా నాయకత్వంలోని నాటో చేసిన కుట్రలు బయటపడ్డాయి. ఉక్రెయిన్‌లో రష్యా అనుకూల ప్రభుత్వాన్ని కూలదోసి తమకు తొత్తులుగా ఉండేవారిని గద్దెనెక్కించి, దానికి నాటో సభ్యత్వమిచ్చి రష్యా సరిహద్దుల్లో తిష్టవేసేందుకు పూనుకున్నారు. దానికి ప్రతిగానే రష్యా 2014లో ఉక్రెయిన్‌లో ఉన్న ప్రాంతమైన క్రిమియాను స్వాధీనం చేసుకుంది.దాంతో రష్యాను జి 8 కూటమి నుంచి తొలగించారు.

అసలు అమెరికా ఎందుకు గుండెలు బాదుకుంటోంది? ఆసియా ఖండంపై ఆధిపత్యంకోసం, దానిలో భాగంగా చైనాను కట్టడి చేసేందుకు దీర్ఘకాలంగా అది అనుసరిస్తున్న విధానానికి న్యూఢిల్లీ, బీజింగ్ సాధారణ సంబంధాల పునరుద్ధరణ పెద్ద ఎదురుదెబ్బ. భారత్ మెడమీద తుపాకి పెట్టి చైనాను కాల్చాలనుకున్న దాని ఎత్తుగడ పారే అవకాశం లేదని అనుకుంటున్నది. రెండు దేశాల మధ్య సరిహద్దు వివాదంలో మూడోదేశ జోక్యానికి అవకాశం లేదని మోదీ సర్కార్ స్పష్టం చేసింది. చైనాతో దౌత్య సంబంధాలు, వీసాలు, విమానాల పునరుద్దరణ ఏదో తాత్కాలిక వ్యూహంలో భాగం అనుకోలేము. రష్యా, చైనా, భారత్ సంబంధాలు మరింత సన్నిహితం కావటం సహజంగానే అమెరికాకు మింగుడుపడటం లేదు. ఈ పరిణామం ప్రపంచ రాజకీయాలలో అమెరికా ఆధిపత్యాన్ని సవాలు చేసేదిగా కనిపిస్తున్నది. ఈ పూర్వరంగంలో అమెరికా, భారత్, జపాన్, ఆస్ట్రేలియాలతో కూడిన క్వాడ్ కూటమి భవిష్యత్ ఏమిటన్నది ప్రశ్నగా మారిందని చెప్పవచ్చు. దక్షిణ చైనా సముద్రంలో చైనాను అడ్డుకొనేందుకు 2007లో ఈ కూటమిని అమెరికా ముందుకు తెచ్చింది. తరువాత దాని పరిణామాలు, పర్యవసానాలను మదింపు చేసుకొని మన్మోహన్ సింగ్ దాని పట్ల ఆసక్తి చూపకపోవటంతో ఒక విధంగా అది అటకెక్కింది. తరువాత నరేంద్రమోదీ ఉత్సాహం చూపటంతో 2017 నుంచి చురుకుగా పనిచేస్తున్నది.

మారిన పరిస్థితుల్లో అంతర్గతంగా మోదీకి ఇష్టం ఉన్నా, లేకపోయినా ట్రంప్‌ను వ్యతిరేకిస్తున్నారు, చైనా వైపు మొగ్గారు. అందుకే ట్రంప్ ఇప్పుడు అగ్నిపరీక్ష పెట్టారు. ఏ గట్టునుండాలో తేల్చుకొమ్మని హెచ్చరించాడు.

# గాంధీ, నెహ్రూ వారసత్వంపై దాడి

భారతదేశ లౌకిక పునాదులు సడలిపోయి, పరీక్షకు గురవుతున్న ఈ యుగంలో జాతిపిత మహాత్మాగాంధీ మరియు ఆధునిక భారతదేశ నిర్మాత జవహర్‌లాల్ నెహ్రూ శాశ్వత కృషి దేశ గుర్తింపుకు కీలకంగా మిగిలి ఉంది. ఇటీవల రాజకీయ చర్చలు, ప్రభుత్వ ప్రత్యక్ష పరోక్ష చర్యలు తీవ్రమైన వ్యతిరేకత అలాగే సామాజిక సమగ్రతను విచ్ఛిన్నం చేసేవిగా ఉన్నాయి. కొన్ని స్వతంత్ర సంస్థలను తమ చెప్పు చేతుల్లో పెట్టుకుని కేసులు బనాయించి ప్రజల్లో సాంఘిక అశాంతిని పెంచి సమాజంలో జరిగే అభివృద్ధికి కొన్ని మతాలు, కొన్ని కులాలు ప్రతిబంధకంగా మారాయని తద్వారా రాజ్యాంగాన్ని సమూలంగా మార్చే పద్ధతిలో ఇప్పుడున్న కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించుకుంటోందని ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతున్నాయి. మహాత్మా గాంధీ అహింస (సత్యాగ్రహం) మరియు మానవతావాద దర్శనం మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ నుంచి నెల్సన్ మండేలా వరకు ప్రపంచ నాయకులను ఇప్పటికీ ప్రేరేపిస్తుంది. గాంధీ పేదరికం, కుల వివక్ష, వలస పాలనకు వ్యతిరేకంగా పోరాటాలకు నాయకత్వం వహించారు, ఇది 1947లో భారత స్వాతంత్ర్యంల సాధించిన తర్వాత ముగిసింది. ఆరెస్సెస్ బిజెపి తో సంబంధం ఉన్న అంశాలు గాంధీపట్ల చారిత్రక శత్రుత్వాన్ని కలిగి ఉన్నాయని కాంగ్రెస్ నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఇతర ప్రతిపక్ష పార్టీలు ప్రజాతంత్ర వాదులు విమర్శిస్తున్నారు. ఇది హిందూ మహాసభ భావజాల వాదుల తో ముడిపడి ఉంది, అలాగే గాంధీ పాత్రను తగ్గించే నిరంతర ప్రయత్నాలను చేస్తున్నారు. ఇటీవలకాలంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంను కొత్త ఫ్రేమ్‌వర్క్ విబి జీ రామ్ జీ పేరు మార్చడం ద్వారా నిరూపితమైంది, కీలక గ్రామీణ సంక్షేమ పథకం నుంచి జాతిపిత మహాత్మా గాంధీ పేరును తొలగించడం సిగ్గుచేటు. భారతదేశ మొదటి హోం మంత్రి సర్దార్ వల్లభ్భాయ్ పటేల్ 1948లో ఆర్‌ఎస్‌ఎస్ ను నిషేధించారు, గాంధీ హత్యకు దోహదపడిన సాంప్రదాయిక విషాన్ని పెంచిన పాత్రను ఉదహరిస్తూ. చారిత్రక రికార్డులు పటేల్ను ఉల్లేఖిస్తాయి: సావర్కర్ ప్రత్యక్ష పర్యవేక్షణలో హిందూ మహాసభ యొక్క ఫనాటికల్ వింగ్ కుట్రను రూపొందించి, దానిని అమలు చేసింది (నెహ్రూ లేఖ, ఫిబ్రవరి 27, 1948). భారతదేశం మొదటి ప్రధానమంత్రి (1947–1964) జవహర్‌లాల్ నెహ్రూ ఆధునిక భారతదేశాన్ని పారిశ్రామికీకరణ, శాస్త్రీయ మనస్తత్వం మరియు అనాలైన్మెంట్ ద్వారా మార్చారు. నెహ్రూ మానవతావాదాన్ని పెంపొందించారు, తర్కం, అనుభవాత్మక సాక్ష్యం మైనారిటీ రక్షణలకు ప్రాధాన్యత ఇచ్చారు. సంక్షేమ రాజ్య దృష్టి పేదరికం మరియు అసమానతను ప్రణాళికాబద్ధ ఆర్థిక వ్యవస్థ ద్వారా పరిష్కరించింది, సాంప్రదాయికతను ఎదుర్కొనేందుకు విభిన్నతలో ఐక్యతను ప్రోత్సహించింది.

వ్యవస్థలను నెలకొల్పడంలో నెహ్రూ చేసిన కృషి అంతా ఇంతా కాదు. ఇటీవల పార్లమెంట్ సెషన్ లో వందే మాతరం వంటి చారిత్రక సంఘటనల పై చర్చలు నెహ్రూ పాత్ర వక్రీకరించేదిగా గమనించవచ్చు. పథకాల పేరు మార్పు, మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టం సంస్కరణలతో కాంగ్రెస్‌వారసత్వాన్ని తొలగించే ఆరోపణలను రేకెత్తించాయి. స్వతంత్ర పోరాటంలో పాల్గొనని మతోన్మాదులు, బ్రిటిషువారి మూతులు నాకి క్షమాభిక్ష ప్రసాదించమని ప్రార్థించిన వారి వారసులు పాలిస్తున్న తరుణంలో ఇలాంటి దుష్పరిణామాలు సంభవించక తప్పదు. భారతదేశం ఈ చర్చలను నావిగేట్ చేస్తున్నప్పుడు, అహింస, లౌకికత మరియు సమగ్ర ప్రగతిలో మూలాలు ఉన్న గాంధీ, నెహ్రూ వారసత్వాలు దేశ స్థాపన ఆదర్శాల గుర్తు చేయడంగా పని చేస్తాయి. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్యం కోసం సామాజిక సమైక్యత, ప్రజాస్వామ్యం, లౌకికవాదం కాపాడటం అవసరం.

డా. ముచ్చుకోట సురేష్ బాబు

# కారకస్‌లో కల్లోలం.. ఢిల్లీలో ఆందోళన

దక్షిణ అమెరికా ఖండంలో అత్యధిక చమురు నిల్వలు కలిగిన వెనెజులాలో శనివారం రాత్రి చోటుచేసుకున్న పరిణామాలు ప్రపంచ భౌగోళిక రాజకీయాలను ఒక్కసారి గా కుదిపేశాయి. అమెరికా దళాలు ఆ దేశ రాజధాని కారకస్‌పై మెరుపు దాడులు నిర్వహించి, అధ్యక్షుడు నికోలస్ మదురోను అదుపులోకి తీసుకోవడం అంతర్జాతీయ చట్టాలు, సార్వభౌమాధికారంపై కొత్త చర్చ కు దారితీసింది. ఈ ఉద్రిక్తతలపై భారత విదేశాంగ శాఖ స్పందిస్తూ, అక్కడి పరిస్థితు లు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొనడం గమనార్హం. మారుతున్న పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నామని చెబుతూనే, సమస్యను శాంతియుత మార్గాల్లో, దౌత్యపరమైన చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని భారత్ పిలుపునిచ్చింది. అయితే, ఈ ఆందోళన కేవలం ఒక దేశ రాజకీయ మార్పు గురించి మాత్రమే కాదు, దీని వెనుక భారత్ యొక్క లోతైన ఆర్థిక, వ్యూహాత్మక ప్రయోజనాలు ముడిపడి ఉన్నాయి. వెనెజువెలాలో నెలకొన్న అస్థిరత భారత్‌కు ఆర్థికంగా ఎంతో కీలకమైన అంశం. ప్రపంచంలోనే అతిపెద్ద ముడిచమురు నిల్వలు ఉన్న దేశాలలో వెనెజులా ఒకటి కావడంతో, అక్కడ జరిగే ఏ చిన్న అలజడి అయినా అంతర్జాతీయ చమురు మార్కెట్‌పై తక్షణ ప్రభావం చూపుతుంది.




గత దశాబ్దకాలంగా భారత్ తన ఇంధన అవసరాల కోసం వెనెజులాపై గణనీయంగా ఆధారపడుతూ వచ్చింది. మదురో ప్రభుత్వంపై అమెరికా విధించిన ఆంక్షల కారణంగా ఇటీవల దిగుమతులు తగ్గినప్పటికీ, ఇప్పుడు జరుగుతున్న సైనిక చర్య వల్ల చమురు సరఫరా వ్యవస్థ పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉంది. దీనివల్ల అంతర్జాతీయ మార్కెట్ ముడిచమురు ధరలు పెరిగితే, అది భారత్ వంటి దిగుమతి ఆధారిత దేశాల ఆర్థిక వ్యవస్థపై తీవ్ర భారాన్ని మోపుతుంది. రవాణా ఖర్చులు పెరగడం ద్వారా దేశీయంగా ద్రవ్యోల్బణం పెరిగి, సామాన్య ప్రజలపై భారం పడే అవకాశం ఉంది. అంతేకాకుండా, వెనెజులా లో ఒఎన్‌జిసి విదేశ్ వంటి భారతీయ చమురు సంస్థలు వేలకోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టాయి. మదురో ప్రభుత్వం పతనం కావడం, ఆ దేశంలో పౌర యుద్ధం వంటి పరిస్థితులు తలెత్తితే, ఆ పెట్టుబడుల భద్రత మరియు సుమారు ఒక బిలియన్ డాలర్లకు పైగా రావాల్సిన బకాయిలు ప్రశ్నార్థకంగా మారుతాయి వెనెజులాలోని భారతీయ పౌరుల రక్షణ విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అప్రమత్తమైం ది. సుమారు 80 మందికి పైగా భారతీయులు అక్కడ ఉన్నట్లు సమాచారం, వారి భద్రత కోసం విదేశాంగ శాఖ నిరంతరం అక్కడి రాయబార కార్యాలయంతో సంప్రదింపులు జరుపుతోంది. అత్యవసర పరిస్థితులు తలెత్తితే వారిని సురక్షితం గా తరలించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. భారత్ తన జాతీయ ప్రయోజనాలను, అంతర్జాతీయ సంబంధాలను సమతూకం చేసుకుంటూ ఆచితూచి అడుగులు వేస్తోంది. అంతర్జాతీయ చట్టాలను గౌరవిస్తూనే, మానవతా దృక్పథంతో ఈ సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత అంతర్జాతీయ సమాజంపై ఉంది. ఈ పరిణామాలు గ్లోబల్ సౌత్ దేశాలకు భారత్ నాయకత్వం వహించే తరుణంలో ఒక పెద్ద పరీక్షగా నిలవనున్నాయి.

వెంకగారి భూమయ్య
9848559863

## తుమ్మల చెరువులో మొసలి కలకలం

**ప్రజాపక్షం/వీపనగండ్ల:** మండల పరిధిలోని సంగినేనిపల్లి గ్రామ శివారులో ఉన్న తుమ్మల చెరువులో మొసలి కనిపించడంతో స్థానికులు మొసలి కనిపించడంతో స్థానికులు అప్రమత్తంగా ఉండాలని గ్రామ సర్పంచ్ పల్లె జయంతి వేణుమాధవరెడ్డి సూచించారు. సోమవారం కొందరు రైతులు చెరువులో మొసలిని గమనించడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. గ్రామ శివారులోని ఉగ్ర లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి వెళ్లే రహదారి పక్కనే తుమ్మల చెరువు ఉండగా, ఎగువ ప్రాంతాల నుంచి నీళ్లు వచ్చి చేరుతున్న క్రమంలో మొసలి చెరువులోకి వచ్చి ఉండవచ్చని సర్పంచ్ తెలిపారు. ఇదే విధంగా వీపనగండ్ల ఊర చెరువు, పల్లె చెరువు, గోవర్ధనగిరి సమీపంలోని కత్వ చెరువుల్లో కూడా మొసళ్లు ఉన్నట్టు గ్రామస్తులు అటవీ శాఖ అధికారులకు ఇప్పటికే సమాచారం అందించారు. చెరువుల్లో ఉన్న మొసళ్లను బంధించి సురక్షిత ప్రాంతాలకు తరలించేలా అటవీ శాఖ అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని సంగినేనిపల్లి గ్రామ సర్పంచ్ పల్లె జయంతి వేణుమాధవరెడ్డి, వీపనగండ్ల సర్పంచ్ పార్వతమ్మ కోరారు.

## సమస్యల పరిష్కారానికి ప్రజావాణి


**ప్రజాపక్షం/నారాయణపేట:** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను అధికారులకు సూచించారు. ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 22 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నపొర్ల విద్యార్థుల ఘన విజయం



**ప్రజాపక్షం/ఉట్కూర్:** జిల్లాస్థాయిలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌లో మండలంలోని చిన్నపొర్ల గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కీర్తన మొదటి ర్యాంకు సాధించగా, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉర్దూ మీడియం విద్యార్థులు జోహా మర్యమ్, హజారే బేగం రెండో ర్యాంకు సాధించారు. ఇటీవల నిర్వహించిన గణిత శాస్త్ర పోటీల్లో జిల్లా స్థాయిలో రెండో ర్యాంకు సాధించిన శోభియా నమీన్ విద్యార్థులను సోమవారం గ్రామ సర్పంచ్ గాంధ్ర నిఖిత ప్రశాంత్, మాజీ సర్పంచ్ రవీందర్ రెడ్డి, వార్డు మెంబర్ బండ నవాజ్ అభినందించి ప్రోత్సాహకంగా అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రతిభను కొనియాడిన వారు, వారి విజయాలకు మార్గనిర్దేశం చేసిన ఉపాధ్యాయుల కృషిని ప్రశంసించారు. విద్యార్థుల విజయాల్లో ఉపాధ్యాయులు పాత్ర ఎంతో కీలకమని పేర్కొంటూ వారికి ప్రత్యేకంగా సన్మానం నిర్వహించారు. గ్రామ విద్యార్థులు అన్ని రంగాల్లో ఉన్నత స్థాయిలో ప్రతిభ కనబరచాలని, ఇలాంటి విజయాలు మరిన్ని సాధించాలని సర్పంచు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదులపై చర్యలు : ఎస్‌పి



**ప్రజాపక్షం/వనపర్తి:** ప్రతి సోమవారం వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిలో భాగంగా జిల్లాలో సోమవారం వివిధ ప్రాంతాల నుండి 10 మంది ఫిర్యాదుదారులు వివిధ సమస్యలపై నేరుగా జిల్లా ఎస్పీ సునిత రెడ్డికి ఫిర్యాదులు అందించారు. ఫిర్యాదు చేసిన ప్రతి ఫిర్యాదుపై వనపర్తి ఎస్పీ స్పందించి స్వయంగా ఫిర్యాదును పరిశీలించి సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులకు తక్షణమే సదరు ఫిర్యాదులపై చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఫిర్యాదుదారులకు న్యాయం జరుగుతుందనే భరోసాను కలిగించే విధంగా జిల్లా ఎస్పీ చర్యలు తీసుకోవడం పై వచ్చిన ఫిర్యాదుదారులు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ప్రజావాణిలో మొత్తం 10 ఫిర్యాదుల్లో 7 భూతగాదాల ఫిర్యాదులు, 3 పరస్పర గొడవలకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయి.

## ఆర్థికసాయం అందజేత

**ప్రజాపక్షం/వెల్దండ :** మండలపరిధిలోని చెదురుపల్లి గ్రామానికి చెందిన పోలే పెద్ద అంజయ్య సోమవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ వైస్ ఎంపిపి వెంకటయ్యగౌడ్ ఆకుటుంబాన్ని పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా చెదురుపల్లి సర్పంచ్ వడ్త్యవత్ ధన్సింగ్‌నాయక్ రూ.3వేల ఆర్థికసాయం అందజేసి ఆకుటుంబానికి అండగా ఉంటానని భరోసా కల్పించారు.
**కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో :** చెదురుపల్లి గ్రామంలో పోలే పెద్ద అంజయ్య మృతిచెందిన విషయం తెలుసుకున్న కాంగ్రెస్‌పార్టీ నాయకులు కటిక శిశుపాల్‌రెడ్డి ఆ యొక్క కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేసి ఆకుటుంబాన్ని అన్నివిధాలుగా ఆదుకుంటానని చెప్పారు.

## ప్రజా భద్రతే పోలీసు బాధ్యత




**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అప్పన్నపల్లి నందు "సురక్ష పోలీసు కళా బృందం", షీటీమ్, ఎహెచ్‌టియు సంయుక్తంగా సామాజిక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్సై భూపాల్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టి క్రమశిక్షణతో కృషి చేస్తే ఉత్తమ భవిష్యత్తు సాధ్యమవుతుందని తెలిపారు. పోలీసు కళాబృందం సభ్యులు పాటలు, సందేశాల ద్వారా అవగాహన కల్పించారు. వేగ నియంత్రణ, మొబైల్ డ్రైవింగ్ చేయరాదని విద్యార్థుల ద్వారా తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. బాల్య వివాహాలు, అక్రమ రవాణా, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, పోక్సో చట్టం గురించి అవగాహన కల్పిస్తూ, బాలికలు, మహిళల భద్రతకు షీటీమ్ ప్రత్యేకంగా పనిచేస్తోందని, అవసరమైతే షీటీమ్ నంబర్ 8712659365 సంప్రదించాలని తెలిపారు. జిల్లా యువత, బాల బాలికలు మంచి భవిష్యత్తు సాధించాలని జిల్లా ఎస్పీ డి. జానకి ఐపీఎస్ సందేశాన్ని విద్యార్థులకు వినిపించారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ ఫౌజియా, ఎహెచ్‌టీయు ఎస్సై సుజాత, షీటీమ్ ఏఎస్‌ఐ జయరాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జడ్చర్లను రెవెన్యూ డివిజన్ చేయాలి

### నవాబుపేటలో కొల్లూరును కొత్త మండలం చేయాలి
### అసెంబ్లీ జీరో అవర్‌లో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి



**ప్రజాపక్షం/జడ్చర్ల :** రెండు జాతీయ రహదారులకు కూడలి కేంద్రంగా ఉన్న జడ్చర్లను రెవెన్యూ డివిజన్, బస్ డిపోలను మంజూరు చేయాలని, కొల్లూరును కొత్త మండలంగా ప్రకటించాలని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న జడ్చర్ల ప్రాంతానికి అవసరమైన సౌకర్యాలను కల్పించాలన్నారు. సోమవారం అసెంబ్లీ జీరో అవర్‌లో ఈ విషయం గురించి అనిరుధ్‌రెడ్డి మాట్లాడారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న జడ్చర్ల ప్రాంతానికి అవసరమైన సౌకర్యాలను కల్పించాలన్నారు. సోమవారం అసెంబ్లీ జీరో అవర్‌లో ఈ విషయం గురించి అనిరుధ్‌రెడ్డి మాట్లాడారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన నాగర్‌కర్నూల్ జిల్లాలో 20 మండలాలు ఉండగా ఆ జిల్లాలో 4 రెవెన్యూ డివిజన్లు ఉన్నాయని తెలిపారు. 13 మండలాలు ఉన్న జోగులాంబ గద్వాల, నారాయణపేట జిల్లాలో కూడా ఒక్కో రెవెన్యూ డివిజన్ ఉండగా 17 మండలాలు, 306 రెవెన్యూ గ్రామాలు కలిగిన మహబూబ్‌నగర్ జిల్లాలో కేవలం ఒకే ఒక్క రెవెన్యూ డివిజన్ ఉందని చెప్పారు. 6.43 లక్షల ఎకరాల భూమి, 10.12 లక్షల జనాభా కలిగిన మహబూబ్‌నగర్ జిల్లాకు ఒక్క రెవెన్యూ డివిజన్ ఉండటంతో ప్రజలు, అధికారులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వివరించారు. జడ్చర్ల నియోజకవర్గ పరిధిలోని ఊర్కొండ మండలాన్ని నాగర్‌కర్నూల్ డివిజన్ పరిధిలోకి చేర్చి తమ జడ్చర్లకు అన్యాయం చేసారని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలోనే రెవెన్యూ డివిజన్‌గా అప్‌గ్రేడ్ చేయడానికి అన్ని అర్హతలు కలిగిన జడ్చర్లను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా మార్చాలని అనిరుధ్‌రెడ్డి కోరారు. అదే జడ్చర్ల నియోజకవర్గానికి అటు ఇటుగా ఉన్న కల్వకుర్తి, మహబూబ్‌నగర్ లలో బస్ డిపోలు ఉన్నాయని, అయితే అన్ని వసతులు కలిగిన జడ్చర్లలో బస్ డిపోను కూడా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ప్రభుత్వాన్ని కోరారు. కాగా గతంలో బాలానగర్ మండలాన్ని బాలానగర్, రాజాపూర్ మండలాలుగా చేసారని, అలాగే మిడ్జిల్ మండలాన్ని మిడ్జిల్, ఊర్కొండ మండలాలుగా విభజించారని, అలాగే నవాబుపేట మండలంలో కొల్లూరు ను కూడా కొత్త మండలంగా చేయాలని అనిరుధ్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. గతంలో బీఆర్ఎస్ హయాంలో జడ్చర్లకు ఉన్న ఎమ్మెల్యే లు ఎవరూ అసెంబ్లీలో మాట్లాడనందున ఈ సమస్యలు పరిష్కారం కాలేదని, ఇప్పుడు తనకు అవకాశం రావడంతో తాను మాట్లాడుతున్నానని తన ప్రసంగానికి అడ్డుతగులుతున్న కొందరు సభ్యులకు సమాధానం ఇచ్చారు. అనిరుధ్‌రెడ్డి చెప్పిన విజయాలను నోట్ చేసుకున్నామని మంత్రి కొండా సురేఖ ప్రకటించారు.



## పురాతన కట్టడాల పరిరక్షణ మన బాధ్యత

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** పురాతన కట్టడాల పరిరక్షణ మన బాధ్యత అని, ఆధ్యాత్మిక వారసత్వానికి నిలువెత్తు నిదర్శనమైన గచ్చుబావి శివాలయ పునరుద్ధరణకు నవంతు సంపూర్ణ సహకారాన్ని అందిస్తానని ఐక్యత ఫౌండేషన్ వ్యవస్థాపకులు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని పురాతన ప్రసిద్ధగచ్చుబావి శివాలయ దేవాలయాన్ని సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శిథిలావస్థలోని ప్రస్తుతం గొప్ప సంకల్పంతోకూడిన పునరుద్ధరణ పనులతో కొత్త రూపాన్ని సంతరించుకొని తరతరాల భక్తివిశ్వాసాలకు ప్రతీకగా నిలుస్తున్న శివాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం జరుగుతున్న పునరుద్ధరణ పనులను పరిశీలించారు. పురాతన దేవాలయాల సంరక్షణతోపాటు ఆధ్యాత్మిక వారసత్వాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన అన్నారు. ఈ ఆలయం గొప్ప ఆధ్యాత్మిక పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దేలా అందరం కృషిచేద్దామన్నారు. అనంతరం ఆలయ కమిటీసభ్యులు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి శాలువాతో సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు గచ్చుబావి ఆలయ అభివృద్ధి కమిటీసభ్యులు స్థానిక నాయకులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రజావాణికి 31 ఫిర్యాదులు



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** జిల్లాలోని వివిధ ప్రాంతాలనుండి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యల ఆర్జీలను నాగర్‌కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్ పి.అమరేందర్ స్వీకరించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 31 ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ అమరేందర్ మాట్లాడుతూ వివిధశాఖల పరిధిలో ఉన్న ప్రజా సమస్యల పరిష్కారంకోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందజేస్తున్న వినతులను సంబంధితశాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిశీలించి వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు బాద్యతతో పనిచేయాలని సూచించారు. కలెక్టరేట్‌ఏఓ చంద్రశేఖర్, కలెక్టరేట్ విభాగాల సూపరిండెంట్లు , సంబంధితశాఖల అధికారులు పాల్గొన్నారు.

## సిపిఐ ఆధ్వర్యంలో ట్రంప్ దిష్టిబొమ్మ దహనం




**ప్రజాపక్షం/వనపర్తి టౌన్:** వెనిజులా అధ్యక్షుడు మధురో దంపతులను అరెస్టు చేసి అమెరికాలో నిర్బంధించడంపై సిపిఐ వనపర్తి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం వనపర్తి అంబేద్కర్ చౌక్‌లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. అమెరికా సామ్రాజ్యవాదం నశించాలని, మధుర దంపతులను వెంటనే విడుదల చేయాలని, ప్రపంచ దేశాలు ముక్తకంఠంతో ఖండించాలని సిపిఐ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఐ పట్టణ కమిటీ అధ్యక్షుడు రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్ మాట్లాడుతూ వెనిజులా దేశ అధ్యక్షుడు మధుర దంపతులను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని సిపిఐ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ప్రపంచ దేశాలు డోనాల్డ్ ట్రంప్ చర్యను ఖండించాలని కోరారు. అమెరికా దేశ ప్రజల నుంచి చీత్కారాలు ఎదుర్కొంటున్న ట్రంప్ దానికి కప్పి పెట్టేందుకు ఇలాంటి మూర్ఖపు పోకడలు ఎంచుకున్నారని ప్రజల నుంచి తగిన గుణపాఠం తప్పదు అన్నారు. ఇప్పుడు వెనిజులా మరో మూడు దేశాలను అక్రమించేందుకు ట్రంప్ కుట్ర చేస్తున్నాడని వార్తలు వస్తున్నాయన్నారు. వెనిజులా తీరుకు గుణపాఠం చెబితేనే అతని దూకుడు తగ్గుతుందన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు మాజీ సర్పంచు కళావతమ్మ, శ్రీరామ్, చిన్నకుర్మయ్య, జయమ్మ, రమణ, కృష్ణ, జ్యోతి, రూప, సుప్రియ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి అందిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ మీటింగ్ హాల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 90 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్‌తో పాటు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన చేస్తూ పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జడ్.పి.సి.ఈ.ఓ వెంకట రెడ్డి, డిఆర్‌డిఓ నర్సింహులు, ఆర్‌డిఓ నవీన్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




## అసెంబ్లీ ముట్టడికి రిటైర్డ్ ఉద్యోగుల యత్నం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ అసెంబ్లీ సమావేశాల వేళ వివిధ సంఘాలు తమ సమస్యలను ఎత్తి చూపేందుకు అసెంబ్లీ ముట్టడికి ప్రయత్నిస్తున్నాయి. ఇందులో భాగంగా.. తమకు రావాల్సిన పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ రిటైర్డ్ ఉద్యోగులు సోమవారం తెలంగాణ అసెంబ్లీ ముట్టడికి ప్రయత్నించారు. దీంతో అసెంబ్లీ పరిసరాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ప్రధానంగా 2024 నుండి ప్రభుత్వం పెన్షన్ దారులకు చెల్లించాల్సిన కరువు భత్యం (డిఎ), ఇతర పాత బకాయిలను విడుదల చేయడం లేదని వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ పెండింగ్ డిఎలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించిన ఆందోళనకారులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో బక్క జడ్సన్ సహా పలువురు రిటైర్డ్ ఉద్యోగులను పోలీసులు అరెస్ట్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్కు తరలించారు. పెన్షన్ దారుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, తక్షణమే తమకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా ఆందోళనకారులు నినాదాలు చేశారు. దీంతో ఒక్కసారిగా అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

## వెనిజులా అధ్యక్షుడి అపహరణ దారుణం

### ఎఐఎఫ్‌బి రాష్ట్ర అధ్యక్షులు జోజిరెడ్డి




**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను అగ్రరాజ్యం అమెరికా అపహరణ చేయడం దారుణమని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఎఐఎఫ్‌బి) పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అంబటి జోజిరెడ్డి పేర్కొన్నారు. వెనిజులా దేశంలోని సహజ వనరులను దోచుకొనేందుకు అమెరికా దురాక్రమణకు ప్రయత్నిస్తున్నదని మండిపడ్డారు. సోమవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మాజీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.వి.ప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.రాములు యాదవ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్యహితంగా ఎన్నికైన ప్రభుత్వాలను కూల్చి అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించే పనిలో అగ్రరాజ్యం అమెరికా ఉన్నదని ధ్వజమెత్తారు. వెనిజులాను ప్రజాస్వామ్య ప్రభుత్వం పాలించాలని తమ పార్టీ ఆకాంక్షిస్తున్నదన్నారు. ఇటీవల బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశామని తెలిపారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించిన సుభాష్ చంద్రబోస్ స్థాపించిన ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీని గ్రామీణ స్థాయికి తీసుకెళ్తామన్నారు. ఇందులో భాగంగా 50వేల సభ్యత్వ నమోదు చేపడుతామన్నారు. సమావేశంలో ఎఐఎఫ్‌బి రాష్ట్ర నేతలు సయ్యద్ తౌపిక్ అలీ, అందే బీరయ్య, టి.రామకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్లాట్ల కొనుగోలుకు భారీ స్పందన

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అల్పాదాయ (ఎల్ ఐ జి ) వర్గాల కోసం హౌసింగ్ బోర్డు ప్రత్యేకంగా కేటాయించిన వివిధ ప్రాంతాల్లోని ప్లాట్ల కొనుగోలుకు ప్రజల నుంచి భారీ స్పందన వచ్చింది. హైదరాబాద్ , వరంగల్, ఖమ్మం ప్రాంతాల్లో ప్రైవేటు భాగస్వామ్యంతో నిర్మించిన ఫ్లాట్లను ఎల్ ఐ జి వర్గాలకు (రూ 6 లక్షల వార్షికాదాయం ఉన్న ప్రజల కోసం) విక్రయించేందుకు, ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తూ హౌసింగ్ బోర్డు నోటిఫికేషన్ జారీ చేయగా, మొత్తం 3.096 దరఖాస్తులు వచ్చాయి. ఒక్క హైదరాబాద్ గచ్చిబౌలి ప్రాంతంలోని వివిధ అపార్ట్ మెంట్లలో ఉన్న 111 ఫ్లాట్ల కోసం 2685 దరఖాస్తులు వచ్చాయి. వరంగల్ రైల్వే స్టేషన్ సమీపంలోని ప్రాజెక్టులోని ఫ్లాట్ల కూడా 388 దరఖాస్తులు , వచ్చాయి. అయితే ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఖమ్మంలోని ఫ్లాట్ల దరఖాస్తుల స్వీకరణ తేదీని ఈనెల 8వ వ తేదీ వరకు పొడిగించారు. లాటరీ ప్రక్రయను పూర్తి పారదర్శకంగా నిర్వహించేందుకు హౌసింగ్ బోర్డు అన్ని ఏర్పాట్లు చేసింది. మంగళవారం హైదరాబాద్, ఈనెల 8వ తేదీన వరంగల్, 10వ తేదీన ఖమ్మం ప్రాంతంలోని ఫ్లాట్ల కేటాయింపునకు సంబంధించిన లాటరీ ప్రక్రియ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని హౌసింగ్ బోర్డు ప్రజా సంబంధాల అధికారి (పిఆర్‌ఒ) వి.వాసు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాగా హైదరాబాద్ గచ్చిబౌలి ప్రాంతంలోని మంగళవారం ఉదయం, మధ్యాహ్నం రెండు విడతల్లో లాటరీ నిర్వహించున్నారు. ఉదయం సమయంలో రాంకీ ప్రాజెక్ట్‌లోని 76 ఫ్లాట్లకు, మధ్యాహ్నం వసంత ప్రాజెక్టులోని 35 ఫ్లాట్లకు లాటరీ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఫ్లాట్ల కొనుగోలుకు భారీగా దరఖాస్తులు వచ్చిన నేపథ్యంలో, దరఖాస్తు దారులు, లాటరీ ప్రక్రియ చూసేందుకు రావద్దని, ఈ ప్రక్రియ మొత్తం ఆన్ లైన్ లోనూ, యూట్యూబ్ తదితర మాధ్యమాల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నామని పిఆర్ఒ తెలిపారు. అనూహ్యంగా, ఒక్కో ఫ్లాట్‌కు సగటున 25 మంది వరకు దరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో, ఉన్నతాధికారుల ఆదేశాలను అనుసరించి లాటరీ నిర్వహించే ప్రాంగణంలోని స్థలాభావం, భద్రతా కారణాల రీత్యా లాటరీ ప్రక్రియకు ప్రజలను అనుమతించబోవడం లేదని పిఆర్వో వాసు తెలిపారు.
అధికారుల సమక్షంలో పూర్తి పారదర్శకంగా నిర్వహించే లాటరీ ప్రక్రియను ప్రత్యక్ష ప్రసారం చేయడంతోపాటు, ఈ ప్రక్రియ మొత్తాన్ని వీడియో రికార్డు కూడా చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. అంతే కాకుండా నిర్మిత కేంద్ర ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్క్రీన్ల ద్వారా లాటరీ నిర్వహణను చూడవచ్చని వివరించారు. https://www.youtube.com/live/gCBIRWz8qto యూట్యూబ్ లింక్ ద్వారా లాటరీ ప్రత్యక్ష ప్రసారం చూడవచ్చని సూచించారు.

## 'రైల్ వన్ యాప్'లో అన్‌రిజర్వ్‌డ్ టిక్కెట్లపై 3శాతం డిస్కౌంట్

### జనవరి 14 నుంచి జూలై 14 వరకు అమలు – రైల్వే శాఖ నిర్ణయం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రైల్వే–ప్రయాణీకుల మధ్య అనుసంధానాన్ని మరింత మెరుగుపరచడమే లక్ష్యంగా 'రైల్ వన్ యాప్'ను అభివృద్ధి చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే ముఖ్య ప్రజా సంబంధాల అధికారి ఎ. శ్రీధర్ తెలిపారు. భారతీయ రైల్వే ప్రయాణీకులకు మరింత సౌకర్యం కల్పించేందుకు కీలక నిర్ణయం తీసుకుందన్నారు. తాజాగా ప్రారంభించిన 'రైల్ వన్ మొబైల్ యాప్' ద్వారా అన్‌రిజర్వ్ రైల్వే టిక్కెట్లు కొనుగోలు చేసే ప్రయాణీకులకు 3 శాతం డిస్కౌంట్ అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సదుపాయం 2026 జనవరి 14 నుంచి జూలై 14 వరకు అమలులో ఉంటుందని తెలిపారు. డిజిటల్ ఇండియా కార్యక్రమానికి అనుగుణంగా నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించేందుకు, ఆర్‌వాలెట్‌ను మినహాయించి అన్ని డిజిటల్ చెల్లింపు మార్గాల ద్వారా రైల్ వన్ యాప్‌లో అన్‌రిజర్వ్‌డ్ టికెట్లు కొనుగోలు చేసినప్పుడు ఈ 3శాతం తగ్గింపు వర్తిస్తుందని ఆయన స్పష్టం చేశారు. కాగా, ఆర్ వాలెట్ ద్వారా టిక్కెట్లు కొనుగోలు చేసిన వారికి ఇప్పటికే అమల్లో ఉన్న 3 శాతం క్యాష్‌బ్యాక్ విధానం యథావిధిగా కొనసాగుతుందని పేర్కొన్నారు. ఇటీవల భారతీయ రైల్వే ప్రారంభించిన రైల్ వన్ యాప్ వినియోగదారులకు సులభంగా ఉండే విధంగా రూపొందించబడింది. ఈ యాప్ ద్వారా అన్‌రిజర్వ్ టిక్కెట్లు, ప్లాట్‌ఫామ్ టిక్కెట్లు, రిజర్వ్ టిక్కెట్లు, లైవ్ ట్రైన్ ట్రాకింగ్, ఫిర్యాదుల పరిష్కారం, ఈక్యాటరింగ్ వంటి అనేక సేవలు ఒకే చోట అందుబాటులో ఉన్నాయి. ఇప్పటికే ఉన్న యూటీఎస్ యాప్ ఖాతాలకు కూడా ఇది మద్దతు ఇస్తుంది. ఈ యాప్ ప్రత్యేకత ఏమిటంటే, ప్రయాణీకులు తమ ఇంటి నుంచే జర్నీ లేదా ప్లాట్‌ఫామ్ టిక్కెట్లను బుక్ చేసుకుని, స్టేషన్‌లలో పొడవైన క్యూలలో నిలబడకుండా నేరుగా రైలు ఎక్కే అవకాశం కల్పిస్తోంది. రైల్ వన్ యాప్ ఆండ్రాయిడ్ ప్లే స్టోర్, ఐఓఎస్ యాప్ స్టోర్‌లలో డౌన్‌లోడ్ చేసుకోవడానికి అందుబాటులో ఉంది. చెల్లింపుల కోసం యూపీఐ, పేటీఎం, ఫోన్‌పే, గూగుల్ పే, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వంటి అన్ని డిజిటల్ మార్గాలను వినియోగించుకోవచ్చు.

## సాహితీ ఇన్‌ఫ్రా కేసులో 17 చార్జిషీట్‌లు దాఖలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్‌కు చెందిన సాహితీ ఇన్‌ఫ్రా రియల్ ఎస్టేట్ సంస్థపై నమోదైన భారీ మోసం కేసుల్లో దర్యాప్తు అధికారులు కీలక ముందడుగు వేశారు. పెట్టుబడిదారుల నుంచి కోట్ల రూపాయలు వసూలు చేసి మోసం చేశారన్న ఆరోపణలతో నమోదైన కేసుల్లో భాగంగా ఛార్జ్‌షీట్‌లు దాఖలు చేశారు. సాహితీ ఇన్‌ఫ్రా స్కాంపై ఇప్పటివరకు మొత్తం 64 క్రిమినల్ కేసులు నమోదు అయ్యాయి. వీటిలో దర్యాప్తు పూర్తయిన 17 కేసులకు సంబంధించి ఛార్జ్‌షీట్‌లు కోర్టులో దాఖలు చేశారు. ఈ ఛార్జ్‌షీట్‌లలో సంస్థ యాజమాన్యం, డైరెక్టర్లు, కీలక నిర్వాహకులు నిందితులుగా ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.మిగతా 47 కేసులపై దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు స్పష్టం చేశారు.
**ఛార్జ్‌షీట్‌లో ఉన్న ప్రధాన అంశాలు :**
నకిలీ ప్రాజెక్టులు, అనుమతులు లేని లేఅవుట్ల పేరుతో పెట్టుబడుల ఆహ్వానం, అధిక లాభాలు, త్వరిత రిటరన్స్ హామీలతో ప్రజలను మభ్యపెట్టడం, ఒకే భూమిని పలువురికి అమ్మినట్లు ఆరోపణలు, ముందస్తు అనుమతులు లేకుండా రిజిస్ట్రేషన్లు చేయడం, వసూలు చేసిన డబ్బును వ్యక్తిగత అవసరాలకు మళ్లించినట్లు ఆధారాలు ఉన్నాయి.
**నష్టపోయిన బాధితులు :**
ఈ కేసుల్లో వందలాది మంది పెట్టుబడిదారులు మోసపోయినట్లు విచారణలో తేలింది.
ఒక్కో బాధితుడి నుంచి లక్షల నుంచి కోట్ల రూపాయల వరకు వసూలు చేసినట్లు ఛార్జ్‌షీట్‌లో పేర్కొన్నారు.
దర్యాప్తులో లభించిన ఆధారాలు బ్యాంక్ లావాదేవీల రికార్డులు,
భూమి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, ఒప్పంద పత్రాలు, అగ్రిమెంట్లు,బాధితుల వాంగ్మూలాలు
ఫోరెన్సిక్ ఆడిట్ నివేదికలు సేకరించారు.
**చట్టపరమైన చర్యలు :**
నిందితులపై ఐపీసీ సెక్షన్లు 406 (నమ్మకద్రోహం), 420 (మోసం), 468, 471 (ఫోర్జరీ) తదితర సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.



## తెలంగాణలో జనపనార సాగుకు అడుగులు

### ఎంపి చామల చొరవ రంగంలోకి దిగిన జూట్ కార్పొరేషన్ అధికారులు

**ప్రజాపక్షం/యాదాద్రి :** భువనగిరి పార్లమెంట్ సభ్యులు, టెక్స్టైల్స్ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి పార్లమెంట్‌లో గళమెత్తడంతో తెలంగాణలో జూట్ (జనపనార) సాగుపై కీలక అడుగులు పడ్డాయి. ఇటీవలే లోక్‌సభలో రాష్ట్రంలో జూట్ సాగు అవకాశాలపై ఆయన ప్రశ్నించిన నేపథ్యంలో జూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఉన్నతాధికారులు హైదరాబాద్‌కు విచ్చేసి ఎంపీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో జూట్ ఉత్పత్తిని ఎందుకు చేపట్టడం లేదనే అంశంపై సుదీర్ఘ చర్చలు జరిగాయి. పర్యావరణానికి ఎంతో మేలు చేసే జూట్ సాగు వల్ల భూసారం పెరగడమే కాకుండా, రైతులకు ఎకరానికి దాదాపు లక్ష రూపాయల వరకు నికర ఆదాయం వచ్చే అవకాశం ఉందని అధికారులు ఈ సందర్భంగా వెల్లడించారు. ఇతర పంటలతో పోలిస్తే తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాన్ని తెచ్చిపెట్టే ఈ 'బంగారు పీచు'ను తెలంగాణ రైతులు అందిపుచ్చుకునేలా రాష్ట్ర ప్రభుత్వం తగిన అవగాహన కల్పించాలని ఎంపీ చామల కోరారు. త్వరలోనే జూట్ కార్పొరేషన్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేయనున్నట్లు తెలుస్తోంది. పర్యావరణ హితమైన జూట్ సాగుతో తెలంగాణ రైతాంగం ఆర్థికంగా బలోపేతం కావాలన్నదే తన లక్ష్యమని ఎంపీ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## అంధుల అక్షర శిల్పి లూయిస్ బ్రెయిలీ



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** అంధుల అక్షర శిల్పి లూయిస్ బ్రెయిలీని ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ కె సీతారామారావు అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో లూయిస్ బ్రెయిలీ జన్మదిన దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా మహిళా శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జ్యోతి ప్రజ్వలన చేసి అదనపు కలెక్టర్ మాట్లాడుతూ బ్రెయిలి లిపిని కనిపెట్టిన లూయిస్ బ్రెయిలి జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం జనవరి 4న ప్రపంచ బ్రెయిలి దినోత్సవం జరుపుకుంటారన్నారు. లిపి ఆవిష్కరణ కారణంగా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అంధులు మెరుగైన జీవితాన్ని గడుపుతున్నారని కొనియాడారు. అనంతరం అంధులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఈఓ అశోక్, డిఐఈఓ భాను నాయక్, డిటిడిఓ శంకర్, ఈడి ఎస్‌సి కార్పొరేషన్ శ్రీనివాస్ నాయక్ పాల్గొన్నారు.

## ఓటరు జాబితాపై అభ్యంతరాలుంటే స్వీకరిస్తాం

### మున్సిపల్ కమిషనర్ గణవేణి శ్రీనివాస్



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఓటరు జాబితాపై అభ్యంతరాలు ఉంటే స్వీకరించి ఎన్నికల కమిషన్ సూచనల మేరకు సవరించడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ గణవేణి శ్రీనివాస్ అన్నారు. మున్సిపల్ ఎన్నికల ముసాయిదా ఓటర్ల జాబితాపై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సోమవారం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయా పార్టీల నాయకులు ముసాయిదా జాబితాలో ఉన్న పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ఆదివారం సాయంత్రానికి 106 అభ్యంతరాలు వచ్చాయన్నారు. వాటిని రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచనల మేరకు సవరిస్తామని అన్నారు. ఇప్పటికే 20 సమస్యలు పరిష్కరించడం జరిగిందని చెప్పారు. జీవో 367 ప్రకారం వార్డుల సరిహద్దులను పరిగణలోకి తీసుకుంటామని, ఓటర్లను ఆయా వార్డుల్లో సర్దుబాటు చేస్తామని తెలిపారు. అక్టోబర్ 2025 నాటికి ఎన్నికల సంఘం నిర్దేశించిన తేదీ ప్రకారం కొత్త ఓటర్లను చేర్చుకునే అవకాశం లేదన్నారు. 48వార్డుల్లో 144 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 800 మంది ఓటర్లకు ఒక బూత్ ఉండేలా చూస్తామన్నారు. ముఖ్యంగా 39 వార్డులోని ఓట్లు 24 వార్డులో వచ్చాయని దరఖాస్తులు వచ్చాయన్నారు. వాటిని పరిశీలించి మార్పులు చేపడ్తామన్నారు. సమావేశంలో మేనేజర్ జ్ఞానేశ్వరి, టీపీబీవో అంజయ్య, రిసోర్స్ పర్సన్స్ బాలునాయక్, గుడిపాటి కోటయ్య, బక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ వేంకటేశ్వర స్వామి నిత్య కల్యాణోత్సవం

**ప్రజాపక్షం/యాదాద్రి :** కలియుగ ప్రత్యక్ష దైవమైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి నిత్య కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. సుప్రభాత సేవ అనంతరం శ్రీ మహాలక్ష్మి అమ్మవారు, ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువుతీరినట్టి గోపృష్ట దర్శనాన్ని చేయించారు. ఉదయం 7 గంటలకు శ్రీ వేంకటేశ్వర స్వామిని మని మయ శోభిత స్వర్ణాభరణాలతో పరిమళభరిత పుష్పమాలలతో శోభాయమానంగా అలంకరించి వేయి నామాల శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి సహస్ర నామార్చన సేవను ఘనంగా నిర్వహించారు. స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో లోక కళ్యాణం కోసం అర్చక స్వాములు శ్రీ సుదర్శన నారసింహ హవనంను నిర్వహించారు. ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన స్వర్ణగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ధనుర్మాసోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోవారం ఉదయమే శ్రీ ఆండాళ్ అమ్మవారికి నవ కలశ పూర్వకంగా పంచామృతాభిషేకం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతిరోజు స్వర్ణగిరి దివ్య క్షేత్రంలో అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడి అన్న ప్రసాద వితరణలో భాగంగా సుమారు 5000 మందికి పైగా భక్తు లు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు మానేపల్లి రామారావు, మురళీకృష్ణ, గోపీకృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించారు.



# బిసి హాస్టల్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

### యాసిడ్ తాగిన విద్యార్థిని పరిస్థితి విషమం



**ప్రజాపక్షం/నల్లగొండ :** జిల్లా కేంద్రంలోని బిసి డి హాస్టల్‌లో ఉంటూ డిగ్రీ చదువుతున్న ఎర్రబోయిన హేమశ్రీ(19) అనే విద్యార్థిని అనారోగ్య కారణాలతో బాత్రూంలు కడిగే యాసిడ్‌ను తాగి ఆత్మహత్యా యత్నం చేసుకున్న సంఘటన సోమవారం చోటుచేసుకుంది. పరిస్థితి విద్యార్థిని విషమంగా ఉండడంతో పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సను అందిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన తోటి విద్యార్థినిలు తెలిపిన వివరాలు ఇల ప్రకారం అనుముల మండలం హాజారిగూడెం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు,లక్ష్మమ్మ దంపతుల పెద్ద కుమార్తె హిమశ్రీ నల్లగొండ పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో ఉన్న బిసి హాస్టల్‌లో ఉంటూ ఎన్‌జి కళాశాలలో బిఎస్‌సి ద్వితీయ సంవత్సరం చదువుతోంది. సోమవారం తెల్లవారుజామున బాలిక హాస్టల్ ఆవరణలో ఉన్న బాత్రూంలు కడిగే యాసిడ్‌ను సేవించి రూమ్‌లోకి వచ్చి వాంతులు చేసుకుంది. విషయాన్ని గమనించిన తోటి విద్యార్థులు విషయాన్ని వెంటనే వార్డెన్ జ్యోతి దృష్టికి తీసుకెళ్లి చికిత్స కోసం నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.అక్కడ ప్రాథమిక చికిత్స అందించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని మెరుగైన చికిత్స కోసం ఓప్రైవేటు ఆస్పత్రికి తరలించాలని సూచించడంతో వార్డెన్ జ్యోతి బాలికను పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించింది. విషయం తెలిసిన వెంటనే డిబిసీడబ్ల్యు ఓ సంజీవయ్యతోపాటు పలువురు అధికారులు ఆసుపత్రి వద్దకు చేరుకొని పరిస్థితిని సమీక్షించారు.ప్రస్తుతం బాలిక పరిస్థితి విషమంగా ఉందని నాలుగు రోజుల తర్వాత కానీ ఏమి చెప్పలేమని వైద్యులు స్పష్టం చేశారు. దీంతో సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువు విద్యార్థి సంఘాల నాయకులు, బీసీ సంఘాల నాయకులు ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు.

**హేమశ్రీని పరామర్శించిన జిల్లా కలెక్టర్**

అనారోగ్య కారణాలతో యాసిడ్ తాగి జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హేమశ్రీ ని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సోమవారం ఆస్పత్రికి వెళ్లి హేమశ్రీని పరామర్శించారు.అమ్మాయి ఆరోగ్య పరిస్థితిని డాక్టర్ల ద్వారా అడిగి తెలుసుకోవడమే కాకుండా,విద్యార్థినితో మాట్లాడి ధైర్యంగా ఉండాలని చెప్పారు. విద్యార్థిని తండ్రి వై. వెంకటేశ్వర్లుతో కలెక్టర్ మాట్లాడుతూ సంఘటన జరగడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. హేమశ్రీ తండ్రి తన కూతురుకు మెరుగైన వైద్యం అందించేందుకు హైదరాబాద్ పంపించాలని కోరగా,జిల్లా కలెక్టర్ తక్షణమే నిమ్స్ వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ పంపించేందుకు ఏర్పాటు చేశారు జిల్లా కలెక్టర్ వెంట డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి,జిజిహెచ్ సూపరింటిండెంట్ నేత నరసింహారావు ఉన్నారు.

# గ్రామాల నుండి జన సమీకరణ చేయండి





### ఖమ్మంలో జరిగే శతజయంతి బహిరంగ సభ జయప్రదం చేయాలి : సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పిలుపు


**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** జనవరి 18న ఖమ్మంలో జరిగే సిపిఐ పార్టీ శతజయంతి బహిరంగ సభను జయప్రదం చేయాలని సూర్యాపేట జిల్లా సిపిఐ కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ ధర్మభిక్షం భవన్‌లో జరిగిన సూర్యాపేట పట్టణ కౌన్సిల్, చివ్వెంల మండల కౌన్సిల్ సమావేశం చివ్వెంల మండల కార్యదర్శి ఖమ్మంపాటి రాము అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన పాల్గొని మాట్లాడారు. సూర్యాపేట పట్టణం నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. గ్రామాల నుండి జన సమీకరణ చేయాలన్నారు. శతజయంతి బహిరంగ సభను జయప్రదం చేయడానికి పట్టణంలో ప్రధాన కూడళ్ల వద్ద కమ్యూనిస్టు అమరవీరుల చిత్రపటాలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. కళాజాతాలతో ప్రచారం చేయాలని, ఆటోలతో మైకుల ద్వారా పట్టణంలో, గ్రామాలలో ప్రచారం నిర్వహించాలని సూచించారు. శతజయంతి బహిరంగ మహాసభకు సహకరించవల్సినదిగా సూర్యాపేట పట్టణంలోని విద్యాసంస్థలు, కార్యాలయాల్లో పెద్దఎత్తున ప్రచారం చేయాలని తీర్మానం చేశారు. పార్టీ సభ్యత్వ సేకరణ కార్యక్రమం వేగవంతం చేయాలని, వామపక్ష భావజాలం గల యువతను పార్టీలో చేర్పించాలని అన్నారు. పార్టీ అనుబంధ సంఘాలను బలోపేతం చేయాలని కోరారు. జిల్లాలో ఇటీవల జరిగిన గ్రామ పంచాయితీ ఎన్నికల్లో సిపిఐ పార్టీ బలపర్చిన అభ్యర్థులు ఆరు గ్రామ పంచాయితీలలో సర్పంచులుగా విజయం సాధించారని, ఇదే స్ఫూర్తితో రాబోయే మున్సిపాలిటి ఎన్నికల్లో పోటికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, పట్టణ కార్యవర్గ సభ్యులు బొమ్మగాని శ్రీనివాస్, దంతాల రాంబాబు, చామల అశోక్ కుమార్, గుగులోతు రాజారాం, రేగట్టి లింగయ్య, పెంద్ర కృష్ణ, ఏదెల్లి శ్రీకాంత్, దీకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

**మల్లేపల్లి మండల కేంద్రం నుండి భారీగా తరలాలి**

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి :** జనవరి 18న ఖమ్మంలో జరిగే సిపిఐ పార్టీ శత జయంతి ఉత్సవాల బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన సిపిఐ మండల కమిటి సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో సిపిఐ కీలక పాత్ర పోషించిందన్నారు. మల్లేపల్లి మండల కేంద్రం నుండి సిపిఐ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి బహిరంగ సభను విజయవంతం చేయాలని మండల కార్యదర్శి గుమ్మకొండ వెంకటేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి గుమ్మకొండ వెంకటేశ్వర్‌రెడ్డి, సహాయ కార్యదర్శి పెరికేటి శేఖరాచారి, కౌన్సిల్ సభ్యులు శ్రీను, సోమ్లానాయక్, చరణ్‌రెడ్డి, వీరస్వామి పాల్గొన్నారు.

**సిపిఐ వంద సంవత్సరాల ముగింపు వేడుకలను విజయవంతం చేయండి**

**ప్రజాపక్షం/కోదాడ రూరల్ :** భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాలు ముగింపు వేడుకల సందర్భంగా జనవరి 18న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోదాడ మండల కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి బత్తినేని హనుమంతరావు, సహాయ కార్యదర్శి పోతురాజు రాజేశ్వరరావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం కోదాడ మున్సిపల్ పరిధిలోని తమ్మర గ్రామంలోని బత్తినేని శ్రీనివాసరావు నివాస గృహంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ కార్యదర్శి మాతంగి ప్రసాద్, అల్వాల్‌పురం గ్రామ కార్యదర్శి గోసు నగేష్, గొట్టేముక్కల కోటి నారాయణ, బత్తినేని శ్రీనివాసరావు, రాయపూడి కాంటరాజు, కమతం కుటుంబరావు, కొండా కోటేశ్వరరావు పాల్గొన్నారు.



## తురక కాశ కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో గళమెత్తిన ఎమ్మెల్సీ సత్యం



### కృతజ్ఞతగా సత్యం చిత్రపటానికి పాలాభిషేకం చేసిన తురక కాశ కార్మికులు

**ప్రజాపక్షం/నల్లగొండ(తిప్పర్తి) :** ప్రస్తుతం జరుగుతున్న తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశలలో తురక కాశ కార్మికుల సమస్యలు,వారి దయనీయ స్థితిగతులపై ప్రస్తావించి ప్రభుత్వ దృష్టిని ఆకర్షించిన ఎంఎల్‌సి నెల్లికంటి సత్యంకు కృతజ్ఞతగా తెలంగాణ తుర్కకాశ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తిప్పర్తి మండలం కాశివారి గూడెం గ్రామంలో ఎంఎల్‌సి సత్యం చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు షేక్ అబ్దుల్ రహీం మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలు అవుతున్న తురక కాశ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఏనాడు కూడా పాలకులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గుట్టలలో రాళ్లు కొట్టి జీవనోపాధి పొందుతున్నం. సమాజ అభివృద్ధిలో, విద్య, వైద్యం,ఉపాధి రంగాలలో ఇంకా వెనుకబడి ఆధునిక యుగంలో కూడా ఈ వర్గం ప్రజలు విద్య,ఆరోగ్యంపై సరైన అవగాహన లేక బాధ్యతలతో కూడిన జీవితాలు గడుపుతున్న తమ సమస్యలను అర్థం చేసుకోని ఒక కమ్యూనిస్టు నాయకుడు తెలంగాణ శాసనమండలి నిండు సభలో ప్రభుత్వ దృష్టికి తీసుకురావడం సంతోషకరం అన్నారు.ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు,షేక్ లతీఫ్ పాష,షేక్ అలీ,గ్రామ సర్పంచ్ షేక్ కమల్,ఉప సర్పంచ్ షేక్ అలీ,వార్డు సభ్యులు షేక్ అల్లావలి,షేక్ నూర్ మొహమ్మద్ షేక్ కలీం,గ్రామ శాఖ అధ్యక్షులు షేక్ మౌలానా, గౌరవ అధ్యక్షులు షేక్ సయ్యద్,మండల అధ్యక్షులు షేక్ మహిముద్,గ్రామ పెద్దలు షేక్ చాంద్ పాషా,షేక్ సుభాని,షేక్ అజిత్,షేక్ ఖాసీం,షేక్ అబ్దుల్ షేక్ షబ్బీర్,షేక్ కమల్ కార్యకర్తలు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## త్వరగా ఇందిరమ్మ ఇండ్ల పనులు

### యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**ప్రజాపక్షం/యాదాద్రి :** వివిధ దశలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల పనులు త్వరగా పూర్తి చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. సోమవారం రాజాపేట మండలం బసంతపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు వచ్చినవారు మొత్తం ఎంతమంది ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. అందులో ఎన్ని ఇండ్లు పూర్తి అయ్యాయి ? ఎన్ని ఇండ్లు చివరి దశలో ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ఇండ్ల పనులు మొత్తం కూడా వేగంగా పూర్తి అయ్యేలా చూడాలన్నారు. గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకుంటున్న వారికి ఇటుక, ఇసుక తక్కువ ధరకు ఇప్పించేలా సంబంధిత అధికారులు చొరవ చూపాలన్నారు. లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేసుకుని గృహప్రవేశాలు చేపట్టాలన్నారు. నిర్మాణ పనులు పూర్తయినంతవరకు డబ్బులు జమ అయ్యాయా అని అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ కార్యదర్శులు తరచు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు పరిశీలించి, లబ్ధిదారులు త్వరగా ఇంటి నిర్మాణ పనులు పూర్తయ్యేల చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## జిల్లా జడ్జిని కలిసిన ఎస్‌పి నరసింహ



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** నూతన సంవత్సరం పురస్కరించుకొని సోమవారం కోర్టు భవనంలో జిల్లా జడ్జి లక్ష్మి శారదను జిల్లా ఎస్‌పి కె నరసింహ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కేసుల దర్యాప్తు, కోర్టు క్యాలెండర్, నేరస్తులకు శిక్షణ అమలు, లోక్ అదాలత్ నిర్వహణ గురించి చర్చించారు.

## పాఠశాలలను తప్పనిసరిగా సందర్శించాలి

### నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ ఆదేశం



**ప్రజాపక్షం/నల్లగింద టౌన్:** మండల విద్యాశాఖ అధికారులు నెలలో వారి పరిధిలోని పాఠశాలలను తప్పనిసరిగా సందర్శించాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ ఆదేశించారు.ముందస్తు అనుమతి లేకుండా ఉపాధ్యాయులు,ఎంఈఓలు సెలవుపై వెళ్లకూడదని, జిల్లాలో టాయిలెట్ లేని పాఠశాల ఉండరాదని , విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించడంలో భాగంగా హెడ్మాస్టర్లతో తరచూ సమీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. సోమవారం అయన కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో విద్యాశాఖ ద్వారా అమలు చేస్తున్న పీఎం శ్రీ పాఠశాలలు,టాయిలెట్స్,తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు వివిధ పథకాల కింద పాఠశాల విద్యార్థులకు మంజూరు చేసిన నిధులన్ని సద్వినియోగమయ్యాలా చూడాలని, పాఠశాల విద్యార్థుల యూనిఫామ్,బాలికల ఆరోగ్యం, శానిటేషన్,సైన్స్, మ్యాథ్స్,సర్కిల్స్ నిర్వహణ,ఎక్స్పోజర్ విజిట్లు, స్పోర్ట్స్ మెటీరియల్,స్కౌట్స్ అండ్ గైడ్స్,స్వెల్ఫ్ డిఫెన్సె,మాక్ పార్లమెంట్ నిర్వహణ,సేఫ్టీ క్లబ్బుల ఏర్పాటు,టీచర్ పేరెంట్స్ మీటింగ్‌లు విషయాలపై సమగ్రంగా సమీక్షించారు. 17,18 పూర్తి చేయాలన్నారు.

**ఫిర్యాదులన్నీ వారంలోగా పరిష్కరించాలి :జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్**

**ప్రజాపక్షం/నల్లగొండ :** పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి ఫిర్యాదులన్నీ వారంలోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ జిల్లా అధికారులను ఆదేశించారు.ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా సోమవారం ఆయన కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు.ఫిర్యాదులను స్వీకరించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పరిష్కరించిన ఫిర్యాదులకు ఆన్‌లైన్‌లో ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని ,ఒకవేళ ఏదైనా ఫిర్యాదు పరిష్కారం కానట్లయితే పరిశీలించి క్షేత్రస్థాయి నుండి రిపోర్టు తెప్పించి వెంటనే పరిష్కరించాలని చెప్పారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్, ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి, దేవరకొండ ఆర్ డి ఓ రమణారెడ్డి, చండూరు ఆర్డిఓ శ్రీదేవి, జిల్లా అధికారులు, ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించారు.

## పనుల్లో అక్రమాలు, మస్టర్‌లో కూలీల

# సంతకాలు లేకుండానే బిల్లులు

### తూతూ మంత్రంగా సోషల్ ఆడిట్ చర్యలు శూన్యం



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రం రైతు వేదికలో జాతీయ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ కార్యక్రమానికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ అడిషనల్ పీడీజి సురేష్ హాజరయ్యారు. గ్రామస్థాయిలో ప్రజలే ప్రత్యక్షంగా పనుల వివరాలను పరిశీలించి ఇటీవల మండలంలోని గ్రామ పంచాయతీలలో జరిగిన పనులపై సామాజిక తనికి నిర్వహించారు. చేపట్టిన అభివృద్ధి పనులు ఖర్చయిన నిధులు పని దినాల నమోదు కూలీల హాజరు వేతనాల చెల్లింపు వంటి అంశాలను గ్రామసభల ముందు ఉంచి సమగ్రంగా పరిశీలించారు. ప్రజలు స్వయంగా పనుల స్థలాలను సందర్శించి నాణ్యతను పరిశీలించడంతోపాటు రికార్డులతో పోల్చి చూశారు. కానీ మండలంలోని 31 గ్రామపంచాయతీలలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులపై స్థానిక ఎంపీడీవో, ఏపీవో రోల్ కాల్ చేసిన పాపాన పోలేదు. పనులు జరుగుతున్నట్టు కాగితాలపై చూపిస్తూ వాస్తవానికి పనికిరాని కూలీల పేర్లను మాస్టర్లో అక్రమంగా నమోదు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పనిచేయకున్న హాజరు నమోదు చేసి డబ్బులు ఫీల్డ్ అసిస్టెంట్స్ సగం, పనిచేయని పేరు నమోదైన లబ్ధిదారులు సగం పంచుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కొన్ని చోట్ల ఒకే వ్యక్తి పేరు పలు రోజులు హాజరుగా చూపడం మరికొన్నిచోట్ల గ్రామానికి సంబంధం లేని వ్యక్తుల పేర్లను చేర్చడం వంటి అవకతవకులు చోటుచేసుకున్నాయని బయటపడ్డాయి. సామాజిక తనిఖీ సందర్భంగా మాస్టర్ రోల్స్‌ను పరిశీలించిన ఆడిట్ బృందం సంతకాలు లేకుండా హాజర్ వేసిన విషయాన్ని గుర్తించింది. కొంతమందికి తా ము పని చేయని రోజులకు కూడా హాజరు చూపి పనిచేసినట్లుగా నమోదు చేశారని అయినప్పటికీ వేతనం కూడా అందలేదని తెలిపారు. కొన్ని గ్రా మాలలో ఆదివారాల్లో సైతం పనిచేసినట్లుగా నమోదు చేసిన విషయం ఆశ్చర్యానికి గురిచేసిం ది. అవకతవకలకు పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్లను, టెక్నికల్ అసిస్టెంట్లను, ఏపీవో ఎన్‌ఆర్‌ఈజీఎస్, సిబ్బందిపై తక్షణమే అక్రమాలకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఐ నాయకులు మాజీ ఎంపీటీసీ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గాలయ్య, సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్‌లు మాట్లాడుతూ అక్రమాలకు పాల్పడిన ఉపాధి హామీ సిబ్బందిపై ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## వెనుజులాపై అమెరికా దాడి ప్రజాస్వామ్యానికి వ్యతిరేకం

### ధూళిపాళ ధనుంజయనాయుడు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** వెనుజులా దేశంపై అమెరికా సామ్రాజ్యవాదం చేపడుతున్న రాజకీయ, ఆర్థిక, సైనిక దాడులు అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమైనవని, ప్రజాస్వామ్య వ్యతిరేకమైనవని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయనాయుడు తీవ్రంగా ఖండించారు. సోమవారం ఆయన మిర్యాలగూడలో మాట్లాడుతూ ఒక స్వతంత్ర సార్వభౌమ దేశం తన వనరులు, తన రాజకీయ విధానాలను స్వయంగా నిర్ణయించుకునే హక్కును కాలరాస్తూ అమెరికా సాగిస్తున్న ఈ దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. చమురు, ఖనిజ వనరులపై కన్నేసి, ప్రజాస్వామ్యం, మానవ హక్కులు అనే ముసుగులో అమెరికా వెనుజులాపై ఆర్థిక ఆంక్షలు, రాజకీయ జోక్యాలు, కుట్రలు చేస్తుందని, దీంతో వెనుజులా ప్రజలు ఆహారం, మందులు, విద్య, ఉపాది వంటి మౌలిక అవసరాలకు కూడా దూరమవుతున్నారని, ఇది నేరుగా ప్రజలపై సాగుతున్న ఆర్థిక యుద్ధమేనని, ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రభుత్వాన్ని కూల్చివేయాలనే లక్ష్యంతో బాహ్య శక్తులు చేసే ఈ జోక్యాలు ప్రపంచ శాంతికి తీవ్రమైన ముప్పుగా మారుతునానయని, వెనుజులా సమస్యను వెనుజులా ప్రజలే పరిష్కరించుకోవాలని, అక్కడి అంతర్గత వ్యవహారాల్లో అమెరికాకు ఎలాంటి హక్కు లేదని ప్రపంచ వ్యాప్తంగా సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తులు, ప్రజాస్వామ్యవాదులు, శాంతి ప్రేమికులు ఈ దాడులను ఖండించాలని ఆయన అన్నారు.

# వైభవ్ విధ్వంసం..



భారత సంచలనం వైభవ్ సూర్య వంశీ కెప్టెన్‌గా మరింత రెచ్చిపోయి ఆడుతున్నాడు. దక్షిణాఫ్రికా అండర్19 బౌలర్లను వణికిస్తూ విధ్వంసక అర్ధ శతకం(68) బాదాడీ కుర్రాడు. రెండో యూత్ వన్డేలో ఆకాశమే హద్దుగా చెలరేగిన వైభవ్.. 10 సిక్సర్లతో సఫారీ బౌలర్లను బెంబేలెత్తించాడు. అతడితో పాటు అభిగ్యాన్ కుందు (48నాటౌట్) మెరుపులతో భారీ స్కోర్ చేసిన టీమిండియా డక్‌వర్త్ లూయిస్ ప్రకారం 8 వికెట్ల తేడాతో గెలుపొందింది. కొత్త ఏడాదిలోనూ వైభవ్ సూర్యవంశీ సుడిగాలి ఇన్నింగ్స్‌లు ఆడుతున్నాడు. దక్షిణాఫ్రికాతో యూత్ వన్డే సిరీస్‌లో సారథిగా వ్యవహరిస్తున్న వైభవ్.. రెండో మ్యాచ్‌లో శివాలెత్తిపోయాడు. ప్రత్యర్థి నిర్దేశించిన 246 పరుగుల ఛేదనలో ఈ లెఫ్ట్ హ్యాండర్ పూనకాలు వచ్చినట్టు బ్యాట్‌తో విధ్వంసం సృష్టించాడు. కేవలం 24 బంతులనే ఎదుర్కొన్న ఈ యంగ్ బ్యాటర్. 10 సిక్సర్లు, ఒక్క ఫోర్‌తో 68 రన్స్ బాదేశాడు. అతడు ఔటయ్యాక.. వేదాంత్ త్రివేది(31 నాటౌట్), అభిగ్యాన్ కుందు(48 నాటౌట్)లు అజేయంగా జట్టును గెలిపించారు. డక్‌వర్త్ లూయిస్ ప్రకారం టీమిండియా లక్ష్యాన్ని 176గా నిర్దేశించగా.. 8 వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. వైభవ్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. తొలి వన్డేలోనూ డీఎల్ఎస్ పద్ధతిలోనే 19 పరుగుల తేడాతో గెలిచిన భారత్ మూడు యూత్ వన్డేల సిరీస్‌లో 2–0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఇరుజట్ల మధ్య చివరి మ్యాచ్ జనవరి 7న జరుగనుంది.

## ముస్తాఫిజుర్ ఎఫెక్ట్.. బంగ్లాదేశ్‌లో ఐపిఎల్ బ్యాన్..




బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడి నేపథ్యంలో భారత్‌బంగ్లా మధ్య వివాదం మొదలైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఐపిఎల్ టీం నుంచి బంగ్లా ఆటగాడు ముస్తాఫిజుర్ ను తొలగించాలని బిసిసిఐ ఆదేశించింది. దీంతో బంగ్లాభారత్ మధ్య సంబంధాలు మరింత దిగజారుతున్నాయి. ముస్తాఫిజుర్ ను తొలగించినందుకు నిరసనగా.. బంగ్లాదేశ్ లో ఐపీఎల్ పై నిషేధం విధించాలని అక్కడి ప్రభుత్వం నిర్ణయించింది. దీని ప్రకారం దేశంలో ఐపిఎల్ ప్రసారాలతోపాటు, ప్రచారం కూడా చేయకూడదు. ఈ మేరకు బంగ్లా ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు కూడా జారీ చేసింది. ఇటీవల మినీ వేలంలో ముస్తాఫిజుర్ ను కోల్ కతా జట్టు రూ.9.2 కోట్లకు కొనుగోలు చేసింది. దీంతో దేశవ్యాప్తంగా పలువురు కేకేఆర్, బిసిసిఐపై విమర్శలు చేశారు. ఒక పక్క బంగ్లాదేశ్ లో హిందువులపై దాడులు జరుగుతుంటే.. ఆ దేశానికి చెందిన క్రీడాకారుడిని ఐపీఎల్ టీంలోకి తీసుకోవడంపై సోషల్ మీడియా వేదికగా పలువురు విమర్శించారు. దీంతో స్పందించిన బిసిసిఐ అతడిని తొలగించాలని కేకేఆర్‌కు ఆదేశాలు జారీ చేసింది. అతడి స్థానంలో మరొకరిని తీసుకునేందుకు అనుమతిస్తామని చెప్పింది. దీంతో ముస్తాఫిజుర్‌ను కేకేఆర్ విడుదల చేస్తూ నిర్ణయం తీసుకుంది. దీనిపై బంగ్లా క్రికెట్ బోర్డ్ (బిసిబి) ఆగ్రహం వ్యక్తం చేసింది. బిసిసిఐ నిర్ణయం బంగ్లా ప్రజల్ని ఆగ్రహానికి, విస్మయానికి గురి చేసిందని తెలిపింది. ఇలా చేస్తే.. ఇండియాలో జరగబోయే టీ20 వరల్డ్ కప్‌లు తమ జట్టు పాల్గొనబోదని, తమ జట్టు ఆడే మ్యాచుల వేదికలు ఇండియా నుంచి మార్చాలని ఐసిసిని కోరింది. తమ క్రికెటర్ల భద్రత రీత్యా తమ ఆటగాళ్లను ఇండియా పంపించకూడదని నిర్ణయించుకున్నట్లు బిసిబి తెలిపింది. ఈ అంశంపై త్వరలోనే ఐసిసి చర్చించనుంది. ఇప్పటికే నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం.. బంగ్లాదేశ్.. ఇండియాలో నాలుగు మ్యాచులు ఆడాల్సి ఉంది. ఒకవేళ బిసిబి కోరినట్లు ఇండియా నుంచి వేదికలు మారిస్తే.. శ్రీలంకలో ఆడే ఛాన్స్ ఉంది.

## రూట్.. శతక మోత



### ఆస్ట్రేలియాను ఆదుకున్న హెడ్!

యాషెస్ సిరీస్‌లో చివరిదైన సిడ్నీ టెస్టులో ఆస్ట్రేలియా ధీటుగా బదులిస్తోంది. తొలి ఇన్నింగ్స్‌లో జో రూట్(160) భారీ శతకంతో ఇంగ్లండ్ సవాల్ విసిరినా.. పేసర్ నెసెర్(4–60) విజృంభణతో ప్రత్యర్థిని నాలుగొందల లోపే కట్టడి చేసింది. అనంతరం ట్రావిస్ హెడ్ (91 నాటౌట్) విధ్వంసక అర్ధశతకం బాదేయగా.. మార్నస్ లబూషేన్(48) క్రీజులో నిలబడ్డాడు. వీరిద్దరి జోరుతో పటిష్ట స్థితిలో నిలిచిన స్మిత్ సేన తొలి ఇన్నింగ్స్‌లో ఇంకా 218 పరుగులు వెనకబడి ఉంది సిడ్నీ టెస్టు రసవత్తరంగా సాగుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ భారీ స్కోర్ చేయగా.. ఆస్ట్రేలియా కూడా తగ్గేదేలే అన్నట్టుగా ఆడుతోంది. ఓపెనర్ ట్రావిస్ హెడ్(91 నాటౌట్) మెరుపు అర్ధ శతకంతో ఆసీస్ పుంజుకుంది. రెండో రోజు ఆట ముగిసే సరికి 2 వికెట్ల నష్టానికి 166 పరుగులు చేసింది ఆతిథ్య జట్టు. అంతుకుముందు దాంతో.. ఓవర్‌నైట్ స్కోర్ 211–3తో రెండో రోజు ఇన్నింగ్స్ ఆరంభించిన పర్యాటక జట్టు 384కే ఆలౌటయ్యింది. మిడిలార్డర్ క్రీజులో పాతుకుపోవడంతో తొలిసారి ఆలౌట్ గండం తప్పించుకున్న ఇంగ్లండ్‌ను నెసెర్(4–60) దెబ్బకొట్టాడు. జో రూట్(160), వికెట్ కీపర్ జేమీ స్మిత్(46)ల మెరుపులతో నాలుగొందల దిశగా వెళ్తున్న పర్యాటక జట్టు తోకను ఈ ఆసీస్ పేసర్ కత్తిరించాడు.

#### ఇద్దరు నిలబడడంతో..

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్ సిడ్నీ టెస్టులో తొలి రోజు ఆధిపత్యం చెలాయించింది. వెలుతురు లేమి కారణంగా 45 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైనా పర్యాటక జట్టు మిడిలార్డర్ బ్యాటర్లు క్రీజునంటుకుపోయారు. ఓపెనర్లు బెన్ డకెట్(27), జాక్ క్రాలే(16)లు శుభారంభమిచ్చినా స్వల్ప స్కోర్‌కే వెనుదిరిగారు. కాసేపటికే బొలాండ ఓవర్లో జాకబ్ బెథెల్(10) ఔటయ్యాక క్రీజులోకి వచ్చిన జో రూట్, హ్యారీ బ్రూక్ ఏమాత్రం ఒత్తిడికి లోనవ్వలేదు. 57కే మూడు కీలక వికెట్లు పడిన వేళ వీరిద్దరూ ఏకొంచెం తడబడినా, ఒక చెత్త షాట్ ఆడినా ఇంగ్లండ్ ఆలౌటయ్యేది. కానీ, వీరు ఆస్ట్రేలియా బౌలర్ల వ్యూహాలను చిత్తు చేస్తూ రూట్, బ్రూక్ అర్ధ శతకాలతో స్కోర్ 200 దాటించారు.

# యువతరంగం


కొత్త సంవత్సరం యువతకు అవకాశాలతో పాటు సవాళ్లను కూడా తీసుకొచ్చిన కీలక దశగా నిలుస్తోంది. వేగంగా మారుతున్న ప్రపంచంలో యువత కేవలం ఉద్యోగాల కోసం సిద్ధపడే వర్గంగా కాకుండా, సమాజాన్ని దిశానిర్దేశం చేసే శక్తిగా ఎదగాల్సిన అవసరం ఉంది.




సాంకేతిక పురోగతి, ఆర్థిక మార్పులు, సామాజిక అసమానతలు, పర్యావరణ సంక్షోభం వంటి అంశాలు యువతపై కొత్త బాధ్యతలను మోపుతున్నాయి. కృత్రిమ మేధస్సు, ఆటోమేషన్, డిజిటలైజేషన్ వంటి అంశాలు ఉద్యోగ రంగాన్ని వేగంగా మార్చేస్తున్నాయి. సంప్రదాయ ఉద్యోగాలు తగ్గుతూ, నైపుణ్యాధారిత పనులు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితిలో యువత జీవితాంతం నేర్చుకునే దృక్పథాన్ని అలవర్చుకోవాల్సిన అవసరం ఉంది. ఒక డిగ్రీ లేదా ఒక నైపుణ్యంతోనే జీవితాన్ని నిర్మించుకోవడం ఇక సాధ్యం కాదు. కొత్త సాంకేతికతలను అర్థం చేసుకోవడం, మార్పులకు తగినట్లుగా తాము మారడం యువత ముందున్న తొలి బాధ్యత.

### ఉపాధి.. ఆర్థిక స్వావలంబన

యువత 2026లో ఎదుర్కొనే ప్రధాన సవాల్ ఉపాధి. గిగ్ ఎకానమీ, ఫ్రీలాన్సింగ్, స్టార్టప్ సంస్కృతి అవకాశాలను పెంచుతున్నప్పటికీ, ఉద్యోగ భద్రత తగ్గుతోంది. ఈ నేపథ్యంలో యు వత స్వయం ఉపాధి, ఆవిష్కరణలు, వ్యాపార దృక్పథం వైపు అడుగులు వేయాలి. కేవలం ఉద్యోగం కోరుకునే వ్యక్తులుగా కాకుండా, ఉద్యోగాలను సృష్టించే నాయకులుగా మారడం కాలం కోరుతున్న పని. ఆర్థిక అవగాహన, సేవింగ్స్, పెట్టుబడులు వంటి అంశాలపై అవగాహన పెంపొందించుకోవడం కూడా యువత బాధ్యతగా మారింది. యువత శక్తి సమాజాన్ని మార్చగల శక్తి. కానీ ఆ శక్తి సరైన దిశలో ఉపయోగించబడినప్పుడే ఫలితం ఉంటుంది. సామాజిక న్యాయం, సమానత్వం, మానవ హక్కులు వంటి అంశాలపై చైతన్యంతో ఉండటం ఈ ఏడాది యువతకు కీలక పని. కుల, మత, లింగ వివక్షలకు వ్యతిరేకంగా నిలబడటం, అణగారిన వర్గాల గొంతుకగా మారడం యువతపై ఉన్న సామాజిక బాధ్యత. సోషల్ మీడియా వంటి వేదికలను ద్వేషానికి కాకుండా, అవగాహన మరియు ఐక్యత కోసం ఉపయోగించాల్సిన అవసరం ఉంది. అదే విధంగా, ప్రజాస్వామ్యం బలంగా ఉండాలంటే యువత చురుకైన పౌరులుగా మారాలి. ఓటు హక్కును కేవలం హక్కుగా కాకుండా బాధ్యతగా భావించాలి. ప్రభుత్వ విధానాలపై అవగాహన పెంచుకోవడం, ప్రశ్నించడం, చర్చించడం, అవసరమైతే శాంతియుతంగా నిరసన వ్యక్తం చేయడం యువత కర్తవ్యంగా మారింది. 2026లో రాజకీయ నిర్లక్ష్యం కాదు, చైతన్యమే యువత లక్షణంగా ఉండాలి.



### పర్యావరణ పరిరక్షణ.. భవిష్యత్తు కోసం పోరాటం

వాతావరణ మార్పులు, నీటి కొరత, కాలుష్యం వంటి సమస్యలు యువత భవిష్యత్తునే ప్రశ్నిస్తున్నాయి. పర్యావరణ పరిరక్షణ ఇక ఎంపిక కాదు, తప్పనిసరి బాధ్యత. స్థిరమైన జీవన విధానం, పునర్వినియోగం, పర్యావరణ హిత ఆలోచనలు యువత జీవనశైలిలో భాగం కావాలి. చిన్న చర్యలే అయినా, అవి పెద్ద మార్పులకు దారి తీస్తాయన్న అవగాహన యువతలో అవసరం.

### మానసిక ఆరోగ్యం.. మానవ సంబంధాలు

పోటీ, ఒత్తిడి, అనిశ్చిత భవిష్యత్తు యువత మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. విజయమే జీవితం అన్న భావన నుం చి బయటపడి, సమతుల్య జీవనాన్ని అలవర్చుకోవడం యువత ముందున్న ముఖ్యమైన పని. మానసిక ఆరోగ్యాన్ని బలహీనతగా కాకుండా, జీవన భాగంగా అంగీకరించాలి. కుటుంబం, స్నేహాలు, సామాజిక సంబంధాలకు విలువ ఇవ్వడం ద్వారా మాత్రమే సమగ్ర వ్యక్తిత్వం ఏర్పడుతుంది. నేటి యువత కేవలం రేపటి నాయకులు మాత్రమేకాదు, ఈ రోజునే మార్పును నడిపించే శక్తులు కూడా. వ్యక్తిగత లక్ష్యాలను సామాజిక బాధ్యతలతో మేళవించగలిగినప్పుడే యువత నిజమైన శక్తిగా మారుతుంది. నేర్చుకోవడం, ప్రశ్నించడం, సృష్టించడం, సమాజం కోసం నిలబడటం. ఇవీ యువత ముందున్న అసలైన పనులు. ఈ బాధ్యతలను యువత స్వీకరించిన నాడు, భవిష్యత్తు మాత్రమే కాదు, వర్తమానమూ మారుతుంది.

## సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు


సిపిఐ వికారాబాద్ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్




**ప్రజాపక్షం/తాండూరు :** జిల్లాలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కార్యచరణ నిర్మించుకుని ఉద్యమాలు చేద్దామని సిపిఐ వికారాబాద్ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్ తెలపారు. సిపిఐ ఆవిర్భావించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 18న ఖమ్మంలో నిర్వహించ తలపెట్టిన భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు ఆమె పిలుపునిచ్చారు. సోమవారం తాండూరు పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌లో సిపిఐ బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో విజయలక్ష్మి పండిత్ మాట్లాడుతూ సిపిఐ ఆవిర్భావించి వంద వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఖమ్మంలో ఐదు లక్షల మందితో జరిగే భారీబహిరంగ సభకు వికారాబాద్ జిల్లా నుంచి పెద్దఎత్తున తరలిరావాలని పార్టీ అభిమానులు, ప్రజా సంఘాల నాయకులను విజయలక్ష్మి పండిత్ కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పీర్ ముహ్మమద్, నాయకులు రవీందర్, వెంకటేష్, అనంతయ్య, అబ్దుల్లా, మునీర్ ఆహ్మద్, సురేష్‌కుమార్, బాబు, సుదర్శన్, పుష్ప, ఖాదర్, రాకేష్, జయప్ప, యేసయ్య పాల్గొన్నారు.

## పట్టాలు ఇచ్చేంతవరకూ పోరాటాలు

సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి దామోదర్‌రెడ్డి



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** పోరాటాలు చేసి సాధించిన హనుమాపురం గ్రామంలో సర్వే చేసి నిర్ధారించిన మిగులు ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 28లో 76 ఎకరాలు అర్హులైన నిరుపేదలకు పట్టాలు చేసి పంపిణీ చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సిపిఐ భువనగిరి మండల, పట్టణ కమిటీ సమావేశం సోమవారం పట్టణంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో చింతల పెంటయ్య అధ్యక్షతన జరిగింది. సమావేశంలో యానాల మాట్లాడుతూ భువనగిరి పట్టణంలో సుమారు ఐదు వేల మంది ప్రజలు అద్దె ఇండ్లలో ఉండి కిరాయిలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారని, ఐదు సంవత్సరాలుగా సిపిఐ రాష్ట్ర నాయకులు గోదా శ్రీరాములు, ఏషాల అశోక్, దాసరి లక్ష్మయ్య, నాగపురి యాదగిరి నాయకత్వంలో ఉద్యమాలు నిర్వహించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదన్నారు. పట్టాలు ఇచ్చేంతవరకు పోరాటాలు నిర్వహిస్తామన్నారు. సిపిఐ రాష్ట్ర నాయకులు గోదా శ్రీరాములు మాట్లాడుతూ ఈనెల 18న జరిగే సిపిఐ శతజయంతి ఉత్సవాలకు జిల్లా నుంచి ఐదు వేల మందిని సమీకరించి ఖమ్మం సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులను కోరారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఎండి ఇమ్రాన్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సోమన సబిత, సిపిఐ మండల పట్టణ కార్యదర్శులు దాసరి లక్ష్మయ్య, పుట్ట రమేష్, చొప్పరి సత్తయ్య, కోట శంకర్, బద్దం వెంకటరెడ్డి, చింతల మల్లేష్, ముదిగొండ ఠాగూర్, వడి శ్రీను, మరిపెల్లి ఎల్లయ్య, కూరాకుల అబ్బులు, ఘనబోయిన వెంకటేశం పాల్గొన్నారు.

# అమెరికా నిరంకుశ చర్యలు వ్యతిరేకించాలి

### ప్రపంచ శాంతి కోరుకునేవారికి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు పిలుపు

**ప్రజాపక్షం/వరంగల్ :** వెనుజులాపై అమెరికా అత్యంత పాశవీకంగా దాడి చేసి ఆ దేశ అధ్యక్షుడు మదురోను, ఆయన భార్యను బంధించి న్యూయార్క్ తీసుకురావడం దారుణమని, ఇలాంటి చర్యలను ప్రపంచ శాంతి కోరుకునే ప్రతిఒక్కరు తీవ్రంగా ఖండించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం వరంగల్ జిల్లాకేంద్రంలోని శివనగర్‌లోని తమ్మెర భవన్‌లో సిపిఐ వరంగల్ జిల్లా విస్తృత సమావేశం ఎండి అక్బర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ అమెరికా చర్యలను తీవ్రంగా ఖండిస్తూ, అధ్యక్షుడు నికోలస్ మదూరో, ఆయన కుటుంబాన్ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వెనిజులాపై అమెరికా దాడిని తాము వ్యతిరేకిస్తున్నామని, ఆ దేశ సార్వభౌమత్వాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రపంచ దేశాలపై ఉందని ఆయన అన్నారు. వెనిజులాలో ఆయిల్ సంపదను అమెరికా వశం చేసుకోవాలని చూస్తున్నదని, ఆ దేశ సహజ వనరులను కొల్లగొట్టే అధికారం అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు లేదన్నారు. అమెరికా నిరంకుశ చర్యలను భారత దేశం వ్యతిరేకించాలన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా, రాష్ట్ర సమితి సభ్యులు మేకల రవి, పంజాల రమేష్, జిల్లా నాయకులు పనాస ప్రసాద్, దండు లక్ష్మణ్, గన్నారపు రమేష్, బుస్సా రవీందర్, గుండె బద్రి, ఆరెల్లి రవి, జన్ను రవి తదితరులు పాల్గొన్నారు.




### సామ్రాజ్యవాదం విస్తరణలో భాగమే వెనిజులాపై దాడి : బాలనర్సింహ్మ

**నాగర్‌కర్నూల్ :** వెనిజులా దేశ సార్వభౌమత్వాన్ని హరించే విధంగా, అధ్యక్షుడు నికోలస్ మధురో, ఆయన కుటుంబ భద్రతకు ముప్పుగా మారిన అమెరికా సైనిక చర్యలను సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు ఎం.బాల్‌నర్సింహ్మ తీవ్రంగా ఖండించారు. సోమవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్యవాదం విస్తరణలో భాగమే వెనిజులాపై అమెరికా దాడి అన్నారు. ట్రంపు ప్రధాన ఉద్దేశ్యం వెనిజులాలో ఉన్న చమురు ఉత్పత్తులను స్వాధీనం చేసుకోవడమేగాని డ్రగ్స్ ఆరోపణలు నిజం కావని, ఇలాంటి చర్యలను ప్రతిఒక్కరం ఖండించాల్సిందేనన్నారు. ఇప్పటివరకు దీనిపై కేంద్రప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయకపోవడం గమనార్హమన్నారు. కేంద్రప్రభుత్వం దేశంలో కొనసాగిస్తున్న టువంటి ఆపరేషన్ కగార్ రాజ్యాంగానికి విరుద్ధమని, మావోయిస్టులు చర్చలకు సిద్ధమని ప్రకటించిన కూడా మావోయిస్టులను చంపడం అన్యాయ మన్నారు. దీనివెనుక అసలు కారణం చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని అడవులలో ఉన్న విలువైన ఖనిజసంపదను మోదీ తన మిత్రులైన ఆదాని, అంబానిలకు అప్పగించడం అన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ సిపిఐ శతజయంతి ఉత్సవాల ముగింపులో భాగంగా ఈనెల 18న ఖమ్మంలో జరగనున్న భారీ బహిరంగసభకు జిల్లా నుంచి అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశానికి బొల్లెద్దుల శ్రీనివాస్ అధ్యక్షత వహించగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు హెచ్.ఆనంద్‌జి, కేశవులుగౌడ్, జిల్లాకార్యవర్గ సభ్యులు టి.నర్సింహ్మా, ఈర్ల చంద్రమౌళి, ఆర్.ఇందిరమ్మ, కౌన్సిల్ సభ్యులు తుమ్మలశివుడు, రవీందర్, బండి లక్ష్మి పతి, శివశంకర్, మర్యాద వెంకటయ్య, కిరణ్‌కుమార్, పరుషరాములు, గోపాల్, శ్రీను, మధుగౌడ్, ప్రేమ్‌కుమార్, నరేష్ పాల్గొన్నారు.




## రైతులను దోచుకున్న వారిపై చర్యలు తీసుకోకపోతే ఉద్యమం ఉధృతం చేస్తాం

సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి బిక్షపతి




**ప్రజాపక్షం/హనుమకొండ :** హనుమకొండ జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్ల సందర్భంగా తరుగు పేరుతో పెద్ద ఎత్తున దోపిడీ జరిగిందని ఆధారాలతో ఫిర్యాదు చేసినా స్పందన లేదని, కోట్లల్లో జరిగిన ఈ దోపిడీపై ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించాలని సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగిన ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ జిల్లాలోని రైస్ మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, అధికారులు కొంతమంది సహకారంతో జరుగుతున్న ఈ అక్రమాలపై విచారణ జరిపి భాద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. తరుగు పేరుతో పెద్దఎత్తున ధాన్యం దోచుకుంటున్న విషయాన్ని ఒకరిపై ఒకరు నెపం మోపుకుంటూ తప్పించుకుంటున్నారని విమర్శించారు. వందల కోట్ల రూపాయల అవినీతి జరుగుతున్నా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ విషయంలో తమ పార్టీ అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ కూనంనేని సాంబశివరావు ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. నాలుగైదేళ్లుగా ధాన్యం కొనుగోళ్లలో ఏదో రకంగా రైతులు మోసపోతున్నా అధికారులు ముందు జాగ్రత్తలు తీసుకోవడం లేదని విమర్శించారు. అవకతవకలకు భాద్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని, తరుగు పేరుతో అదనంగా దోచుకున్న ధాన్యం డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల రైతుల తరఫున జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు చేపడతామని భిక్షపతి హెచ్చరించారు. ధర్నా అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, నాయకులు ఎదునూరి వెంకట్రాజం, కర్రె లక్ష్మణ్, కొట్టెపాక రవి, మునిగాల భిక్షపతి, కొట్టే వెంకటేష్ , కుడిస్వామి, మునిగాల స్వామి, స్వరూప దేవరకొండ కొమురయ్య , బద్రుంబి, కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

## హక్కుల రక్షణకు పోరాటాలు

సిపిఐ శతజయంతి ఉత్సవాల ముగింపు సభకు భారీగా తరలిరండి

సిపిఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి పవన్

**ప్రజాపక్షం/ సిద్దిపేట :** భారత కమ్యూనిస్టు పార్టీ వంద సంవత్సరాల ఉత్సవాల సందర్భంగా ఖమ్మంలో జనవరి 18న 5 లక్షల మందితో జరిగే భారీ బహిరంగసభకు వేలాదిగా ప్రజలు, కమ్యూనిస్టు శ్రేణులు తరలిరావాలని సిపిఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ పిలుపునిచ్చారు. సిద్దిపేట జిల్లాకేంద్రంలోని ఎడ్ల గురువారెడ్డి భవన్‌లో పార్టీ నాయకులతో కలసి బహిరంగసభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా మంద పవన్ మాట్లాడుతూ దేశంలో నాడు స్వాతంత్ర్యోద్యమం నుండి నేటివరకు ప్రజల కోసం ఉద్యమించిన సిపిఐ వందేళ్ల ఉత్సవాలను జరుపుకోవటం గర్వకారణమన్నారు. ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడుతున్న ఏకైక పార్టీ సిపిఐ అని, కార్మిక, రైతు, మహిళ, విద్యార్థి, యువజన హక్కుల కోసం నిరంతరం సిపిఐ పోరాడుతుందన్నారు. సమావేశం లో సిపిఐ జిల్లా నేతలు కనుకుంట్ల శంకర్, కొమ్ముల భాస్కర్, బట్టు దయానంద్‌రెడ్డి. ఎడల వనేశ్, అందే అశోక్, కిష్టపురం లక్ష్మణ్, జెర్రిపోతుల జనార్దన్, రజని, బన్సిలాల్, ఎస్కె హారీఫ్, మిట్టపల్లి సుధాకర్, బోనగిరి రూపేశ్, శివలింగం ,కృష్ణ, సుదర్శనచారి, రంగారెడ్డి, రాజేశం. సంగేం మధు. రామగళ్ల నరేష్, కర్నాల చంద్రం. బంక రాజయ్య తదితరులు పాల్గొన్నారు.






## డిఎఇకి రూ.129,66 కోట్ల చెక్కు అందజేసిన ఇసిఐఎల్ కంపెనీ

**ప్రజాపక్షం/చర్లపల్లి:** ఎలాక్ట్రానిక్స్ రంగంలో ఐదున్నర దశాబ్దాల నుండి పనిచేస్తున్న మినీరత్న(కేటగిరి1)కంపెనీ అయిన హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఇసిఐఎల్)2024–25 ఆర్థిక సంవత్సరానికి డివిడెండ్‌గా రూ.129,66కోట్ల చెక్కును అణుశక్తి విభాగానికి అందజేసింది. డిఎఇ కార్యదర్శి, ఎఇసి చైర్మన్ డాక్టర్ ఎకె మొహంతి, ఇసిఐఎల్ చైర్మన్, ఎండి అనురాగ్ కుమార్ చెక్కును స్వీకరించారు. అనురాగ్ కుమార్ మాట్లాడుతూ ఇది ఉద్యోగులందరి అంకితభావంతో కూడిన కృషి ఫలితమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఒఎస్, డైరెక్టర్ (టెక్నికల్) డాక్టర్ అనేష్ కుమార్‌శర్మ, డైరెక్టర్(ఫైనాన్స్) ప్రొటిక్ కుమార్ చక్రవర్తి, జనరల్ మేనేజర్(నార్త్)బ్రిగేడియర్ రాహుల్‌మాలిక్ (రిటైర్డ్),ఎజిఎం(ఫైనాన్స్) రంజన్ శ్రీవాస్తవ,తదితరులు పాల్గొన్నారు.




## స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమం

**ప్రజాపక్షం/చర్లపల్లి:** పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని డిసి శ్రీహరి అన్నారు. మంగళవారం స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా కాప్రా డిప్యూటీ కమిషనర్ శ్రీహరి ఆదేశాల మేరకు కుషాయిగూడలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పెరిగిన పిచ్చి మొక్కలను, చెత్త, అక్కడ పడి ఉన్న రాళ్లను మున్సిపల్ సిబ్బంది తొలగించి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో సాలిడ్ మేనేజ్‌మెంట్ డిఇ రవి, శానిటరీ సూపర్‌వైజర్ సుదర్శన్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మంచి నీటి సమస్య పరిష్కరించండి

**ప్రజాపక్షం/నాగారం:** నాగారంలో నెలకొన్న మంచినీటి సమస్యను పరిష్కరించాలని వాటర్ వర్క్స్ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డిని మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి కలసి విన్నవించుకున్నారు. జిహెచ్‌ఎంసి పరిధిలోని 5వ వార్డు నాగారం పరిధిలోని 180 కాలనీలలో మంచినీటి సమస్యను ఎదుర్కొంటుందని, జిహెచ్‌ఎంసిలో 20 వేల లీటర్ల వరకు ఉచితంగా నీటి సరఫరా అవుతుందని నాగారం డివిజన్ పరిధిలో కూడా నీటి సరఫరా చేయాలన్నారు. కాలనీలలో నీటి పైపులైన్ లేని ప్రాంతాలలో నూతన లైన్లు వేసి కనెక్షన్ ఇవ్వాలని వినతిప్రతం కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు నక్క కిషోర్‌గౌడ్, జూపల్లి నరసింహ, సురవి రాజు గౌడ్‌లు పాల్గొన్నారు.

## చర్లపల్లి పిఎస్ పరిధిలో ఇద్దరు అదృశ్యం

**ప్రజాపక్షం/చర్లపల్లి:** మహిళ, ఒక వ్యక్తి అదృశ్యమైన సంఘటన చర్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చర్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని భరత్ నగర్‌లో నివాసముండే పూజా కుమారి(25) 30వ తేదీన ఇంటి నుండి దుకాణానికి వెళ్లి తిరిగి రాలేదని భర్త ఇచ్చిన ఫిర్యాదుతో మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు. అదే విధంగా చిన్న చర్లపల్లి సాయినగర్‌కు చెందిన అజయ్‌కుమార్ సింగ్(33) 30వ తేదీన ఇంట్లో గొడవ జరిగి బయటికి వెళ్లి తిరిగి రాకపోవడంతో భార్య పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారు. దీంతో మిస్సింగ్ కేసుగా నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.





## వర్తక వ్యాపార సంఘం నూతన కమిటీ ఎన్నిక

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** అలియబాద్ మున్సిపాలిటిలో వర్తక వ్యాపార సంఘం నూతన కమిటిని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎనమైన విఠల్‌రావు, ఉపాధ్యక్షులుగా ఇప్ప శ్రీకాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఆర్విన్ ప్రసాద కట్ట, కోశాధికారిగా రాపోల్ నవీన్, కార్యదర్శులు వజ్రమ్మ, బాలకృష్ణ, అజ్జుబాయ్, ఆనంద్, బట్టు నాగరాజు, కాంతిలాల్, మనమ చారి, సలహాదారులుగా రామ్‌ప్రతాప్, రమేష్, వినాయకరావు, రాపోల్ గోపాల్, సోనులాల్, కృష్ణగౌడ్, పవన్, గట్టు హరిశంకర్‌లను ఎన్నుకున్నారు. అనంతరం అలియాబాద్ మున్సిపల్ కమిషనర్‌ను కలిసి తమ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం సమర్పించారు. నూతన సంవత్సర క్యాలండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వర్తక వ్యాపార సంఘం కమిటి అధ్యక్ష, కార్యదర్శులు, కమిటి సభ్యులు, మాజి సర్పంచ్ కమఠం కృష్ణారెడ్డి, బండి రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అండర్ డ్రైనేజీ పనుల్లో జాప్యమొద్దు

**ప్రజాపక్షం/కాప్రా:** రాకపోకలు, వాహనదార్లకు ఇబ్బందులు తలెత్తకుండా ఎలాంటి జాప్యం లేకుండా అండర్ డ్రైనేజి పనులు పూర్తి చేయాలని హెచ్‌బి కాలనీ డివిజన్ కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ సూచించారు. సోమవారం ఆయన వాటర్‌వర్క్స్ మేనేజర్ వేణుగోపాల్‌తో కల్సి రాజీవ్ నగర్ కాలనీలో జరగుతున్న అండర్ డ్రైనేజి పనులను పరిశీలించారు. అండర్ డ్రైనేజి నిర్మాణ పనులను దివిజన్‌లో దశలవారీగా చేపడుతూ అన్ని ప్రాంతాల్లో పూర్తి చేస్తున్నానని తెలిపారు.



# చైనా మాంజాపై ఉక్కుపాదం

### విక్రయించినా, నిల్వ చేసినా క్రిమినల్ కేసులు : సిపి సజ్జనార్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సంక్రాంతి పండుగ వేళ నిషేధిత చైనా మాంజా విక్రయాలు, వాడకంపై కఠినంగా వ్యవహరిస్తున్నట్లు నగర పోలీసు కమిషనర్ విసి సజ్జనర్ తెలిపారు. పక్షుల స్వేచ్ఛకు, అమాయక వాహనదారుల ప్రాణాలకు ముప్పుగా పరిణమిస్తున్న ఈ ప్రమాదకరమైన మాంజాను ఎవరైనా రహస్యంగా విక్రయించినా, నిల్వ ఉంచినా ఉపేక్షించే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చైనా మాంజా నియంత్రణ, తీసుకోవాల్సిన చర్యలపై క్షేత్ర స్థాయి అధికారులకు సిపి సజ్జనార్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పండుగ పూట గాలిపటాలు ఎగురవేయడం సంప్రదాయమే అయినప్పటికీ, అది ఇతరుల ప్రాణాలకు ముప్పుగా మారకూడదని హితవు పలికారు. చైనీస్ మాంజా పర్యావరణానికి తీవ్ర హాని కలిగిస్తోందని, ఇది మట్టిలో కలిసిపోక ఏళ్ల తరబడి అలాగే ఉండిపోతుందని ఆవేదన వ్యక్తం చేశా రు. పర్యావరణ పరిరక్షణ చట్టం1986 ప్రకారం ప్రభుత్వం



చైనీస్ మాంజా తయారీ, విక్రయం, నిల్వ, వినియోగంపై పూర్తిస్థాయి నిషేధం విధించిందని గుర్తుచేశారు.

ఈ నిషేధాన్ని కఠినంగా అమలు చేసేందుకు నగరవ్యాప్తంగా ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు సీపీ వెల్లడించారు. నగరంలోని అన్ని జోన్లలోని కైట్స్ విక్రయ కేంద్రాలు, చిన్న కిరాణా దుకాణాలు, అనుమానిత గోదాములపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు, స్థానిక పోలీసులు సంయుక్తంగా ఆకస్మిక దాడులు నిర్వహిస్తారని స్పష్టం చేశారు. కేవలం విక్రయదారులే కాకుండా, ఇతర రాష్ట్రాల నుంచి నగరానికి అక్రమంగా ఈ నిషేధిత మాంజాను రవాణా చేస్తున్న ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీలు, పార్శిల్ సర్వీసులపైనా నిఘా పెంచామని, వారి ప్రమేయం ఉన్నట్లు తేలితే ఏజెన్సీ యజమానులపైనా కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లల విషయంలో బాధ్యతగా వ్యవహరించాలని సీపీ సజ్జనర్ విజ్ఞప్తి చేశారు. చైనీస్ మాంజాలో ప్లాస్టిక్, ఇతర సింథటిక్ పదార్థాలతో పాటు గాజు పెంకుల మిశ్రమం పూతగా ఉంటుందని, దీని వల్ల ద్విచక్ర వాహనదారుల మెడలు తెగిపోవడంతో పాటు, పిల్లల వేళ్లు తెగిపోయే ప్రమాదం ఉందని వివరించారు. అంతేకాకుండా, ఇందులో ఉండే మెటాలిక్ పదార్థాల వల్ల విద్యుత్ తీగలకు తగిలినప్పుడు షాక్ కొట్టి పిల్లలు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. దయచేసి తల్లిదండ్రులు తమ పిల్లలకు సంప్రదాయ నూలు దారాలను మాత్రమే ఇచ్చి ప్రోత్సహించాలని కోరారు.

నగర పౌరులు కూడా సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని సీపీ పిలుపునిచ్చారు. మీ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా గుట్టుచప్పుడు కాకుండా నిషేధిత చైనీస్ మాంజా విక్రయిస్తున్నట్లు లేదా నిల్వ చేసినట్లు గమనిస్తే వెంటనే డయల్ 100కు ఫోన్ చేసి గానీ, హైదరాబాద్ పోలీస్ వాట్సాప్ నెంబర్ +91 94906 16555 గానీ లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

## యూరియా కొరతే లేదు..స్టాక్ ఫుల్

### అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** జిల్లాలో ఎక్కడా యూరియా కొరత అనేది లేదని, రైతులు తమ అవసరాల మేరకు యూరియా కొనుగోలు చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి స్పష్టం చేసారు. రైతులు ఎక్కడా ఇబ్బంది పడకుండా ఉండే విధంగా యూరియా అందించేందుకు సరిపడా స్టాక్ అందుబాటులో ఉండేలా చూసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అధికారులకు సూచించారు. యూరియా సరఫరా ఏర్పాట్ల విషయమై సోమవారం కలెక్టరేట్‌లో నోడల్ అధికారి ఆశాకుమారితో కల్సి సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో 4వ తేదీ నాటికి ప్రైమరి అగ్రికల్చర్ కోపరేటివ్ సొసైటీలో 173.025, మార్క్‌ఫెడ్ బఫర్‌లో 405.135, ప్రైవేట్ డీలర్ల వద్ద 210.06 మెట్రిక్ టన్నుల యూరియా స్టాక్ ఉందని జిల్లా వ్యవసాయాధికారిణి చంద్రకళ తెలిపారు. అనంతరం నోడల్ అధికారితో కల్సి దేవరయాంజల్‌లోని ప్రైమరి అగ్రికల్చర్ కోపరేటివ్ సొసైటి, హకీంపేటలోని ఫార్మర్స్ సిండికేట్ కోపరేటివ్ సొసైటీలకు వెళ్లి అక్కడ ఉన్న యూరియా స్టాక్, రిజిస్టర్లను పరిశీలించారు.

## శాస్త్రీయ దృక్పథం, తర్కబద్ధమైన ఆలోచనా విధానం అవసరం

### కలెక్టర్ మనుచౌదరి




**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, తర్కబద్ధమైన ఆలోచన విధానాన్ని పెంపొందించటంలో జన విజ్ఞానవేదికలాంటి సంస్థల పాత్ర కీలకమని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి అన్నారు. జన విజ్ఞానవేదిక రూపొందించిన ప్రత్యేక సైన్స్ క్యాలెండర్‌ను సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పథం లేని సమాజం ముందుకు సాగదని, అంధ విశ్వాసాలు, మూఢ నమ్మకాలు తొలగించాలంటే అన్ని శాస్త్రాలపై అవగాహన పెరగాలన్నారు. విజ్ఞానం పుస్తకాలకే పరిమితం కాకుండా ప్రజల రోజువారీ జీవితంలో భాగం కావాలని, ముఖ్యంగా విద్యార్థి దశ నుండి తర్కబద్ధమైన ఆలోచన పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సైన్స్ క్యాలెండర్‌లోని అంశాలు చిన్నారుల నుండి పెద్దల వరకు శాస్త్రీయ సందేశం ఇచ్చేలా ఉన్నాయని, ఇలాంటి యత్నాలు సమాజాన్ని చైతన్య పరుస్తాయని కలెక్టర్ అన్నారు. జన విజ్ఞానవేదిక చెకుముకి ఎడిటర్ ఆనంద్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.శ్రీనివాస్‌లు మాట్లాడుతూ ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెపొందించటమే లక్ష్యం గా కొనసాగుతున్నామని, ప్రతి విషయాన్ని ఆలోచనా ధోరణి, ప్రశ్నించే తత్వంతో ముందుకు వెళ్లాలని, ప్రశ్నించని సమాజం ముందుకు సాగదన్నారు. ఈ కార్యక్రమంలో వేదిక ప్రతినిధులు మేడ్చల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తోట శ్రీనివాస్, ఎస్‌కె బురాన్, సీనియర్ నాయకులు మల్లయ్య చారి, శంకర్, సిహెచ్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.




## ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు క్యాష్‌ప్రైస్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** పదిలో ఉత్తమ ఫలితాలు సాదించిన విద్యార్థులకు ఉత్తుంగా ఫౌండేషన్ ఆద్వర్యంలో నగదు పురస్కారాలు అందజేశారు. సోమవారం జిహెచ్‌ఎంపి పరిధిలోని తూంకుంటలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉత్తుంగా ఫౌండేషన్ ఆద్వర్యంలో విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేశారు. అలాగే గత సంవత్సరం పదిలో మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాలు సాదించిన ఉత్తమ విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉత్తుంగా ఫౌండేషన్ ప్రసిడెంట్ వెంకటరమణ, ప్రధానోపాద్యాయులు వెంకట్‌రెడ్డి, విశ్రాంత ఎంపిడిఒ బాల, రామకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితాను ప్రతి ఒక్కరూ సరిచూసుకోవాలి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ఓటరు జాబితాను ప్రతి ఒక్కరు సరిచూసుకోవాలని అలియాబాద్ మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం అలియాబాద్ మున్సిపాలిటిలో ఓటరు జాబితాపై వివిద రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ



డ్రాఫ్ట్ జాబితాలోని 20 వార్డుల్లో ఉన్న ఓటర్లు ప్రతి ఒక్కరు తమ ఓటును సరి చూసుకోవాలన్నారు. ఒక వార్డులోని ఓటరు పేరు వేరే వార్డులో వచ్చినట్లయితే మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. నూతన ఓటు నమోదు కొరకు అలాగే తొలగించుటకు ఈఆర్‌ఒకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో మేనెజర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌ఓ వేణుగోపాల్, టిపిఒ వికాస్, వివిద రాజకీయ పార్టీల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

## జ్యువెలరీ దుకాణంలో దోపిడీ : ముఠా అరెస్ట్

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** పట్ట పగలే జ్యువెలరీ దుకాణంలో చొరబడి దోపిడీ యత్నానికి పాల్పడ్డ ఉదంతంలో ఐదుగురు ముఠా సభ్యులను కీసర పోలీసులు అరెస్టు చేసారు. వీరినుండి ఒక గొడ్డలి, బొమ్మ తుపాకి, ఒక కారు, ఒక పల్సర్ బైకును స్వాధీనం చేసుకొన్నారు. కీసర పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గత శుక్రవారం మధ్యాహ్నం 3.15 గంటల ప్రాంతంలో నాగారంలోని బాలాజి జ్యువెలరీ దుకాణంలోకి ఆకస్మాత్తుగా ప్రవేశించిన ఇద్దరు దుండగులు బొమ్మ తుపాకితో యజమాని సందీప్ గెహ్లోత్‌ను బెదిరించి జ్యువెలరీ బ్యాగును లాక్కొని పరారవుతుండగా అడ్డుకోవటం తో గాయపరచి బ్యాగును అక్కడే వదిలి పరారయ్యారన్న ఫిర్యాదు మేరకు కీసర పోలీసులు కేసు నమోదు చేసారు. తదుపరి దర్యాప్తు ఫలితంగా కొంపల్లిలో నివసించే ముంబాయి రాష్ట్ర వాసి నజీమ్ కోటాడియా, రాంకోటి నివాసి బిషు కర్మ ఏకేందర్ సింగ్, కింగ్‌కోటి నివాసి మహ్మద్ సైఫలీ అలియాస్ ఆద్నామ్, మెహిదిపట్నం నివాసి రాజేందర్‌సింగ్, మెహిదీపట్నంలోని సంతోష్‌నగర్ నివాసి రతన్ సింగ్ బహదూర్‌లను అరెస్టు చేసారు. ఈ ముఠాకు గుడిమల్కాపూర్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్‌గా ఉన్న రతన్‌సింగ్ దోపిడీ అనంతరం సులభంగా పరారయ్యేందుకు వీలుగా ఉన్న నాగారంలోని బాలాజి జ్యువెలరీ దుకాణాన్ని ఈ ముఠా ఎంచుకొని ముందుగా రెక్కీ నిర్వహించారు. పథకం ప్రకారం దుకాణంలోకి మహ్మద్ సైఫలీ, రాజేందర్‌సింగ్‌లు సాధారణ కస్టమర్లలాగా ప్రవేశించి అనుకూల సమయం అంటూ సమాచారమిచ్చి ఎవరికీ అనుమానం రాకుండా దుకాణం నుండి తిరిగి వెళ్లిపోయారు. సమాచారంఅందుకొన్న నజీం, బిషుకర్మాలిద్దరూ తమ వెంట బొమ్మ తుపాకి, గొడ్డలి తీసుకొని దుకాణంలోకి ప్రవేశించి తుపాకితో యజమాని సందీప్‌ను బెదిరించి జ్యువెలరీ బ్యాగును లాక్కొన్నారు. సందీప్ వెంటనే అప్రమత్తమై ఎదిరించటంతో పట్టుబడుతామోనన్న భయంతో అతడిని గాయపరచి బ్యాగును అక్కడే వదిలి పెట్టి వెంటనే పరారయ్యారు. ఈ విషయంపై ఫిర్యాదు అందుకొన్న కీసర పోలీసులు సంఘటనాస్థలికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. మల్కాజిగిరి, ఎస్‌ఓటి డిసిపిలు శ్రీధర్, రమణారెడ్డిల నేతృత్వంలో అదనపు డిసిపి నరసింహారెడ్డి, ఎసిపి అంజయ్య, ఇనస్పెక్టర్లు ఆంజనేయులు, జానయ్య, జలందర్‌రెడ్డి, శ్రీనివాస్, ఎస్సైలు వంశీ,వాసుదేవ్, సాయికుమార్, హరిప్రసాద్, సునీల్‌రెడ్డిలు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నిందితులను అరెస్టు చేసారు. నిందితులపై వేర్వేరు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదై ఉన్నాయని తెలిపారు. సహకరించాడన్నారు.






## ఎఐటియుసి జెండావిష్కరణ

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** జిహెచ్‌ఎంసి నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని డంపింగ్ యార్డ్ వద్ద ఎఐటియుసి జెండాను ఎఐటియుసి మేడ్చల్ జిల్లా కార్యదర్శి వి.శ్రీనివాస్ ఎగురవేశారు. అనంతరం నూతనంగా కమిటీ ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎఐటియుసి మేడ్చల్ జిల్లా కార్యదర్శి వి.శ్రీనివాస్, ఎఐటియుసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలబిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ, నిజాంపేట్ సర్కిల్ నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగిందన్ని అన్నారు. ఎఐటియుసి 1920 లో ఏర్పాటు చేశారని దానికి మొట్టమొదటి అధ్యక్షులు ప్రముఖ స్వసాంత్ర సమర యోధులు లాలా లజపత్ రాయ్, ఆయనతో పాటు అనేక మంది సోషలిస్టు పార్టీ నేతలు కలిసి ఎఐటియుసి స్థాపించారన్ని దాదాపు 106 సంవత్సరాల చరిత్ర ఉందని భారత దేశ స్వాసంత్రం రాకముందు నుండి కార్మికుల కోసం పోరాటం చేసిన ఏకేక కార్మిక సంఘం ఎఐటియుసి అన్ని గుర్తు చేశారు. ప్రతి రోజు జెండా ఏ జెండా లేని అనేకమంది కార్మికుల పై దౌర్జన్యం చేస్తూ అన్నారు. కార్మికుల వద్ద దోపిడీ చేస్తున్నారనీ ఆది సరిఅయిన విదంగా కాదు అన్ని అన్నారు. కార్మికులకు ఎలాంటి ఇబ్బంది కలిగిన ఎఐటియుసి ఎర్ర జెండా ముందు ఉంటుందన్ని గుర్తు చేశారు. కనుక దోపిడీ దారులకు ఏఐటీయూసీ ఏచ్చరిక చేస్తుందన్ని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆశి యాదయ్య, పొన్న కంటి దస్తగిరి, ఆకుల రమేష్, చంద్రయ్య, నందు, మల్లేశం, శివ రెడ్డి, రవి, సురేష్, అశోక్, లక్ష్మిణ్,ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణాలో టిడిపి తిరుగులేని శక్తిగా ఎదగాలి

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** విదేశీ పర్యటన ముగించుకొని హైదరాబాద్ చేరుకొన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుదును సోమవారం శంషాబాద్ విమానాశ్రయం టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి డా. బత్తిని నరసింహగౌడ్ స్వాగతం పలికారు. తెలంగాణాలో టిడిపి తిరుగులేని శక్తిగా ఎదుగుతుందని, దీనికి నేతలు, కార్యకర్తలు సమిష్టి కృషి చేయాలని బాబు ఈ సందర్భంగా పిలుపిచ్చారు.



## గౌతంనగర్‌లో యథాతథంగా 8 కాలనీలు

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** డివిజన్ల పునర్విభజనలో భాగంగా గౌతంనగర్ డివిజన్‌లో తొలగించి నూతనంగా ఏర్పాటు చేసిన మిర్జాలగూడ డివిజన్‌లో కలిపిన ఎనిమిది కాలనీలు తిరగి యథాతథంగా గౌతంనగర్ డివిజన్‌లోకి మార్చారు. ఈ మేరకు జిహెచ్‌ఎంసి అధికారులు నిర్ణయించటంతో స్థానికులు హర్షం వ్యక్తంచేస్తూ దీనికి కృషిచేసిన మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డిని సోమవారం స్థానిక కార్పొరేటర్ మేకల సునిత రాముయాదవ్‌లతో కల్సి అభినందనలు తెలిపారు. ఉత్తంనగర్, దయానందనగర్, గౌతంనగరర్, మల్లికార్జుననగర్, హనుమాన్‌పేట, జ్యోతినగర్ ప్రాంతవాసులు ఎమ్మెల్యేను కల్సి తమ ప్రాంతా లను మిర్జాలగూడ డివిజన్‌లో కలపడంవల్ల ఎదురయ్యే ఇబ్బందులను స్పష్టం చేశారు. దీంతో ఎమ్మెల్యే చొరవ తీసుకొని జిహెచ్‌ఎంసి అధికారులను కల్సి సమస్యలను విన్నవించటంతో ఆ కాలనీలను యథాతథంగా గౌతంనగర్ డివిజన్‌లో కలిపారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి : ప్రతీక్‌జైన్

**ప్రజాపక్షం/ వికారాబాద్ :** ప్రజావాణి కార్యక్రమనికి వచ్చిన ప్రజా ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలనిజిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులనుఅదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా లోని వివిధ ప్రాతల నుండి వచ్చిన ప్రజల నుండి 85 ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని పెండింగ్ ఉంచకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి అదనపు రాజేశ్వర్ అదనపు కలెక్టర్ సుధీర్ , ట్రైనింగ్‌కలెక్టర్ హర్స్‌చౌదరి ఆర్‌డిఓ వాసుచంద్ర తదితరులు పాల్గోన్నారు.



## డిసి భాస్కర్‌రెడ్డికి వీడ్కోలు

**ప్రజాపక్షం/నాగారం:** నాగారం మున్సిపాలిటీ డిప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వహించిన భాస్కర్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సంతోష్‌కుమార్‌లను ఘట్కేసర్ డిప్యూటీ కమిషనర్ వాణి, నాగారం డివిజన్ అధికారులు,సిబ్బందితో కలసి శాలువాతో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. భాస్కర్‌రెడ్డి విధి నిర్వహణలో నిబద్ధత, క్రమశిక్షణతో ప్రజలకు అందించిన మెరుగైన సేవలను ప్రశంసించి కొత్త బాధ్యతల్లో మరింత విజయవంతం కావాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**డిసి వాణికి అభినందనలు తెలిపిన మాజీ కౌన్సిలర్లు**

ఘట్కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషన్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వాణిరెడ్డిని నాగారం మున్సిపాలిటీ మాజీ మహిళ కౌన్సిలర్లు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.నాగారం మున్సిపాలిటీ కమిషనర్ అనేక అభివృద్ధి పనులు చేపట్టారని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో గూడురు సబితాఆంజనేయులుగౌడ్,కొమిరెల్లి అనితసుధాకర్‌రెడ్డి, లక్ష్మి వేణుగోపాల్, సరితరమేష్,మోకు రేణుక తదితరులు పాల్గొన్నారు.

## రైతుల అవసరం మేరకు అందుబాటులో యూరియా : ఏడిఎ

ప్రజాపక్షం/షాద్‌నగర్: అన్నదాతల అవసరం మేరకు యూరియా అందుబాటులో ఉందని, ఎవరు అధైర్య పడోద్దని షాద్‌నగర్ వ్యవసాయ శాఖ ఏడిఏ రామాదేవి సూచించారు. సోమవారం పట్టణంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏడిఏ రమాదేవి, ఫరూఖ్‌నగర్ మండల వ్యవసాయ అధికాని నిశాంత్‌కుమార్‌ల ఆధ్వర్యంలో డీలర్లకు యూరియాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ అన్నదాతలకు అవసరం ఉన్న మేరకు యూరియాను పంపిణీ చేసేందుకు డీలర్లు కృషి చేయాలని ఆకాంక్షించారు.

## అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు : డిఎల్‌పిఒ



ప్రజాపక్షం/కొందుర్గు: ప్రభుత్వ అనుమతి లేకుండా పనులు చేపడితే ఉపేక్షించేది లేదని డిఎల్‌పిఓ మల్లారెడ్డి హెచ్చరించారు. సోమవారం కొందుర్గు మండల కేంద్రంలో సంపద అనే వెంచర్ 24ఎకరాల్లో ఏర్పాటు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వెంచర్ ఏర్పాటు, ప్రహారి గోడ నిర్మాణాలు చేస్తున్న విషయాన్ని తెలుసుకున్న అధికారులు ఘటన స్థలానికి వెళ్ళి జెసిబితో ప్రహారిగోడను కూల్చివేయడంతోపాటు పనులను నిలిపివేశారు. ఈ సందర్భంగా డిఎల్‌పిఓ మల్లారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వెంచర్ ఏర్పాటు చేశారని, ప్రహారి గోడ నిర్మిస్తున్నారనే విషయాలపై ఫిర్యాదు వచ్చిందని తెలిపారు. ఫిర్యాదు ఆదారంగా పరిశీలించగా వాస్తవాలు వెలుగులోకి వచ్చాయని వివరించారు. కార్యక్రమంలో ఎంపిఒ విజయ్‌కుయార్ పాల్, పంచాయతీ కార్యదర్శి సురేఖ, సర్పంచ్ చౌడపురం ప్రభాకర్, ఉపసర్పంచ్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## ఒక్క క్షణం పొరపాటుతో రోడ్డున పడుతున్న నిండు జీవితాలు

### షాద్‌నగర్ పట్టణ సిఐ విజయ్‌కుమార్




ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్: ఒక్కక్షణం పొరపాటుతో నిండు జీవితాలు రోడ్డున పడుతున్నాయని, డ్రైవర్లు, ప్రజలు తగిన జాగ్రత్తలు వహించాలని పట్టణ సిఐ విజయ్‌కుమార్ సూచించారు. సోమవారం పట్టణంలో ఎంవిఐ వాసు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బస్సులు, లారీల డ్రైవర్లకు రోడ్డు భద్రతలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ విజయ్‌కుమార్ మాట్లాడుతూ డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, వాహనాలను ఎప్పటికప్పుడు కండిషనల్‌గా పెట్టుకోవాలని, వాహనాలను నడిపించే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ట్రాఫిక్‌సిఐ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ వసతిగృహంలో సోలార్ వాటర్ హీటర్ ఏర్పాటు



ప్రజాపక్షం/కొందుర్గు: కొందుర్గు మండల కేంద్రంలోని బిసి బాలుర హాస్టల్ విద్యార్థులకు సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు పి.రామకృష్ణరావు, వారి మిత్రబృందం సౌజన్యంతో రూ.1.35లక్షల విలువ చేసే సోలార్ వాటర్ హీటర్‌ను ఏర్పాటు చేశారు. హాస్టల్ విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వార్డెన్ రఘురామ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.గోపినాథ్, రామకృష్ణరావు, మిత్ర బృందం సభ్యులను అభినంధించారు. వీరందరి సహకారంతో విద్యార్థులకు 300దుప్పట్లు పంపిణీ చేయడంతోపాటు 32ఇంచ్‌ల కలర్ టివి అంధించారు. దాంతో విద్యార్థులు, తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

## షాద్‌నగర్ మున్సిపాలిటీలో ఓట్ల చోరీ

### కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చిన మాజీ కౌన్సిలర్లు



ప్రజాపక్షం/షాద్‌నగర్: స్థానికంగా సొంత ఇల్లు లేదు.. అద్దెకు ఉండదు.. కానీ ఓటర్ జాబితాలో మాత్రం పేర్లు ఉన్నాయి..ఉన్న అడ్రస్ వద్దకు వెళ్ళి విచారిస్తే విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. సోమవారం షాద్‌నగర్ మున్సిపల్ కమిషనర్‌కు మాజీ వైస్ చైర్మెన్ ఎంఎస్ నటరాజన్‌తోపాటు మాజీకౌన్సిలర్లు బచ్చలి నర్సింలు, జిటి శ్రీనివాస్‌లు వినతిపత్రం అంద జేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని 14వ వార్డులో 2181,22127,22127/1, 22193,2295 ఇంటి నెంబర్లలో 919 ఓట్లు ఉన్నాయని సాక్షాదారాలతో సహా కమిషనర్‌కు అందించినట్లు తెలిపారు. అధికారులు వార్డు వారీగా విచారణ చేసి నకిలీ ఓట్లను తొలగించాలని కోరారు. **విచారణ చేసి నకిలీ ఓటర్లను తొలగిస్తాం...** వార్డుల వారీగా దొంగ ఓటర్లను గుర్తించి తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని, ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ సునీత వివరించారు.

## కమాండెంట్ రామకృష్ణకు శుభాకాంక్షలు తెలపిన కాంగ్రెస్‌నేత చాంద్ పాషా





ప్రజాపక్షం/శేరిలింగంపల్లి; శేరిలింగంపల్లి కాంగ్రెస్ సీనియర్ నాయకులు చాంద్ పాషా కొండాపూర్ డివిజన్ పరిధీలోని 8వ బెటాలియన్ కమాండెంట్ రామకృష్ణను, అసిస్టెంట్ కమాండెంట్ రెహమాన్ లను కలసి పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తదుపరి ఆయన మాట్లాడుతూ బెటాలియన్‌లో పోలీసులకు చక్కని శిక్షణ అందించి నిష్ణతులైన పోలీసులను తయారు చేస్తున్నారని చక్కని శిక్షణ అందిస్తున్న అధికారులు మరింత ఉన్నత శిఖారాలకు ఎదగాలని అకాంక్షించారు. కార్యక్రమంలో అధికారులు సత్యనారయణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# వెనిజులాపై అమెరికా ఆధిపత్యం నశించాలి

### చంద్రమోహన్ గౌడ్



ప్రజాపక్షం/హైదరాబాద్ : వెనిజులాపై అమెరికా సామ్రాజ్యవాద దాడిని ఖండిస్తూ సిపిఐ జాతీయ కమిటీ పిలుపు మేరకు హైదరాబాద్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. దక్షిణ అమెరికా దేశమైన వెనిజులాపై అమెరికా ఆధిపత్యం నశించాలని కోరుతూ ఛత్రినాక చౌరస్తాలో పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యుడు గడ్డమీది చంద్రమోహన్‌గౌడ్ మాట్లాడుతూ వెనిజులా అమెరికాకు మాదక ద్రవ్యాలు సరఫరా చేస్తుందన్న నెపంతో ఆ దేశంలో ఉన్న అపార చమురు నిల్వలపై కన్నేసిన ట్రంప్ ప్రభుత్వం దుశ్చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. ఇది స్పష్టమైన అమెరికా సామ్రాజ్యవాద దాడి, దురాక్రమణగా ఆయన అభివర్ణించారు. అమెరికా అన్ని రకాల సైన్యాన్ని ఉపయోగించి వెనెజువెలాపై విరుచుకుపడి, ఆ దేశ సైనిక స్థావరాలపై దాడులు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురి చేసిందన్నారు. వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను, ఆయన భార్య సిలియా ఫ్లోరెస్‌ను బంధించి కళ్లకు గంతలు కట్టి బందిపోటు దొంగల్లా న్యూయార్క్‌కు ఎత్తుకెళ్లారని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఇలాంటి అమానవీయ దాడులను ప్రపంచశాంతిని కాంక్షించే ప్రతి ఒక్కరూ ఖండించాలని, వెనిజులా దేశానికి మద్దతుగా నిలవాలని చంద్రమోహన్‌గౌడ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ హైదరాబాద్ డివిజన్ కార్యవర్గ సభ్యులు జి. ప్రభాకర్, తిరుపతి, డివిజన్ నాయకులు సంతోష్, శ్రీశైలం ఆటో యూనియన్ నాయకులు నాగరాజు, ఎన్. అనీల్, సాయి, మహేందర్, శేఖర్ పాల్గొన్నారు.

### సహజ వనరులపై ఆధిపత్యం కోసమే...

అంతర్జాతీయ న్యాయ చట్టాలను, దేశ సార్వభౌమాధికారాన్ని ఉల్లంగిస్తూ వైమానిక దురాక్రమణ దాడులకు పాల్పడి వెనిజులా దేశ అధ్యక్షుడు నికోలాస్ మధురో, ఆయన భార్య సిలియా ఫ్లోరెస్‌లను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అత్యంత దుర్మార్గంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భం గా ఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు ఆదర్శ్ మాట్లాడుతూ వెనిజులా దేశాధ్యక్షుడిపై, ఆయన కుటుంబంపై ఇలాంటి బెదిరింపులు, అరెస్టులు చేయడం అంతర్జాతీయ చట్టాలకు, మానవ హక్కులకు, ఐక్యరాజ్య సమితి నియమ, నిబంధనలకు, దేశాల సార్వభౌమత్వాలను ఉల్లంఘించడమేనన్నారు. ప్రపంచంలో అత్యధిక చమురు నిక్షేపాలు కలిగిన దేశం వెనిజులా అని, ఆ నిల్వలను దోచుకునేందుకు నీచ కుట్రలతో, సహజ వనరులపై ఆధిపత్యం కోసం ఒక దేశ నాయకత్వాన్ని నేరస్తులుగా ముద్రవేసి అరెస్టు చేయాలనుకోవడం ఆధునిక వలస వాద దురహంకారానికి ప్రతిరూపమని మండిపడ్డారు. నిరసన కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, పిడిఎస్‌యు(విజృంభణ) రాష్ట్ర కార్యదర్శి అల్లూరి విజయ్, జార్జిరెడ్డి పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ నాగేశ్వరరావు, సుమంత్, పిడిఎస్‌యు రాష్ట్ర నాయకులు రాకేష్, ఎఐడిఎస్ఒ నాయకులు నితీష్, ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్, ఎస్‌ఎఫ్ఐ నాయకులు అశోక్, జార్జిరెడ్డి పిడిఎస్‌యు నాయకురాలు స్వాతి, లెనిన్, ఉప్పల ఉదయ్, అజయ్, కిరణ్, సుమన్, రాజశేఖర్, పవన్ ,మధు, వెంకటేష్, రామ్, రాఘవ, శివ, పేర్ల రాము, సలీం తదితరులు పాల్గొన్నారు.

### జిహెచ్‌ఎంసి విభాగాల పనితీరుపై

## సమగ్ర అవగాహన కలిగి ఉండాలి

### కమిషనర్ ఆర్.వి.కర్ణన్



ప్రజాపక్షం/హైదరాబాద్ : జిహెచ్‌ఎంసి పరిధిలోని వివిధ విభాగాల పనితీరు, బాధ్యతలపై నూతనంగా బాధ్యతలు చేపట్టిన అదనపు కమిషనర్లు, జోనల్ కమిషనర్లు పూర్తి అవగాహన కలిగి ఉండాలని కమిషనర్ ఆర్.వి. కర్ణన్ సూచించారు. జిహెచ్‌ఎంసిని ఇటీవల 6 జోన్‌ల నుంచి 12 జోన్‌లు, 30 సర్కిళ్ల నుంచి 60 సర్కిళ్లుగా పునర్వ్యవస్థీకరించిన నేపథ్యంలో, కొత్త అధికారులకు అవగాహన కల్పించేందుకు ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, హెల్త్, సానిటేషన్, రెవెన్యూ, ప్లానింగ్, అడ్మినిస్ట్రేషన్, సపోర్ట్, అర్బన్ సర్వీసెస్, డెవలప్‌మెంట్ విభాగాల అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ల ద్వారా తమ విభాగాల విధులు, బాధ్యతలను వివరించారు. కమిషనర్ మాట్లాడుతూ, ఈ ప్రజెంటేషన్లు కొత్త అధికారులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఉపయోగపడతాయన్నారు. ఈ నెల 6న ఇంజినీరింగ్ ప్రాజెక్టులు, 7న సానిటేషన్, 8న టౌన్ ప్లానింగ్, 9న మెయింటెనెన్స్ అంశాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్లు సృజన, వినయ్ కృష్ణారెడ్డి, హేమంత్ హేశవ్ పాటిల్, సి.ఎన్.రఘు ప్రసాద్, ఎస్.పంకజ, అలివేలు మంగతాయారు, కె.సత్యనారాయణ, జోనల్ కమిషనర్లు జి.ముకుంద రెడ్డి, అపూర్వ్ చౌహాన్, కె.చంద్రకళ, రాధికా గుప్తా, ఎన్.రవికిరణ్, ప్రియాంక అలా, సంచిత్ గగ్వార్, హేమంత్ బోర్కడే, సహదేవ్ రావు, చీఫ్ ఇంజనీర్లు సానే భాస్కర్ రెడ్డి, సహదేవ్ రత్నాకర్, జ్యోతి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## జిహెచ్‌ఎంసి ప్రజావాణికి 45 అర్జీలు



ప్రజాపక్షం/హైదరాబాద్ : జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి మొత్తం 45 విన్నపాలు, ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో అదనపు కమిషనర్లు సత్యనారాయణ, అలివేలు మంగతాయరు, డైరక్టర్ ప్లానింగ్ బి.ప్రదీప్ కుమార్, అదనపు చీఫ్ సిటీప్లానర్ రజిత్ కుమార్ పాల్గొని ప్రజల అర్జీలను స్వీకరించారు.

### హైడ్రాకు 32 ఫిర్యాదులు

నగరంలో చెరువులే కాకుండా ఊట బావులు కూడా కబ్జాకు గురవుతున్నాయన్న ఆందోళనకర పరిస్థితులు వెలుగుచూస్తున్నాయి. తాజాగా



అల్వాల్‌లోని 200 ఏళ్ల చారిత్రక ఓపెన్ బావిని కబ్జా చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని వెన్‌రాక్ ఎన్‌క్లేవ్ నివాసితులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఆ బావిని కాపాడి చారిత్రక ఆనవాళ్లను పరిరక్షించాలని వారు కోరారు. అలాగే పార్కులు, రహదారులపై అక్రమ నిర్మాణాలపై కూడా పలువురు ఫిర్యాదులు అందజేశారు. హైడ్రా ఏర్పాటైన తర్వాత పలు పార్కులు పునరుద్ధరించడంపై ప్రజలు సంతృప్తి వ్యక్తంచేశారు. సోమవారం నిర్వహించిన హైడ్రా ప్రజావాణికి మొత్తం 32 ఫిర్యాదులు అందగా, వాటిని హైడ్రా అడిషనల్ కమిషనర్ ఆర్.సుదర్శన్ పరిశీలించి సంబంధిత అధికారులకు వాటి పరిష్కార బాధ్యతలు అప్పగించారు.

### పాఠశాల విద్యార్థినులకు

## నిత్యం హెల్త్‌క్యాంపులు

### అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి

ప్రజాపక్షం/రంగారెడ్డి: పాఠశాల విద్యార్థినిలకు నిత్యం హెల్త్ క్యాంపులు నిర్వహించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ కె.చంద్రారెడ్డి అన్నారు. సోమవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ కె చంద్రారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఆహార భద్రత స్టాండింగ్ కమిటీ మీటింగ్ నిర్వహించడం జరిగింది. సమావేశంలో ఆహార భద్రత కొరకు తీసుకోవాల్సిన చర్యలను సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. జిల్లాలో ఉన్న రెసిడెన్షియల్ పాఠశాలలో నాణ్యమైన భోజనం అందించాలని, ఎటువంటి ఫుడ్ పాయిజన్ కేసులు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ కల్తీని అరికట్టే దిశగా చర్యలు ఉండాలని సూచించారు. వీటితోపాటు రైతులకు పెస్టిసైడ్ రహిత పంటలను పండించే విధంగా సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే అంగనఃవాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న ఆహార పదార్థాలు నాణ్యంగా ఉండాలని సంబంధిత అధిరులకు ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.లలితాదేవి, జిల్లా వ్యవసాయ అధికారిఉష, జిల్లా విద్యాశాఖ అధికారి పి.సుసింధర్ రావు, ఎడ్యుకేషనల్ ఆఫీసర్, సివిల్ సప్లై ఆఫీసర్లు వనజాత, హరీష్, ఉమెన్ అండ్ చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్ ఎల్.శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.



## విద్యాభివృద్ధికి ప్రాధాన్యత

### ప్రభుత్వ రంగ సంస్థల చైర్మెన్ వీర్లపల్లి శంకర్



ప్రజాపక్షం/షాద్‌నగర్: విద్యాభివృద్ధికి మొదటి ప్రాధాన్యత కల్పిస్తూ కార్పోరేట్ స్థాయిలో గ్రామీణ విద్యార్థులకు విద్యను అంధించడం జరుగుతుందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మెర్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. సోమవారం తెలంగాణ శాసన సభ సమావేశాల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఇంటిగ్రేటెడ్, ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణ విషయాలను సభ దృష్టికి తీసుకువెళ్ళారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారధ్యంలో దేశానికి ఆదర్శంగా నిలిచే విధంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటేడ్ పాఠశాలను నిర్మించడం జరుగుతుందని, అదే స్థాయిలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అంధించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొందుర్గు మండల కేంద్రానికి వచ్చి స్వయంగా ఇంటిగ్రేటేడ్ స్కూల్ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టడం ఎంతో అభినంధనీయమని, నిర్మాణ పనులు ఎంతో చూరుకుగా సాగుతున్నాయని వివరించారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఉపాధ్యాయుల పోస్టుల పెంచకపోవడమే కాకుండా ఉన్న పాఠశాలలు మూతపడే అస్కారం వచ్చిందని గుర్తు చేశారు. కానీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారధ్యంలో అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటేడ్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి పాఠశాలల ద్వారా ఎస్సీ, ఎస్టి, బీసి వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని వివరించారు. అదే విధంగా షాద్‌నగర్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాలను దాతలు, తన సొంత ఖర్చులతో నిర్మిచడం జరుగుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికే ఆదర్శంగా ఉండే విధంగా నిర్మాణ పనులు చేపట్టడం జరుగుతుందని, ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యే, ఉన్నత స్థాయి అధికారులు సైతం ఇచ్చి పరిశీలించారని వివరించారు. ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ రావుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

### బిసిలకు మంత్రిత్వశాఖ ఏర్పాటుకు

## కేంద్రంపై ఒత్తిడి : కృష్ణయ్య




ప్రజాపక్షం/హైదరాబాద్ : బిసిలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటుకు కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానని బిజెపి ఎంపి ఆర్.కృష్ణయ్య అన్నారు. సోమవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ విద్యుత్తు బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈసందర్భంగా ఈనెల 9న వరంగల్‌లో నిర్వహించే విద్యుత్ బిసి ఉద్యోగుల 20వ మహాసభల పోస్టర్‌ను కృష్ణయ్య ఆవిష్కరించి మాట్లాడారు. విద్యుత్తు శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీచేయాలన్నారు. ఉద్యోగులకు పాత పెన్షన్ అమలు చేయాలన్నారు. విద్యుత్ సంస్థల్లోని 24వేల మంది ఆర్టిజన్లను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోడెపాక కుమారస్వామి, ప్రధానకార్యదర్శి ముత్యం వెంకన్నగౌడ్ పాల్గొన్నారు.

# పరిష్కారాల వేదికగా ప్రజావాణి





### ప్రాజెక్ట్ రాష్ట్ర కోఆర్డినేటర్ రాకేష్‌రెడ్డి

### పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి

ప్రజాపక్షం/రంగారెడ్డి: పరిష్కారాల వేదికగా ప్రజావాణి నిలిచేలా ప్రతిఒక్కరు పని చేయాలని ప్రజావాణి ప్రాజెక్ట్ రాష్ట్ర కోఆర్డినేటర్ రాకేష్‌రెడ్డి అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 45 ఫిర్యాదులు అందాయి. ప్రజల నుండి వివిధ అంశాలకు సంబంధించిన ఫిర్యాదుల వినతి పత్రాలు కలెక్టర్ సి.నారాయణరెడ్డి స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమానికి రాకేష్‌రెడ్డి హాజరై జిల్లా స్థాయిలో ప్రజావాణి నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమం కేవలం సమస్యలు విని దరఖాస్తులు స్వీకరించే విధంగా కాకుండా, పరిష్కారాల వేదికగా నిలిచేలా ప్రతి అధికారి పని చేయాలని కోరారు. ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని వివరించారు. కలెక్టర్ నారాయణ మాట్లాడుతూ జిల్లా ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు మరింత శ్రద్ధ కనబరచాలని, ఫిర్యాదులు సమర్పించడానికి వచ్చిన ప్రజలకు అవసరమైన సూచనలు, సహాయం అందించడంలో అధికారులు సిబ్బంది చొరవ చూపాలన్నారు. అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో రైతులకు యూరియా పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు, సమస్యలు తలెత్తకుండా చూడాలని, యూరియా యాప్ లాంచ్ అయిన తరువాత యాప్ నిర్వహణలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందుగానే ప్రతి హాబీటేషన్ లో పంచాయతీ సెక్రెటరీ, జీపీఓ, ఫీల్డ్ అసిస్టెంట్, ఏఈఓలకు యూరియా యాప్ నిర్వహణలో శిక్షణ ఇవ్వాలని సూచించారు. రాబోయే పరీక్షలలో 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులు వంద శాతం ఉత్తర్ణీత సాధించేలా వారికి ప్రణాళికను సిద్ధం చేసి దాని ప్రకారం ప్రత్యేకమైన తరగతులను నిర్వహించాలని, వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి మరింత శిక్షణ ఇవ్వాలని సంబంధిత అధికారులకు సూచించారు. అండర్–15, అండర్–19 మహిళా చెస్ ఛాంపియన్ షిప్ టోర్నమెంట్‌లలో గెలుపొందిన అత్తాపూర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న జి.శివాంషికను కలెక్టర్ అభినందించారు. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ కె.చంద్రారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## గీత కార్మికులకు ఎక్స్‌గ్రేషియా రూ.10లక్షలివ్వాలి




### రాష్ట్ర ప్రభుత్వానికి మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్ : గీత కార్మికులు ప్రమాదవశాత్తూ మరణిస్తే వారి కుటుంబాలకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేతకు జిఒ తేవాలని, జనగామ జిల్లాకు సర్వాయి పాపన్న నామకరణం చేయాలని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైన్‌షాప్‌ల కేటాయింపుల్లో రిజర్వేషన్లు జిఒ తీసుకురావాలని, కోహెడలోని గౌడ ఆత్మగౌరవ భవనం పనులు ప్రారంభించాలని కోరారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ గౌడ కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో యెలికట్టె విజయ్‌కుమార్ గౌడ్ అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ హాజరై, కమిటీ చైర్మన్ బాలగోని బాల్‌రాజ్‌గౌడ్, కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్‌లతో కలిసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం కులవృత్తులను ధ్వంసం చేసిందని మండిపడ్డారు. రెండేళ్లలో 751 మంది గీత కార్మికులు వృత్తిరీత్యా చెట్ల మీదికెళ్లి పడి ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. కానీ, వీరికి ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం అందకపోవడం దారుణమన్నారు. కల్లుగీత వృత్తి రక్షణే కాదు, అన్ని కులవృత్తులను కాపాడాలని శ్రీనివాస్‌గౌడ్ కోరారు. బాలగోని బాల్‌రాజ్‌గౌడ్ మాట్లాడుతూ కల్లు గీత వృత్తిమీద నార్కోటిక్, పోలీసుల దాడులు, కేసులతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కల్లు అమ్మకాలకు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయిలి వెంకన్నగౌడ్ మాట్లాడుతూ ఒకవైపు ప్రభుత్వ సహకారం లేక, మరోవైపు తమ వృత్తికి రక్షణ లేక కల్లు గీతవృత్తిదారుల జీవనం ఆగమ్యగోచరంగా మారిందని పేరొన్ననది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో గౌడ సంఘాల నేతలు అంబాల నారాయగౌడ్, ఎస్.దుర్గయ్యగౌడ్, వీరస్వామి, ప్రభాకర్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, విజయ కుమార్‌గౌడ్, జిల్లాల నేతలు పాల్గొన్నారు.

"సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శకధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న పాన్ వరల్డ్ అడ్వెంచర్ ప్రాజెక్ట్ 'వారణాసి'పై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే 2027 సమ్మర్‌లో విడుదల చేస్తామని రాజమౌళి అధికారికంగా వెల్లడించగా, తాజాగా ఈ మూవీకి సంబంధించి రిలీజ్ డేట్ దాదాపుగా ఖరారైనట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి."

# రీల్



## 7న 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' ట్రైలర్ విడుదల

మాస్ మహారాజా రవితేజ హీరోగా నటించిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మూవీ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. కిశోర్ తిరుమల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ మూవీని సుధాకర్ చెరుకూరి ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్ నిర్మించారు. భీమ్స్ సిసిరోలియో అందించిన సంగీతం సినిమాపై మరింత హైప్ పెంచింది. ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను రేపు (జనవరి 7న) గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతున్నట్టు ప్రకటించారు. ఈ చిత్రం పక్కా ఫ్యామిలీ ఆడియన్స్‌ను టార్గెట్ చేస్తూ రూపొందింది. ఇప్పటికే విడుదలైన టీజర్ ప్రేక్షకుల్లో విపరీతమైన క్యూరియాసిటీని పెంచింది. ముఖ్యంగా రవితేజ ఇద్దరు భామల ఆషికా రంగనాథ్, డింపుల్ హయాతి మధ్య నలిగిపోయే 'లవ్ ట్రయాంగిల్' సన్నివేశాలు నవ్వులు పూర్తిస్థాయి. జనవరి 7న రాబోయే ట్రైలర్లో కథలోని అసలు ట్విస్టులేంటో, రవితేజ పండించే కామెడీ ఏ రేంజ్లో ఉండబోతోందో పూర్తి క్లారిటీ రానుంది. భీమ్స్ సిసిరోలియో అందించిన సంగీతం ఈ సినిమాకు పెద్ద ప్లస్ పాయింట్. ముఖ్యంగా 'వామ్మో వాయ్యో..' అనే సాంగ్ ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్లో ఉంది. ఈ చిత్రం భోగి పండుగ కానుకగా ఈ నెల 13న థియేటర్లలోకి రానుంది.

# 'మెగా రేడ్'లా ఉంటుంది

\- అనిల్ రావిపూడి



మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటించిన ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్ 'మన శంకర వర ప్రసాద్ గారు' సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రేక్షకుల ముందుకు వస్తున్న ఈ సినిమాకు అనిల్ రావిపూడి దర్శకుడు. విక్టరీ వెంకటేష్ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఇది అత్యంత క్రేజీ కాంబినేషన్‌లో ఒకటిగా నిలిచింది. సినిమా ప్రమోషన్లు ఇప్పటికే అద్భుతంగా జరుగుతున్నాయి. తిరుపతిలో సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో డైరెక్టర్ అనిల్ రావిపూడి మాట్లాడుతూ.. తిరుపతి అంటే నాకు చాలా సెంటిమెంటు. ప్రతి సినిమా రిలీజ్ కి ఇక్కడికి వస్తాను. స్వామివారి ఆశీస్సులు తీసుకుంటాను. ఆయన దయవలన కెరీర్ చాలా హ్యాపీగా ఉంది. అలాంటి తిరుపతి లోనే ఈ ట్రైలర్ లాంచ్ చేయడం చాలా ఆనందంగా ఉంది. మెగాస్టార్ చిరంజీవి గారిని నేను ఎలా చూపించాలి అనుకుంటున్నానో, ఆయన నాకు ఎలా ఇష్టమో, ఆయనలో నాకు ఏం నచ్చుతాయి అనే ఆలోచనతో ఈ కథని రాసుకున్నాను. దానికి తగ్గ అన్ని ఎలిమెంట్స్ ఇందులో ఉన్నాయి. ఈ ట్రైలర్‌లో చూసింది జస్ట్ గ్లింప్స్ మాత్రమే. సినిమా చూసిన తర్వాత ఒక టైం మిషన్ ఎక్కి ఒక రౌండ్ వేసి వస్తారు. అది మాత్రం గ్యారెంటీ. చిరంజీవి గారు లీడర్ రాజు, ఆటో జానీ.. ఇలాంటి క్యారెక్టర్స్‌లో ఆయన మనకు విపరీతంగా నచ్చుతారు. నేను ఆ అలాంటి బేసిస్ లోనే ఈ శంకర వరప్రసాద్ క్యారెక్టర్ రాసుకోవడం జరిగింది. చిరంజీవిలో ఉన్న ఫన్ టైమింగ్ నేచురల్ ఎక్స్‌ప్రెషన్స్ ఈ సినిమాలో అద్భుతంగా ఎక్స్ ప్లోర్ చేశాం. నేను రాసిన దాని కంటే చిరంజీవి దాన్ని వంద రెట్లు అద్భుతమైన పెర్ఫార్మెన్స్‌తో ప్రజెంట్ చేశారు. సంక్రాంతికి వస్తున్నాం నా కెరీర్‌లో స్పెషల్ ఫిలిం. ఆ సినిమాని మీరందరూ థియేటర్స్‌లో అద్భుతంగా సెలబ్రేట్ చేశారు. ఇది నా నాలుగో సంక్రాంతి సినిమా. తప్పకుండా ఆదరిస్తారని నమ్ముతున్నా అన్నారు.

నిర్మాత సాహుగారపాటి మాట్లాడుతూ.. ట్రైలర్ అదిరిపోయింది. సినిమా అంతకంటే అద్భుతంగా ఉంటుంది. లాస్ట్ సంక్రాంతికి మన అనిల్ ఒక హీరోతోనే వచ్చారు. నిర్మాత సుస్మిత కొణిదెల మాట్లాడుతూ.. గుడ్ ఈవెనింగ్ తిరుపతి. సంక్రాంతికి ట్రీట్ ఎలా ఉండబోతుందో ఈ ట్రైలర్ చూస్తే అర్థమౌతుందని చెప్పారు. రామజోగయ్య శాస్త్రి మాట్లాడుతూ నేను ఎప్పుడు కూడా చిరంజీవికి వీరాభిమానిని. అనిల్ రావిపూడిని సంక్రాంతి పందెంకోడి అంటున్నారు. నేను రెక్కల గుర్రం అంటాను. రెక్కల గుర్రం మీద చిరంజీవి ఎక్కారు. అది మామూలుగా ఉండదు. ట్రైలర్ మళ్లీ మళ్లీ చూడాలనిపిస్తోందని తెలిపారు. సంక్రాంతి కానుకగా 12న సినిమా విడుదల కానుంది.

# 30న 'గాంధీ టాక్స్'



అరవింద్ స్వామి ప్రధాన పాత్రలో జీ స్టూడియోస్ నిర్మిస్తున్న మూవీ 'గాంధీ టాక్స్'కు సంబంధించి విడుదల తేదిని అధికారికంగా ప్రకటించారు. ఈ మూవీ జనవరి 30న రిలీజ్ అవుతుంది. ఇండియన్ సినిమాల్లో అరుదైన సైలెంట్ ఫిలింగా 'గాంధీ టాక్స్' రూపొందింది. విజయ్ సేతుపతి, అరవింద్ స్వామి వంటి స్టార్స్ ఈ సైలెంట్ ఫిలింలో నటించారు. అదితి రావు హైదరి, సిద్ధార్థ్ జాదవ్ వంటి స్టార్స్ పాత్రల భావాన్ని, సన్నివేశాల డెప్త్‌ను మాటలు లేకుండా హావభావాలతో కథను నెరేట్ చేయటంలో ప్రత్యేకతను చూపిస్తుంటారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు కిషోర్ బెలేకర్ మాట్లాడుతూ.. 'నిశ్శబ్దం అనే నమ్మి 'గాంధీ టాక్స్' సినిమాను రూపొందించాం. శతాబ్దంగా ఇండియన్ సినీ మేకర్స్ పలు రకాలైన కథలతో సినిమాలు చేస్తున్నారు. ఇలాంటి కళలో పెర్ఫామెన్సెస్, ఎమోషన్స్‌ను బేస్ చేసుకుని సినిమా చేయాలనుకున్నామన్నారు. 30న విడుదలకాబోతోన్న గాంధీ టాక్స్.. నిశ్శబ్దం ద్వారా ఎంతో చెప్పగలమనే కొత్త సినిమాటిక్ అనుభవాన్ని ప్రేక్షకులకు అందించనుంది.

# ఇది పండుగ సినిమా..


## నిర్మాత అనిల్ సుంకర



శర్వానంద్ హీరోగా త్వరలో రాబోతోన్న ఫ్యామిలీ ఎంటర్టైనర్ చిత్రం 'నారీ నారీ నడుమ మురారి'. ఈ మూవీలో సంయుక్త, సాక్షి వైద్యలు హీరోయిన్లుగా నటించారు. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై అనిల్ సుంకర ఈ చిత్రాన్ని నిర్మించారు. దర్శకుడు రామ్ అబ్బరాజు ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. సంక్రాంతి కానుకగా జనవరి 14న ఈ చిత్రాన్ని రిలీజ్ చేయబోతున్నారు. ఈ క్రమంలో నిర్మాత అనిల్ సుంకర మీడియాతో మాట్లాడుతూ.. చిత్ర విశేషాల్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చెప్పిన మీడియాతో 'చిట్ చాట్' నిర్వహించారు. సంక్రాంతికి సరిపడే మూవీగానే 'నారీ నారీ నడుమ మురారి'ని రూపొందించాం. ఇదొక పండుగ మూవీ. సినిమాలకు సంక్రాంతి సీజన్ అనేది వర్కౌట్ అవుతుంది. మేం అనుకున్నట్టుగానే సినిమా వచ్చింది. సంక్రాంతి సీజన్లో నాలు గైదు సినిమాలు అనేవి కామన్. సంక్రాంతి సీజన్లో రిలీజైన అన్ని చిత్రాలు హిట్ అయిన సందర్భాలు కూడా ఉన్నాయి.ఆద్యంతం వినోదభరితంగా సాగే చిత్రమిది. థియేటర్లో కూర్చున్నంత సేపు ఆడియెన్స్ని నవ్విస్తాం. బాలయ్య గారితోనే మా టైటిల్ను ఓపెన్ చేయించాం. మేం పాటని పూర్తిగా వాడలేదు. కేవలం కొన్ని పదాలనే వాడుకున్నాం. మా మూవీని నైజాం, వైజాగ్లో దిల్ రాజు రిలీజ్ చేస్తున్నారు. ఈస్ట్‌లో సొంతంగా చేస్తున్నాం. వెస్ట్, కృష్ణా, గుంటూరులో రాజా, సీడెడ్‌లో శోభన్ రిలీజ్ చేస్తున్నారు. సంక్రాంతి సీజన్లో మా సినిమాను గ్రాండ్‌గా రిలీజ్ చేస్తున్నాం. ఎన్ని థియేటర్లు అన్నది ఇప్పుడున్న పరిస్థితుల్లో ఏ నిర్మాత కూడా చెప్ప లేరు. 'సామజవరగమన' చేసే టైంలోనే రామ్ అబ్బరాజుతో కమిట్ అయ్యాం. రామ్ అబ్బరాజు నెక్ట్స్ మూవీ కోసం మైత్రి వద్దకు పంపించాను. సినిమాలో శర్వానంద్ కాకుండా శ్రీ విష్ణు పాత్ర ఎలా ఉండబోతోందో అంటే సినిమాలో ఓ మంచి పాత్ర పడింది. ఆ కారెక్టర్కి మాకు అందుబాటులో ఉండే హీరో శ్రీ విష్ణు కాబట్టి ఆయన్ను అడిగాం. ఆ పాత్ర వచ్చినప్పుడు థియేటర్‌లో అందరూ ఎంజాయ్ చేస్తారు. సాయి ధరమ్ తేజ్‌తో, తేజ సజ్జాతో సినిమాలు చేయబోతోన్నాను. అడివి శేష్‌తో 'గూఢచారి 2' రాబోతోంది. ఎక్కువగా వినోదాత్మక చిత్రాల్ని చేయాలని అనుకుంటున్నాను. ఈ క్రమంలోనే 'ఎయిర్ ఫోర్స్ బెజవాడ బ్యాచ్' అనే ఓ కామెడీ ఎంటర్‌టైన్‌మెంట్‌ను చేస్తున్నాను అన్నారు.

# ఫిబ్రవరి 6న 'హనీ'

పలాస వంటి సూపర్ హిట్ చిత్రాలను తెరకెక్కించిన కరుణ కుమార్ తాజాగా తెరకెక్కించిన చిత్రం హనీ. నవీన్ చంద్ర, దివ్య పిళ్లై ప్రధాన పాత్రల్లో కరుణ కుమార్ రచన, దర్శకత్వం వహించిన సైకలాజికల్ హారర్ మూవీ హనీ. ఓవిఏ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రవి పీట్ల, ప్రవీణ్ కుమార్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రాన్ని శేఖర్ స్టూడియోస్ సమర్పిస్తోంది. ఫిబ్రవరి 6న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ చిత్రం నిజ జీవిత సంఘటనల నుంచి ప్రేరణతో మూఢనమ్మకాలు, అంధ విశ్వాసాలు, డార్క్ సైకలాజికల్ ఎలిమెంట్స్‌తో ఉండబోతోంది. ఈ చిత్రంలో దివి, రాజా రవీంద్ర, బేబీ జయన్ని, బేబీ జయత్రి కీలక పాత్రలు పోషిస్తున్నారు. హనీ డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను అమెజాన్ ప్రైమ్ వీడియో కొనుగోలు చేసింది.




# 'దక్షిణకాళీ' ప్రీ రిలీజ్



సుబ్బు, ప్రియాంక హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా 'దక్షిణ కాళీ'. హీరోయిన్ అర్చన అమ్మ వారి పాత్రలో కనిపించనుంది. ఈ చిత్రానికి కథను అందించి శ్రీనిధి క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు సత్యవాణి మీసాల. డివోషనల్ కథతో తెరకెక్కిస్తున్నారు దర్శకుడు తోట కృష్ణ. ఈ సినిమా త్వరలో తెలుగు, తమిళ, కన్నడలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ సందర్భంగా మూవీ టీమ్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలోదర్శకుడు తోట కృష్ణ, నిర్మాత సత్యవాణి మీసాల, హీరోయిన్ ప్రియాంక ,నటుడు అఫ్సర్ ఆజాద్, హీరో సుబ్బు పాల్గొన్నారు.

# 'వారెవా వారెవా' పాట విడుదల



అఖిల్ అక్కినేని హీరోగా మనం ఎంటర్‌ప్రైజెస్ ఎల్ఎల్‌పి, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై మురళి కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తోన్న చిత్రం 'లెనిన్'. ఈ సినిమాకు సంబంధించిన పాటను సోమవారం 'వారెవా వారెవా..' అనే లిరికల్ సాంగ్‌ను విడుదల చేవారు. ఈ పాటకు అభిమానులు, మ్యూజిక్ లవర్స్ నుంచి చాలా మంచి రెస్పాన్స్ వస్తోంది. ఈ పాటను అనంత శ్రీరామ్ రాయగా.. శ్వేతా మోహన్, జుబిన్ నౌటియాల్ తమ వాయిస్తో పాటకు ఓ ఎమోషనల్ ఫీల్ను తీసుకొచ్చారు. మ్యూజికల్ సెన్సేషనల్ ఎస్.ఎస్.తమన్ సంగీతం సారథ్యం వహిస్తోన్న ఈ చిత్రంలోని ఈ పాట రొమాంటిక్ ఫీల్‌ను కలిగిస్తోంది. సినిమాలోని భావోద్వేగాలను చక్కగా ప్రతిబింబిస్తూ, హీరోహీరోయిన్ మధ్య కెమిస్ట్రీని హైలైట్ చేసేలా పాట ఉంది. దీంతో ఈ సినిమాపై ఉన్న అంచనాలు మరింత పెరిగాయి. శరవేగంగా షూటింగ్ను పూర్తి చేసుకుంటోన్న ఈ సినిమా ఇప్పటి వరకు 70 శాతం చిత్రీకరణను పూర్తి చేసింది. మూవీని సమ్మర్లో రిలీజ్ చేయటానికి మేకర్స్ సిద్ధమవుతున్నారు. ఈ సినిమాలో అఖిల్ అక్కినేని సరసన భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది.

# 'క్రేజీ కల్యాణం' పోస్టర్




నరేష్ వీకే, అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, రాజ్ వెడ్స్ రాంబాయి ఫేమ్ అఖిల్ ఉడ్డెమారి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా 'క్రేజీ కల్యాణం'. ఈ చిత్రాన్ని యారో సినిమాస్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నెం. 2గా ప్యాషనేట్ ప్రొడ్యూసర్ బూసమ్ జగన్ మోహన్ రెడ్డి నిర్మిస్తున్నారు. దర్శకుడు బద్రప్ప గాజుల రూపొందిస్తున్నారు. పెళ్లి చుట్టూ సాగే ఆసక్తికరమైన కథతో కంప్లీట్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో సాగే చిత్రమిది. తెలంగాణలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో 'క్రేజీ కల్యాణం' సినిమా చిత్రీకరణ జరిపారు. త్వరలో ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని డీటెయిల్స్ మేకర్స్ వెల్లడించనున్నారు. 'ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో', 'రాజు వెడ్స్ రాంబాయి' చిత్రాలకు మ్యూజిక్ అందించిన సురేష్ బొబ్బిలి 'క్రేజీ కల్యాణం' సినిమాకు సంగీతాన్ని అందిస్తున్నారు. నరేష్ వీకే, అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, అఖిల్ ఉడ్డెమారి, తదితరులు నటిస్తున్నారు.

# అమెరికా దురాగతంపై కేంద్రం మౌనం సిగ్గుచేటు: సిపిఐ

న్యూఢిల్లీ: వెనిజులాపై అమెరికా దురాగతాన్ని ఖండించకుండా భారత ప్రభుత్వం మౌనం వహించడం సిగ్గుచేటైన విషయమని భారత్ కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జాతీయ సమితి మండిపడింది. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ కీలక అంశంపై మౌనంగా ఉండటం ద్వారా అమెరికా సామ్రాజ్యవాదంతో జతకట్టాలని భారతప్రభుత్వం అనుసరించిన వైఖరిపై సిపిఐ తీవ్ర ఆందోళన, విచారం వ్యక్తం చేసింది. ఇటువంటి వైఖరి భారతదేశ అలీనత, సామ్రాజ్యవాద, వలసవాద వ్యతిరేకత, గ్లోబల్ సౌత్‌లో అణచివేతకు గురైన దేశాలతో సంఘీభావంతో ఉండే చారిత్రాత్మక నిబద్ధత నుండి నిస్సిగ్గు నిష్క్రమణను సూచిస్తుంది. ఒక విదేశీ శక్తి దేశాధ్యక్షుడ్ని కిడ్నాప్ చేయడం... అంతర్జాతీయ ఉగ్రవాదానికి తీసిపోదు. ఇది అన్ని అభివద్ధి చెందుతున్న దేశాల సార్వభౌమత్వాన్ని బెదిరించే ప్రమాదకరమైన ఉదాహరణను నిర్దేశిస్తుంది. ఇటువంటి చర్యలు పరిపాటిగా మారినట్లయితే గ్లోబల్ సౌత్‌లోని ఏ దేశమూ సామ్రాజ్యవాద నిర్బంధం, ప్రభుత్వాలను మార్చే కుట్రలు, దురాక్రమణ, సైనిక బెదిరింపుల నుండి సురక్షితంగా ఉండజాలవని ప్రకటన పేర్కొంది. భారత ప్రభుత్వం వెంటనే తన సందిగ్ధ, సామ్రాజ్యవాద అనుకూల వైఖరిని విరమించుకోవాలని, వెనిజులాపై అమెరికా దురాక్రమణను స్పష్టంగా ఖండించాలని సిపిఐ డిమాండ్ చేసింది. అంతర్జాతీయ చట్టాలు, జాతీయ సార్వభౌమాధికారం, విదేశీ జోక్యం లేకుండా ప్రజలు తమ స్వంత రాజకీయ, ఆర్థిక వ్యవస్థలను నిర్ణయించుకునే హక్కును కాపాడుకోవడానికి భారతదేశం అంతర్జాతీయ వేదికలపై తన స్వరం పెంచాలని స్పష్టం చేసింది. భారతదేశం అలీన దేశాలతో, లాటిన్ అమెరికాతో, గ్లోబల్ సౌత్‌తో పాటు సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని వ్యతిరేకిస్తున్న అన్ని దేశాలతో దఢంగా నిలబడాలని పేర్కొంది. అమెరికా దార్ష్టికంపై మౌనం వహిస్తే... దానికి సహకరించినట్లేనని తెలిపింది. ఇక వెనిజులాప్రజలకు, చట్టబద్ధ ప్రభుత్వానికి సిపిఐ తన అచంచల సంఘీభావాన్ని పునరుద్ఘాటించింది. సామ్రాజ్యవాదం, సైనికవాదం, నయా వలసవాద దురాక్రమణకు వ్యతిరేకంగా ఐక్యంగా ఉండాలని ప్రపంచవ్యాప్త ప్రగతిశీల శక్తులకు సిపిఐ పిలుపునిచ్చింది.



## ఆర్‌టిసి బస్సులో సిఎం (మొదటి పేజీ తరువాయి)

పూలే చేసిన కృషి, మహిళల కోసం చేసిన పోరాటాలను సినిమాలో కళ్లకు కట్టినట్టు చూపించారని పలువురు ప్రజాప్రతినిదులు ఈ సందర్భంగా అన్నారు. ఇదిలా ఉండగా, సినిమాను తిలకించేందుకు సిఎం సహా అందరూ అసెంబ్లీ నుంచి బస్సులో వెళ్ళారు. సిఎం ప్రయాణిస్తున్న బస్సులు పోలీసులు భారీ సెక్యూరిటీ కల్పించారు.

# తక్షణమే నికోలస్ మదురో, సిలియాని విడుదల చేయాలి

**వెనిజులపై అమెరికా దాడి దురాక్రమణనే సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహ**

ప్రజాపక్షం/హైదరాబాద్: వెనిజులా దేశంపై అమెరికా బాంబులతో దాడి చేసి, ఆ దేశ అధ్యక్షుడు మధురో, ఆయన భార్యను బందీలుగా పట్టుకుపోవడాన్ని నిరసిస్తూ సిపిఐ హైదరాబాద్ కౌన్సిల్ ఆధ్వర్యం లో హిమాయత్‌నగర్ వై జంక్షన్ వద్ద సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటి నరసింహ మాట్లాడుతూ.. అమెరికా నిరంతరం లాటిన్ అమెరికా దేశాలపై అనేక ఆర్థిక ఆంక్షలు విధిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వివిధ దేశాలలో ఉన్న ప్రభుత్వాలను అస్థిర పరిచేందుకు ప్రయత్నిస్తోందని, వనరులను, సహజ సంపదను, చమురు, బంగారం లాంటి నిల్వలను దోపిడీ చేసుకుని వాటి నుంచి లాభాలను పొందేందుకు అమెరికా దాడులు చేస్తున్నదని విమర్శించారు. అమెరికా ఆధిపత్యాన్ని, ఆర్థిక దోపిడీ ఆలోచనలను వ్యతిరేకిస్తూ నిరంతరం పోరాటాలు కొనసాగిస్తున్న వెనిజులా దేశంపై కూడా తీవ్రమైన ఆంక్షలు విధించి, ఆ దేశంలో ప్రభుత్వాలను పడగొట్టే కుట్రలకు తెరదీసిందని మండిపడ్డారు. అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా వెనిజులా దేశంపై బాంబు దాడి చేస్తూ ఆ దేశ అధ్యక్షుడిని బందీగా తీసుకెళ్ళి న్యూయార్క్ జైల్లో వేయడం అత్యంత దారుణమని, ఈ చర్యను నిరసిస్తూ ప్రపంచంలోని అన్ని దేశాలలో ఆందోళన కార్యక్రమాలు జరిగాయన్నారు. ట్రంప్ ప్రభుత్వం ఒక యుద్ధ పిపాసిగా మారిందన్నారు. ఒక దేశాన్ని ఆక్రమించుకోవాలను కున్నప్పుడు ఆ దేశంపై అమెరికా అనేక రకల అబద్ధాలను ప్రచారం చేస్తున్నదన్నారు. డ్రగ్స్ సరఫరా కారణంగానే తమ దేశంలో పౌరులకు ఇబ్బందవుతుందని, వెనిజులాపై ఒక తప్పుడు ప్రచారం చేసిందన్నారు. ఇది తప్పుడు ప్రచారమే అనేందుకు, వెనిజులాలో ఉన్న చమురు నిక్షేపాలను వెలికి తీసి ప్రపంచ వ్యాప్తంగా విక్రయిస్తామని ట్రంప్ చెప్పడమే ఇందుకు ఉదాహరణ అన్నారు.

### వెనిజులాకు అండగా నిలబడదాం : వి.ఎస్.బోస్

ఒక దేశ సార్వభౌమాధికారంపై దాడి చేసి ఆ దేశ అధ్యక్షుడిని బందీగా చేయడమంటే ఆధునిక వలస దేశాలను ఏర్పరచుకోవటమేనని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్ అన్నారు. భవిష్యత్తులో అన్ని దేశాల పైన ఈ విధంగానే దాడులు కొనసాగే అవకాశం ఉన్నది. యుద్ధోన్మాద ట్రంపు నిర్ణయాలకు ఎదిరిస్తూ ప్రజలందరూ రోడ్లపై వచ్చి మధురోకు మద్దతుగా, అమెరికా ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహిస్తున్న వెనిజులా ప్రజలకు అండగా నిలబడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.ఛాయాదేవి, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి సీనియర్ నాయకులు పి.ప్రేమ్ పావని, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు బి.వెంకటేశం, నేర్లకంటి శ్రీకాంత్, పడాల నళిని, షేక్ షంషుద్దీన్, మామిడిచెట్ల వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.




# దంపతులకు బేడీలు వేయడం అత్యంత హేయమైన చర్య : సిపిఐ(ఎం)

ప్రజాపక్షం/హైదరాబాద్ : వెనిజులా దేశ సార్వభౌమాధికారాన్ని కాలరాస్తూ, ఆ దేశ అధ్యక్షుడు నికోలస్ మధురో, ఆయన భార్య సిలియానాను అమెరికా బలగాలు నిర్బంధించడాన్ని నిరసిస్తూ సిపిఐ (ఎం) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఆర్‌టిసి క్రాస్ రోడ్‌లో సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ యుద్ధ విమానాలతో ఒక దేశ మిలటరీ హెడ్ క్వార్ట్స్ పైన దాడి చేసి, బెడ్రూమ్‌లో నిద్రిస్తున్న వెనిజుల అధ్యక్ష దంపతులకు బేడీలు వేయడం అత్యంత హేయమైన చర్య అని అన్నారు. ఒక స్వతంత్ర దేశ నేతను నిర్బంధించే సత్తా తమకే ఉందనే అహంకారాన్ని అమెరికా ప్రదర్శిస్తోందని, వెనిజులాలోని చమురు నిల్వలను దోచుకోవడమే ట్రంప్ అసలు లక్ష్యమని ఆరోపించారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని ఎదిరించి స్వాతంత్ర్యం పొందిన భారతదేశానికి ప్రధానిగా ఉన్ననరేంద్ర మోదీ వెనిజులాలో జరుగుతున్న అన్యాయాన్ని ఖండించకపోవడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. భారత్‌పైన టారిఫ్‌లను విధిస్తామని అమెరికా అధ్యక్షడు ట్రంప్ బెదిరిస్తున్నప్పటికీ ప్రధాని మోదీ స్పందించకపోవడం దేశ ప్రతిష్టకు భంగకరమన్నారు. సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య మాట్లాడుతూ.. ట్రంప్‌నకు ముకుతాడు వేయకపోతే ప్రపంచానికే ప్రమాదమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.సుదర్శన్, నున్నా నాగేశ్వరరావు, బండారు రవికుమార్, టి.సాగర్, ఎండి అబ్బాస్, మల్లు లక్ష్మి, హైదరాబాద్ నగర కమిటీ కార్యదర్శి ఎం.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# భారీ మూల్యం తప్పదు

(మొదటి పేజీ తరువాయి)

ఉల్లంఘించిందని, దీనిపై అంతర్జాతీయ ప్రపంచం స్పందించాలని ఆమె కోరారు. వెనిజులాలో జరిగిన సంఘటనలే ఇతర లాటిన్ అమెరికా దేశాలలో కూడా జరిగే ప్రమాదం ఉందని ఆమె హెచ్చరిక చేశారు. ప్రజల సంకల్పబలాన్ని నాశనం చేయడానికి ఇతర దేశాల నాయకులపై దాడిచేసి వాటి సార్వభౌమాధికారాన్ని, ఆత్మస్థైర్యాన్ని ట్రంప్ దెబ్బతీసేలా బలప్రయోగం చేసే అవకాశాలు ఉన్నాయన్నారు. దేశంలో ఒకవైపు అధికారపార్టీ బలంగా ఉన్న అనేక ప్రాంతాలలో అమెరికా వ్యతిరేక ప్రదర్శనలు జరుగుతుండగా, కారకస్ సహా కొన్ని ఇతర ప్రాంతాలు నిర్మానుష్యంగా ఉన్నాయి. ఆహార దుకాణాలవద్ద ప్రజలు బారులుతీరి నిలబడ్డారు. ట్రంప్ కొనసాగిస్తున్న ఆర్థిక ఆంక్షల కారణంగా వెనిజులాలో ద్రవ్యోల్బణం తీవ్రగా పెరిగిపోయింది. ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు.

# నేను సంతోషంగా లేను

(మొదటి పేజీ తరువాయి)

తిరిగివస్తూ ప్రయాణమార్గంలో ట్రంప్ పాత్రికేయులతో మాట్లాడారు. వారు అడిగిన అనేక ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. 'భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ చాలా మంచివాడు, గత ఏడాది మేం భారత్‌పై 50 శాతం సుంకాలు పెంచిన తర్వాత చాలా వరకూ రష్యా నుండి మోదీ చమురు దిగుమతులు తగ్గించుకున్నారు, వారు (భారత్) నన్ను సంతోషంగా ఉంచాలని కోరుకుంటున్నారు, ప్రాథమికంగా, మోదీ చాలా మంచి వ్యక్తి, కానీ నేను సంతోషంగా లేనన్న విషయం ఆయనకు తెలుసు, నన్ను సంతోషపెట్టడం చాలా ముఖ్యం, వారు వాణిజ్యం చేస్తున్నారు, మేం వారిపై చాలా వేగంగా టారిఫ్‌లు పెంచుతాం, ఈ విషయంలో వారికి నేను చాలా చెడ్డమనిషిని' అన్నారు. ఎయిర్ ఫోర్స్–1 విమానంలో ట్రంప్‌తో పాటు ప్రయాణం చేసిన సెనేటర్ లిండ్‌స్లే గ్రాహం పాత్రికేయులతో మాట్లాడుతూ, భారత్‌పై సుంకాలు విధించినందువల్లనే ఇప్పుడు ఆ దేశం రష్యా నుండి ముడి చమురు కొనుగోలును గణనీయంగా తగ్గించిందన్నారు. దీనిపై ట్రంప్ స్పందిస్తూ పైవిధంగా వ్యాఖ్యానించారు. రష్యా నుండి చమురు దిగుమతి చేసుకునే దేశాలపై సుంకాలను 500 శాతం మేరకు విధించే టారిఫ్ బిల్లు గురించి లిండ్‌స్లే గ్రాహం ప్రస్తావించారు. ఉక్రేన్‌లో యుద్ధం ముగించాలంటే రష్యా నుండి చమురు కొనుగోలు చేసే ఖాతాదారులపై కూడా తీవ్రమైన ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందని అన్నారు. భారత్‌పై ఒత్తిడి తీసుకురావడంకోసమే 25 శాతం అదనపు సుంకాలు విధించామన్నారు. భారత్ ఒకేసారి పూర్తిగా రష్యా నుండి చమురు దిగుమతులను రద్దుచేసుకోలేదని, భారత్ సమస్యను తాను అర్థం చేసుకున్నాననీ, మెల్లిమెల్లిగా రష్యా నుండి భారత్ చమురు కొనుగోళ్ళను పూర్తిగా రద్దుచేస్తుందని గత ఏడాది ఆగస్టులో ట్రంప్ వ్యాఖ్యానించిన విషయం ఈ సందర్భంగా గమనార్హం.

# మదురో

(మొదటి పేజీ తరువాయి)

అమెరికా ప్రభుత్వం మోపిన అభియోగ పత్రాన్ని న్యాయమూర్తి ఆయనకు చదివి వినిపించారు. ఈ పరిణామాలమధ్య కొలంబియా అధ్యక్షుడు పెట్రో తీవ్రంగా స్పందించారు. తన దేశ రక్షణకోసం అమెరికాకు వ్యతిరేకంగా తాను ఆయుధాలు చేపట్టేందుకు సన్నద్ధమవుతున్నానన్నారు. ఈ ఘట్టం అమెరి కా చరిత్రలో గతంలో ఎన్నడూలేని ఒక అసాధారణమైనది. ప్రపంచ నాయకుల విశ్లేషణల ప్రకారం ఈ ఘట్టం భవిష్యత్తులో ట్రంప్ లేదా అమెరికాకు అత్యంత ప్రమాదకరమైన ఘట్టం. నిర్ణీత ప్రకారం మదురోను సోమవారంనాడు న్యూయార్క్ కోర్టు లో నిలబెట్టారు. ఆయన కుంటుతూ నడుస్తున్నా రు. అటార్నీ జనరల్ పామ్ బాండీ అక్కడ హాజరయ్యారు. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. నార్కో–టెర్రరిజం కుట్ర చేశారన్నది నికొలస్ మదురోపై ప్రధానమైన ఆరోపణ. కొకైన దిగుమతి కుట్ర చేశారన్నది మరో అభియోగం. ఆయన దగ్గర భారీ ఎత్తున మెషీన్ గన్స్ ఉన్నాయనీ, విధ్వంసకరమైన ఆయుధాలను పేర్చిపెట్టారని మరో అభియోగం చేశారు. ఇరాక్‌పై దాడి చేయడానికి ముందు కూడా సద్దాం హుస్సేన్‌పై ఇలాంంటి ఆరోపణలే అమెరికా చేసింది. సద్దాం హుస్సేన్ వద్ద ప్రమాదకరమైన రసాయనిక ఆయుధాలు ఉన్నాయని అమెరికా ఆనాడు ఆరోపించింది. అమెరికాలోకి ప్రమాదకరమైన మాదక ద్రవ్యాలను, కొకైన్‌ను రవాణా చేయడం ద్వారా అమెరికా యువత, అమెరికా ప్రజలను నిర్వీర్యం చేసేందుకు మదురో కుట్ర చేశారన్నది ఈనాడు ట్రంప్ చేస్తున్న అభియోగం. ఆయన డ్రగ్ కార్టెల్స్‌ను, మాదక ద్రవ్య వ్యాపారులను పెంచిపోషిస్తున్నారని ఆరోపించి ఖైదీ చేయడం ద్వారా వెనిజులాలో చమురు నిక్షేపాలను స్వాధీనం చేసుకుని తమ కంపెనీలకు పూర్వ వైభవం తీసుకురావాలన్న 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' నినాదం మేరకు ట్రంప్ ఈ చర్యకు పాల్పడ్డారు.

### నార్కో టెర్రరిజం ఆరోపణ హాస్యాస్పదం

కానీ మదురోపై ట్రంప్ చేస్తున్న ఆరోపణలను అమెరికాలోని లివర్‌పూల్ మూర్స్ విశ్వవిద్యాలయంలో న్యాయ అధ్యయనాల ప్రొఫెసర్ జూలియా బక్స్టన్ ఖండించారు. అసలు కొకైన్ జాడలే వెనిజులాలో లేవని అన్నారు. కొకైన్‌ను ఎగుమతి చేసే దేశాల జాబితాలో వెనిజులా లేదని, ఇదంతా పూర్తిగా హాస్యాస్పదమైన ఆరోపణలని తోసిపుచ్చారు. మెక్సికో నుండి పసిఫిక్ తీరం ద్వారా అమెరికాలోకి ఎక్కువ భాగం కొకైన్ ప్రవేశిస్తోందని అన్నారు. వెనిజులాలో అధికారాన్ని తనకు అనుకూలంగా మార్చుకోవడం కోసమే ట్రంప్ ఈ ఆరోపణలు చేస్తున్నారని జూలియా అన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com